సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 262

శుక్రవారం 13-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం’



**ఇన్ఫీకి మరో తలనొప్పి**

ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించిందని అమెరికాలో క్లాస్ యాక్షన్ దావా -బిజినెస్‌లో



**సింధు నిష్క్రమణ**

వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో వరుసగా రెండో ఓటమితో అవుట్ – స్పోర్ట్స్‌లో

## గొల్లపూడి ఇక లేరు

- అనారోగ్యంతో చెన్నైలో తుదిశ్వాస
- ఆదివారం అంత్యక్రియలు -2లో

**సముద్రం మౌనం దాల్చింది**

ఫ్యామిలీలో



## ‘అయోధ్య’ పిటిషన్ల కొట్టివేత

మొత్తం 19 పిటిషన్లకు ఎలాంటి విచారణార్హత లేదన్న సీజేఐ జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం

వివరాలు 13లో



## కేసీఆర్ 2.0 @ 365

- రెండోసారి సీఎంగా ఏడాది పూర్తి చేసుకున్న కేసీఆర్
- రైతు సంక్షేమం, సబ్బండ వర్గాల అభ్యున్నతికి పెద్దపీట

వివరాలు 2లో



## అట్టుడికిన అస్సాం



## పోలీసు కాల్పుల్లో ముగ్గురు మృతి?

13లో

పలు చోట్ల నిరసనలు.. లాఠీచార్జి ● ఇంటర్నెట్‌పై నిషేధం

## సుప్రీంకోర్టుకు పౌరసత్వ బిల్లు

వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లును సవాలు చేస్తూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది.

- వివరాలు 13లో







## మాంద్యం ప్రభావం పడకుండా నిధులివ్వండి

నిర్మలా సీతారామన్‌ను కోరిన టీఆర్‌ఎస్ ఎంపీలు

- వివరాలు 2లో

## జనరల్ నర్సింగ్ కోర్సు ఎత్తివేత

2021–22 నుంచి కోర్సుకు గుడ్‌బై

- వివరాలు 4లో

# ఎన్‌కౌంటర్‌పై త్రిసభ్య కమిషన్

### న్యాయ విచారణకు సుప్రీంకోర్టు ఆదేశం

- ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఈ నిర్ణయం
- ఇతర కోర్టుల్లో ఇక విచారణ అవసరంలేదు
- మృతదేహాలు భద్రపరచాలన్న హైకోర్టు ఉత్తర్వులు యథాతథం.. మేం తదుపరి ఆదేశాలిచ్చేవరకు అవి కొనసాగుతాయి
- ‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం స్పష్టీకరణ

**6 నెలల్లో కమిషన్ నివేదిక**

“పోలీసులపై హత్యాయత్నానికి దిగారంటూ చనిపోయిన వారిని నిందితులుగా చేర్చి విచారణ జరుపుతున్నామని చెప్పడం దర్యాప్తును నీరుగార్చడమే. ఇక్కడ ప్రాసిక్యూషన్ విట్‌నెస్ ఎక్కడుంది? ఇది విచారణ ఎలా అనిపించుకుంటుంది? మీరేమీ చేయలేదని ఎవరు చెబుతారు? మీరు తప్పు చేశారని మేం అనడంలేదు. కానీ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉంది. అందుకే ఈ న్యాయ విచారణ జరిపిస్తున్నాం”

– సుప్రీంకోర్టు

**సాక్షి, న్యూఢిల్లీ:** దిశ హత్యాచారం ఘటనలో నిందితులను ఎన్‌కౌంటర్ చేయడంపై సుప్రీంకోర్టు న్యాయ విచారణకు ఆదేశించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.ఎస్.సిర్పూర్కర్ నేతృత్వంలోని త్రిసభ్య కమిషన్ న్యాయ విచారణ చేపడుతుందని పేర్కొంది. బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రేఖా ప్రకాశ్ బాల్డోట, సీబీఐ మాజీ డైరెక్టర్ డి.ఆర్.కార్తికేయన్ ఇందులో సభ్యులుగా ఉంటారని తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈ కమిషన్.. విధులు ప్రారంభించిన తొలి రోజు నుంచి ఆరు నెలల్లోగా విచారణ పూర్తి చేసి నివేదికను సమర్పిస్తుందని వెల్లడించింది. అప్పటి వరకు ఏ ఇతర కోర్టులూ



సిర్పూర్కర్



రేఖా ప్రకాశ్



కార్తికేయన్

ఎన్‌కౌంటర్ మరణాలపై విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శరద్.ఎ.బాబ్డే నేతృత్వంలోని జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీచేసింది. నిందితులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారని, బాధ్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ జి.ఎస్.మణి, ప్రదీప్‌కుమార్ యాదవ్, ఎంకే శర్మ, మనోహర్ లాల్ శర్మలు దాఖలు చేసిన మూడు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. వాదనలు

మిగతా 4వ పేజీలో ▶






# కేసీఆర్ 2.0 @ 365



- రెండోసారి సీఎంగా ఏడాది పూర్తి చేసుకున్న కేసీఆర్
- గత పర్యాయం ప్రవేశపెట్టిన పథకాలు కొనసాగింపు
- రైతు సంక్షేమం, సబ్బండ వర్గాల అభ్యున్నతికి పెద్దపీట
- రైతుబంధు, ఆసరా పెన్షన్ల సాయం పెంపు
- దృష్టంతా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపైనే
- పొరుగు రాష్ట్రంతో మెరుగైన సంబంధాలు
- పీఆర్సీ కోసం ఉద్యోగులు, నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగుల నిరీక్షణ
- ఆర్థిక మాంద్యం ప్రభావంతో అభివృద్ధి పనులకు ఆటంకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రెండో పర్యాయం బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది పూర్తయింది. రైతు సంక్షేమం, సబ్బండ వర్గాల అభ్యున్నతి కార్యాచరణను యథాతథంగా అమలు చేస్తూ పాలనలో గత ఒరవడిని కొనసాగించారు. రైతుబంధు, ఆసరా పెన్షన్ల పెంపు హామీలను తొలి ఏడాదే అమల్లోకి తెచ్చి సంక్షేమ రంగాన్ని మరింత పటిష్టం చేశారు. పాలనలో సంస్కరణల కొనసాగింపు దిశగా పాత చట్టాల స్థానంలో కొత్త చట్టాల రూపకల్పనకు దృష్టిసారించారు. మున్సిపల్, రెవెన్యూ శాఖల్లో అవినీతిని సమూలంగా నిర్మూలించేందుకు ఇప్పటికే కొత్త మున్సిపల్ చట్టాన్ని అమల్లో తీసుకొచ్చారు. ముసాయిదా రెవెన్యూ చట్టాన్ని సిద్ధం చేశారు. సుపరిపాలన, అవినీతి నిర్మూలన, జాప్యాలను తుద ముట్టించాలనే లక్ష్యంతో ఈ చట్టాల రూపకల్పనకు సీఎం శ్రీకారం చుట్టారు. ఇక సీఎం దృష్టంతా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్రీకృతమైంది. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, నిరంతరం సమీక్షిస్తూ, క్షేత్రస్థాయి పర్యటనలతో పరుగులు పెట్టించారు.

**కాళేశ్వరం జాతికి అంకితం**

రాష్ట్రంలోని 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని సీఎం కేసీఆర్ కలసి గత జూన్ 21న ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించేందుకు రాత్రింబవళ్లు పనులు కొనసాగుతున్నాయి.

### పొరుగు రాష్ట్రంతో సత్సంబంధాలు..

పొరుగు రాష్ట్రం ఏపీతో సంబంధాలు మెరుగయ్యాయి. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ, ఏపీల మధ్య నెలకొన్న విభేదాలు, వివాదాలను చర్చల ద్వారా పరిష్కారానికి రెండు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి కొంత వరకు ఫలించింది. ఇచ్చిపుచ్చుకునే విధానంలో రెండు రాష్ట్రాలు ఇప్పటికే పలు వివాదాలను పరిష్కరించుకుని పరస్పరం సహకరించుకుంటున్నాయి.

**30 రోజుల ప్రణాళిక..**

కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం 30 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేసింది. ఇందులో భాగంగా పవర్ వీక్‌ను నిర్వహించి గ్రామాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించింది.

### వివాదాస్పదమైన నిర్ణయాలు..

రాష్ట్రానికి కొత్త సచివాలయం, అసెంబ్లీ భవన సముదాయాలను నిర్మించాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయి. ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చేసి అక్కడే రూ.400 కోట్లతో కొత్త అసెంబ్లీ భవనాన్ని, ప్రస్తుత సచివాలయ భవనాలను కూల్చి రూ.100 కోట్లతో కొత్త సచివాలయ భవన సముదాయాన్ని నిర్మిస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. పీఆర్సీ, పదవీ విరమణ వయసు పెంపు, పదోన్నతులు వంటి హామీల అమల్లో జాప్యంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన 52 రోజుల సమ్మె సైతం ప్రభుత్వం, ఉద్యోగ, కార్మిక వర్గాల మధ్య దూరాన్ని మరింత పెంచింది. ఇక రెవెన్యూ శాఖలో పెట్రేగిపోయిన అవినీతి నిర్మూలనకు తీసుకొస్తున్న కొత్త రెవెన్యూ చట్టంతో తమ ఉద్యోగ ప్రాధాన్యతలు తగ్గిపోతాయని ఆ శాఖ కింది స్థాయి అధికారుల్లో ఆందోళన నెలకొని ఉంది.

### మాంద్యం దెబ్బకు కొత్త పనులకు బ్రేక్..

ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు గత ఫిబ్రవరిలో రూ.1,82,087 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టగా, గత సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టిన పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను రూ.1,46,492.30 కోట్లకు తగ్గించుకుంది. ఆర్థిక మాంద్యం ప్రభావంతో రాష్ట్ర రాబడులు తగ్గిపోవడం, కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటాలు రాకపోవడంతో 2019–20కి సంబంధించిన బడ్జెట్ అంచనాలను ప్రభుత్వం కుదించాల్సి వచ్చింది. దీని ప్రభావం అభివృద్ధి పనులపై పడింది. ఇప్పటికే ప్రారంభించిన పనులను పూర్తి చేయాలని, కొత్త పనులు చేపట్టరాదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**తొలి ఏడాదే అమలైన హామీలు**

- రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్ని కొనసాగిస్తున్నారు.
- అన్ని రకాల ఆసరా పెన్షన్లను రూ.1,000 నుంచి రూ.2,016కు, వికలాంగుల పెన్షన్లను రూ.1,500 నుంచి రూ.3,016కు ప్రభుత్వం పెంచింది. వృద్ధాప్య పెన్షన్ల కనీస అర్హత వయసు 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించింది. దాదాపు 40 లక్షల మందికి ఆసరా పెన్షన్లు చెల్లించేందుకు ఏటా రూ.5300 కోట్లు ఖర్చు చేస్తోంది.
- రైతు బంధు కింద ఎకరానికి రూ.8 వేలు చొప్పున ఏడాదికి అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచింది.

**నెరవేరాల్సిన హామీల్లో ప్రధానమైనవి..**

- ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ. పదవీ విరమణ వయసు 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పొడిగింపు
- రైతులకు రూ.లక్ష వరకు పంట రుణాల మాఫీ
- నిరుద్యోగులకు నెలకు రూ.3,016 నిరుద్యోగ భృతి చెల్లింపు
- సొంత స్థలం ఉన్న అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు చెల్లింపు
- ఉద్యోగాల నియామకాలకు గరిష్ట వయోపరిమితిని 3 ఏళ్లు పెంపు కొనసాగించడం.

# 88 గెలిచి.. 103కు చేరి..

- అసెంబ్లీలో 103కు చేరిన టీఆర్‌ఎస్ బలం
- 3 విడతల్లో సీఎం సహా 18 మంది మంత్రులుగా ప్రమాణం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌కు బాధ్యతలు..
- లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు.. 'స్థానికం'లో సత్తా

సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి వరుసగా రెండో పర్యాయం అధికారంలోకి వచ్చి శుక్రవారం నాటికి ఏడాది పూర్తయింది. ఉద్యమపార్టీగా 2014 ఎన్నికల్లో పోటీ చేసి తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీఆర్‌ఎస్, 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ముందస్తు ఎన్నికల్లో ఘనవిజయాన్ని సాధించి మరోసారి అధికారాన్ని చేపట్టింది. 88 స్థానాల్లో గెలుపొందిన ఆ పార్టీ.. ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి శాసనసభ్యుల చేరికల ద్వారా బలాన్ని మరింత పెంచుకుంది. గతేడాది డిసెంబర్ 13న సీఎంగా కేసీఆర్‌తో పాటు హోంమంత్రిగా మహమూద్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు. తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రెండో విడత మంత్రివర్గ విస్తరణలో మరో పది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సుమారు ఐదేళ్లుగా మంత్రిమండలిలో మహిళలకు ప్రాతినిధ్యం లేదనే విమర్శకు తెరదించుతూ ఈ ఏడాది సెప్టెంబర్ మొదటివారంలో మరో మారు కేసీఆర్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. హరీశ్‌రావు, కేటీఆర్, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ మూడో విడత విస్తరణలో మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. కేబినెట్‌లో గరిష్టంగా సీఎం సహా 18 మందికి మాత్రమే చోటు కల్పించే అవకాశం ఉండటంతో పలువురు పార్టీ నేతలకు కేబినెట్ హోదాతో నామినేటెడ్ పదవులు అప్పగించారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు.

### టీఆర్‌ఎస్‌ఎల్పీలో కాంగ్రెస్ శాసనసభాపక్షం విలీనం

గతేడాది డిసెంబర్‌లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో 88 స్థానాల్లో విజయం సాధించిన టీఆర్‌ఎస్ ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి శాసనసభ్యుల చేరికల ద్వారా బలాన్ని పెంచుకుంది. ఫలితాలు వెలువడిన వెంటనే ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ తరపున గెలుపొందిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, వైరా ఇండిపెండెంట్ ఎమ్మెల్యే ఎల్. రాములునాయక్ టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. టీడీపీ శాసన సభ్యుడు సండ్ర వెంకట వీరయ్య ఆ పార్టీకి దూరంగా ఉంటూ టీఆర్‌ఎస్‌తో సన్నిహితంగా మెలుగుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నుంచి 19 మంది గెలుపొందగా, 12 మంది టీఆర్‌ఎస్ గూటికి చేరుకోవడంతో ఈ ఏడాది జూన్‌లో టీఆర్‌ఎస్‌ఎల్పీలో కాంగ్రెస్ శాసనసభా పక్షం విలీనమైంది. ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయం సాధించారు. రాష్ట్ర కేబినెట్‌లో చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రభుత్వ చీఫ్ విప్, విప్‌లుగా, శాసనసభా కమిటీల్లో సీఎం కేసీఆర్ చోటు కల్పించారు. మిత్రపక్షంగా ఉంటున్న ఏఐఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీకి పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్ పదవి దక్కింది. 40 మంది సభ్యులున్న శాసనమండలిలోనూ తన బలాన్ని టీఆర్‌ఎస్ గణనీయంగా పెంచుకోగా, మండలి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా రెండో పర్యాయం సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిగంటల వ్యవధిలోనే కేటీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు.

**లోక్‌సభలో మిశ్రమం.. స్థానికంలో ఏకపక్షం**

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాన్ని నమోదు చేసుకున్న టీఆర్‌ఎస్ రెండో పర్యాయం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలను చవిచూసింది. 17 లోక్‌సభ స్థానాలకు గాను 9 చోట్ల టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందగా, బీజేపీ 4, కాంగ్రెస్ 3, ఏఐఎంఐఎం ఒకచోట విజయం సాధించింది. అయితే ఈ ఏడాది మేలో జరిగిన స్థానిక సంస్థల్లో 32 జెడ్పీ చైర్మన్ స్థానాలతో పాటు, ఎంపీటీసీ ఫలితాల్లో 63 శాతం విజయాన్ని నమోదు చేసింది. ఒక్కసారి కూడా గెలవని హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సెప్టెంబర్‌లో జరిగిన ఉపఎన్నికలో తొలిసారిగా గెలుపొందింది.

## క్లుప్తంగా...

### పల్లెకు బ్యాంకింగ్ సేవలు అందాల్సిందే

**ఆర్థిక సేవలపై రాష్ట్రాలకు కేంద్రం లేఖ**

సాక్షి, హైదరాబాద్: మారుమూల గ్రామాలకు ఆర్థిక సేవలను విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి 5 కిలో మీటర్లకు ఓ బ్యాంకింగ్ ఔట్‌లెట్ ఉండేలా చూడాలని జిల్లాల కలెక్టర్లను కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి భూషణ్‌కుమార్ సిన్హా రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు. బ్యాంకింగ్ కేంద్రం లేకపోతే తక్షణమే జిల్లా, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి పల్లెలోనూ బ్యాంకు శాఖ, బ్యాంకింగ్ కరస్పాండెంట్లు, ఏటీఎం లేదా పేమెంట్ బ్యాంకులు అందుబాటులో ఉంచేలా కేంద్రం నిర్ణయించిందన్నారు. బ్యాంకుల మధ్య మరింత సమన్వయం కోసం జనధన్ దర్శక్ యాప్‌ను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే ఔట్‌లెట్స్ కూడా ఈ యాప్‌ను వినియోగించాలని సూచించారు. ప్రతి బ్యాంకింగ్ ఔట్‌లెట్‌ను పర్యవేక్షించేలా జీఐఎస్ ట్యాగింగ్ చేశామని వివరించారు.

### భారత 'బ్లాక్‌చెయిన్' అంబాసిడర్‌గా తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: నూతన ఐటీ సాంకేతికత బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వినియోగాన్ని విస్తృతం చేయడంలో చేస్తున్న కృషికి గానూ హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వినియోగంలో భారతదేశానికి తెలంగాణ ప్రభుత్వాన్ని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తున్నట్లు గ్లోబల్ బ్లాక్‌చెయిన్ బిజినెస్ కౌన్సిల్ (జీబీబీసీ) ప్రకటించింది. ఈ మేరకు జీబీబీసీ ప్రకటనను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ గురువారం ఒక ప్రకటనలో స్వాగతించారు.

### జనవరి 2 నుంచి 'పల్లె ప్రగతి'

**మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడి**

సాక్షి, హైదరాబాద్: జనవరి 2 నుంచి పది రోజుల పాటు మరోమారు 'పల్లె ప్రగతి' కార్యక్రమాన్ని అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. గ్రామాల సమగ్రాభివృద్ధిలో పంచాయతీ కార్మికులు, కారోబార్లదే కీలకపాత్ర అని అన్నారు. పచ్చదనం, పరిశుభ్రత ఉట్టిపడేలా గ్రామాలను తీర్చిదిద్దుకోవాలని.. ఉద్యోగం కోసం కాకుండా సొంత ఊరి కోసం పనిచేస్తున్నామనేలా పనితీరు ఉండాలని వారికి సూచించారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనం పెంచినందుకు గానూ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ కార్మిక విభాగం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడారు. పల్లె ప్రగతి స్ఫూర్తితో నిత్యం గ్రామాభివృద్ధిలో పాల్గొనడం ద్వారా కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలపాలని కార్మికులకు సూచించారు.

### జనశక్తి మాజీ నేత చంద్రన్న మృతి

**న్యూడెమోక్రసీ తీవ్ర సంతాపం**



ముషీరాబాద్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రభుత్వానికి నక్సలైట్లకు మధ్య జరిగిన చర్చల్లో జనశక్తి పక్షాన ప్రతినిధిగా పాల్గొన్న జనశక్తి మాజీ నేత కె.చంద్రన్న (75) గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. కొంతకాలంగా మధుమేహం, శ్వాసకోశ వ్యాధులతో ఆయన బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఇటీవల విద్యానగర్‌లోని ఆంధ్ర మహాసభ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. యాదాద్రి జిల్లా టంగుటూర్ గ్రామానికి చెందిన చంద్రన్న ఈసీఐఎల్ ఉద్యోగిగా పనిచేశారు. ఉద్యోగం చేసే సమయంలో విప్లవ కార్మిక సంఘాలతో పరిచయం ఏర్పడి భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ), జనశక్తిల రాష్ట్రస్థాయి నేతగా ఎదిగారు. బీడీ, సింగరేణి కార్మికుల అనేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు. నగర కార్మిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఎల్వీ ప్రసాద్, నిమ్స్ ఆస్పత్రుల కార్మిక సంఘాలకు నాయకుడిగా కొనసాగారు. పదేళ్ల క్రితం జనశక్తి నాయకుడు కూర రాజన్నతో విభేదించి స్వతంత్రంగా అణగారిన వర్గాల పక్షాన పోరాటాలు చేస్తూ వచ్చారు. ఆయనకు నలుగురు కుమారులు. కొంతకాలం కిందట భార్యతోపాటు ఓ కుమారుడు మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11 గంటలకు రాంనగర్‌లోని శ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మృతి పట్ల న్యూడెమోక్రసీ తీవ్ర సంతాపం ప్రకటించింది.

### హైదరాబాద్‌లో కజికిస్తాన్ కాన్సులేట్

సాక్షి, హైదరాబాద్: కజికిస్తాన్ దేశ కాన్సులేట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ఆ దేశ రాయబారి యెర్లాన్ అలింబాయేవ్ వెల్లడించారు. ఎంఏకే ప్రాజెక్ట్స్ ఎండీ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్‌ను గౌరవ కాన్సుల్ జనరల్‌గా నియమించనున్నట్లు తెలిపారు. గురువారం హైదరాబాద్ సందర్శించిన ఆయన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

### భాష్యం బ్లూమ్స్‌కు ఏషియన్ బెస్ట్ స్కూల్ అవార్డు

నెహ్రూనగర్ (గుంటూరు): ఆసియాలోనే బెస్ట్ సీబీఎస్ఈ హైస్కూల్‌గా భాష్యం బ్లూమ్స్‌కు అవార్డు వచ్చినట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. యూఎస్ఏకు చెందిన ఇంటర్నేషనల్ బ్రాండ్ కన్సెల్టింగ్ కార్పొరేషన్ వారు ఆసియాలో నిర్వహించిన సర్వేలో భారత్ తరపున ఏషియన్ బెస్ట్ సీబీఎస్ఈ హైస్కూల్ కేటగిరీలో భాష్యం బ్లూమ్స్ ఈ అవార్డును కైవసం చేసుకుందన్నారు. ఈ నెల 11న థాయ్‌లాండ్‌లో జరిగిన కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు, సీఈఓ చైతన్య అవార్డుని అందుకున్నట్లు చెప్పారు.

### టాలెంట్ టెస్ట్‌లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: రామానుజన్ మ్యాథమెటిక్స్ అకాడమీ, మ్యాథమెటిక్స్ లైబ్రరీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మ్యాథమెటిక్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించినట్లు డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యారామ్ గురువారం తెలిపారు. ఈ పోటీలు నవంబర్ 10న జరగ్గా గురువారం ఫలితాలు విడుదల చేసినట్లు చెప్పారు. 8వ తరగతి విద్యార్థులు వై.ఠాగూర్ రవీంద్రశ్రీ మొదటి ర్యాంకు, జె.మారుతి రెండవ ర్యాంకు, 9వ తరగతి విద్యార్థులు భువనారెడ్డి మొదటి ర్యాంకు, ఆర్.హర్షవర్ధన్ రెండో ర్యాంకు, పదో తరగతి విద్యార్థి పి.కార్తికేయ రెండో ర్యాంకు, నాలుగో తరగతి విద్యార్థి వీఎస్.నివేదిత మొదటి ర్యాంకు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను సంస్థ డైరెక్టర్‌లు అవినాష్, శ్రీతేజలు, ప్రిన్సిపాల్స్ ఎం.రామిరెడ్డి, విజయశేఖర్, జ్యోతి అభినందించారు.

# 'గొల్లపూడి' ఇకలేరు

- అనారోగ్య కారణాలతో చెన్నైలో తుదిశ్వాస
- ఆదివారం అక్కడే అంత్యక్రియలు
- రచయిత, నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలిగా సుప్రసిద్ధులు

సాక్షి ప్రతినిధి, చెన్నై: ప్రముఖ రచయిత, సినీ నటుడు గొల్లపూడి మారుతీరావు (81) కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉ.11.15 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య శివగామి సుందరి, కుమారులు సుబ్బారావు, రామకృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు. శ్రీనివాస్ గతంలోనే ప్రమాదానికి గురై మరణించారు. సాహిత్యాభిలాషిగా, రచయితగా అన్ని రంగాలకు చెందిన అంశాలపై విశ్లేషకునిగా, విప్లవాత్మకమైన విమర్శకునిగా పేరొందిన గొల్లపూడి.. తెలుగు భాషాభిమానులకు, సినీ ప్రేమికులకు పెద్దగా పరిచయం చేయాల్సిన అవసరంలేని వ్యక్తి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. చెన్నైలో జరిగే తెలుగు సంఘాల కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న గొల్లపూడి.. అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై గత నెల 5న చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అనంతరం కోలుకుని ఇంటికి చేరారు. అయితే, మళ్లీ అస్వస్థతకు గురై ఇటీవల ఆస్పత్రిలో చేరారు. వృద్ధాప్య కారణాలవల్ల శరీరం చికిత్సకు సహకరించకపోవడంతో గురువారం తుదిశ్వాస విడిచారు. గొల్లపూడి మారుతీరావు 1939 ఏప్రిల్ 14న అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (పూర్వపు మద్రాసు ప్రావిన్స్) విజయనగరంలో జన్మించారు. విద్యాభ్యాసాన్ని విశాఖపట్నంలోనే పూర్తిచేశారు. ఈ కారణంతోనే ఆయన చెన్నైలో తన కుటుంబ సభ్యులతో ఉంటూనే నెలలో కొన్నిరోజులు విశాఖలో గడుపుతూ సాహితీ ప్రియులకు అందుబాటులో ఉండేవారు.

### 15న చెన్నైలో అంత్యక్రియలు

గొల్లపూడి మారుతీరావు అంత్యక్రియలు ఈనెల 15న చెన్నైలో జరపనున్నట్లు ఆయన చిన్న కుమారుడు రామకృష్ణ తెలిపారు. తండ్రి భౌతికకాయాన్ని శనివారం ఉదయం ఆస్పత్రి నుంచి స్వగృహానికి తీసుకొచ్చి ఆదివారం ఉదయం వరకు బంధుమిత్రులు, అభిమానుల సందర్శనార్థం ఉంచుతామని చెప్పారు. జర్మనీలో ఉంటున్న కుమారుడు సుబ్బారావు పెద్ద కుమార్తె, అమెరికాలో చదువుకుంటున్న మూడో కుమార్తె.. మారుతీరావు రెండో కుమారుడు రామకృష్ణ కుమారుడు శ్రీనివాస్ జర్మనీ నుంచి రావాల్సి ఉన్నందున అంత్యక్రియలను ఆదివారం నిర్వహించేందుకు నిర్ణయించారు.

### సాహితీ విమర్శ గళం మూగబోయింది: ఉపరాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ: గొల్లపూడి మారుతీరావు మృతిపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. విలక్షణ రచయిత, విమర్శకుడు, జాతీయ భావాలు కలిగిన మానవతావాది, సినీ నటుడు గొల్లపూడి లేరనే వార్త తీవ్ర బాధకలిగించిందన్నారు. రేడియో, నాటకాలు, కథల రచయితగా ఎప్పటికీ తెలుగు ప్రజల మనసుల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. విలక్షణమైన వ్యక్తిత్వం కలిగిన గొల్ల పూడి ఎంతో ఆత్మీయుడని పేర్కొన్నారు. చిత్రా ల్లో విభిన్నమైన పాత్రలతో తెలుగు ప్రజల గుం డె తెర మీద గొల్లపూడి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

### గొల్లపూడి మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: సుప్రసిద్ధ రచయిత, నటుడు, సంపాదకుడు గొల్లపూడి మారుతీరావు మృతిపట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సినిమా రంగానికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి కొనియాడారు. తెలుగు సాహిత్యంపై ఆయన రాసిన పరిశోధనాత్మక రచనలు, నాటకాలు తెలుగు భాషాభివృద్ధికి దిశానిర్దేశం చేశాయన్నారు. మారుతీరావు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి అమరావతి: గొల్లపూడి మారుతీరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన గొల్లపూడి.. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో గర్వించదగిన స్థానాన్ని సంపాదించారని కొనియాడారు. వినూత్నమైన డైలాగ్ డెలివరీతో పాటు రచనల్లో, నాటకాల్లో తనదైన శైలితో ఆయన అందరినీ ఆకట్టుకున్నారని వైఎస్ జగన్ గుర్తుచేశారు. గొల్లపూడి తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారని పేర్కొన్నారు.

### విచ్చుకున్న 'రిశాట్–2బీఆర్1' యాంటెన్నా

సూళ్లూరుపేట: దేశీయ అవసరాల నిమిత్తం బుధవారం సాయంత్రం 3.25 గంటలకు పీఎస్ఎల్వీ సీ48 రాకెట్ ద్వారా రోదసీలోకి పంపించిన రాడార్ ఇమేజింగ్ ఎర్త్ అబ్జర్వేషన్ (రిశాట్–2బీఆర్1) ఉపగ్రహానికి అమర్చిన రేడియల్ రిబ్ యాంటెన్నా గురువారం విజయవంతంగా విచ్చుకున్నట్లు ఇస్రో ప్రకటించింది. 628 కేజీల బరువు కలిగిన రిశాట్–2బీఆర్1 ఉపగ్రహాన్ని భూమికి 576 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు 9.12 నిమిషాల వ్యవధిలో యాంటెన్నా విజయవంతంగా విచ్చుకుంది.

### ఏసీబీ గాలానికి.. కరెంటు చేప!

**లంచం తీసుకుంటూ చిక్కిన రంగారెడ్డి డీఈ**

సాక్షి, హైదరాబాద్: ఏసీబీ వలకు మరో అవినీతి చేప చిక్కింది. రంగారెడ్డి జిల్లా సైబర్ సిటీ సర్కిల్ (ఎస్పీడీసీఎల్) డీఈ ముత్యం వెంకటరమణ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డాడు. ఓ అపార్ట్‌మెంట్ ఎలక్ట్రిక్ పనులకు సంబంధించి ఫైలు కదిపేందుకు మైలారపు శివకుమార్ అనే ఎలక్ట్రిక్ కాంట్రాక్టరును రూ.25వేలు లంచం అడిగాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మెహిదీపట్నంలోని వెంకటరమణ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ మాదాపూర్‌లోని వెంకటరమణ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడి చేశారు. దాడుల్లో రూ.20.4 లక్షల నగదు, 60 తులాల బంగారం, వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.2.9 కోట్లుగా ఉంటుందని అంచనా.

# మాంద్యం ప్రభావం పడకుండా నిధులివ్వండి

**నిర్మలా సీతారామన్‌ను కోరిన టీఆర్‌ఎస్ ఎంపీలు**

సాక్షి, న్యూఢిల్లీ: దేశ ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్రాలపై పడకుండా ఉండాలంటే రాష్ట్రాలకు కేంద్రం ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను టీఆర్‌ఎస్ ఎంపీలు కోరారు. ఈ మేరకు పార్టీ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు నేతృత్వంలో ఎంపీలు బీబీ పాటిల్, పసునూరి దయాకర్, బండ ప్రకాశ్, లింగయ్య యాదవ్, రంజిత్ రెడ్డి, పి. రాములు, వెంకటేష్ నేత, శ్రీనివాసులు రెడ్డి, మాలోతు కవిత గురువారం పార్లమెంటులో కేంద్ర మంత్రిని కలసి తెలంగాణకు రావాల్సిన నిధుల వివరాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ రాసిన లేఖను అందజేశారు. రాష్ట్రానికి ఐజీఎస్టీ కింద రూ. 4,531 కోట్లు, వెనుకబడిన జిల్లాకు రూ. 450 కోట్లు, గ్రామీణాభివృద్ధి గ్రాంట్స్, నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధులు మొత్తంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ. 29,891 కోట్ల నిధులు రావాల్సి ఉందని వివరించారు. ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్రాలపై పడకుండా ఉండాలంటే కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

**చేతకాని తనంగా మాట్లాడవద్దు..**

తెలంగాణ రాష్ట్రానికి నిధులు సాధించుకొనే విషయంలో రాజకీయాలు చేయవద్దని ఇతర పార్టీల ఎంపీలకు నామా సూచించారు. నిధుల విషయంలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణకు నిధుల సాధనపై పోరాటం చేయాలి తప్పా ఇష్టానుసారంగా మాట్లాడకూడదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంది కాబట్టి రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ ఎంపీలు నిధుల సాధనలో ముందుండాలి తప్పా చేతకాని తనంగా తెలంగాణ అభివృద్ధికి అడ్డుగా మాట్లాడడం సరైందికాదని నామా హితవు పలికారు. అలాగే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసిన నామా.. భారత్ మాల పరియోజన పథకం కింద కోదాడ–ఖమ్మం నాలుగు లేన్ల రహదారి పనులు చేపట్టాలని కోరారు.



**ఇదం జగత్**



యూటర్న్ ఎక్కువగా తీసుకుంటే హెల్త్ మీద ఎఫెక్ట్ పడుతుందని ముందే చెప్పాగా సార్!

# ఆ భూములు అప్పగించండి!

- కుల సంఘ భవనాలకు స్థలాలు ఖరారు
- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 67.30 ఎకరాలు కేటాయింపు
- హద్దు రాళ్ల పాతాలని రెవెన్యూ అధికారులకు ఆదేశం
- బీసీ సంక్షేమ శాఖకు అప్పగించాలని స్పష్టీకరణ

**సాక్షి, హైదరాబాద్:** వెనుకబడిన తరగతుల్లోని పలు కులాలకు కేటాయించిన ఆత్మగౌరవ భవనాల నిర్మాణాల ప్రక్రియలో మరో అడుగు పడింది. బీసీల్లోని దాదాపు 36 కులాలకు ప్రభుత్వం ఆత్మగౌరవ భవనాల ఏర్పాటు కోసం మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో వివిధచోట్ల 67.30 ఎకరాల స్థలాలను కేటాయించింది. అదేవిధంగా నిర్మాణ పనులకు నిధులను సైతం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఈ ఆత్మగౌరవ భవనాలకు కేటాయించిన స్థలాలకు నిర్దేశించిన సర్వేనంబర్లలో హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. హద్దురాళ్లు ఏర్పాటు చేసిన తర్వాత ఆ స్థలాలను బీసీ సంక్షేమ శాఖకు అప్పగించాలని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి గత వారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ నేతృత్వంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఈ స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. స్థలాల తీరు, నిర్మాణాలకు అనువైన పరిస్థితులు తదితర అంశాలను అందులో పొందుపర్చారు.

### డిజైన్ల రూపకల్పన

బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాలను బీసీ సంక్షేమ శాఖకు అప్పగించిన తర్వాత స్థలం స్వభావం, డైమెన్షన్ల ఆధారంగా భవనాలను డిజైన్ చేయనుంది. నెలాఖరులోగా స్థలాలను బీసీ సంక్షేమ శాఖకు అప్పగించేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. హద్దురాళ్లు ఏర్పాటు చేసిన తర్వాత రెవెన్యూ అధికారులు కుల సంఘాల వారీగా కేటాయించిన స్థలాల పొడవు, వెడల్పులతో నమూనాలను చిత్రీకరిస్తారు. వీటి ఆధారంగా భవనాల డిజైన్లను తయారు చేస్తారు. ఈ డిజైన్లు తయారు చేసేందుకు ఆర్అండ్బీ ఇంజనీరింగ్ అధికారుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు బీసీ సంక్షేమ శాఖ చర్యలు చేపట్టనుంది. డిజైన్ల రూపకల్పనలో కులానికి సంబంధించిన సంస్కృతి, చరిత్ర, యోధులు, వీరత్వం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ భావిస్తోంది. ఇందుకు సంబంధించి సమగ్ర నివేదికను తయారు చేసేందుకు ఆ శాఖ సిద్ధమవుతోంది.

## 23, 24న విద్యాశాఖలో పలు పోస్టులకు పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** పాఠశాల విద్యాశాఖలో పలు పోస్టుల భర్తీకి ఈ నెల 23, 24 తేదీల్లో ఆన్లైన్ పరీక్షలు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ను సవరించింది. డీఈవో కార్యాలయాలు, మండల రీసోర్సు కేంద్రాల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఐఈఆర్పీ, సిస్టం అనలిస్ట్, అసిస్టెంట్ ప్రోగ్రామర్ పోస్టుల భర్తీకి గతంలోనే దరఖాస్తులను స్వీకరించింది. గత నెలలో పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్ జారీ చేసినా, సాంకేతిక కారణాలతో నిర్వహించలేదు. తాజాగా సవరించిన షెడ్యూల్ను గురువారం జారీ చేసింది. ఈ పరీక్షలను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, మహబూబ్నగర్, ఖమ్మం జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని పేర్కొంది. 23వ తేదీ ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు ఐఈఆర్పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పోస్టులకు, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 వరకు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. మిగతా పోస్టులకు 24న ఉదయం 9 నుంచి 11:30 వరకు పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించింది.

## 2 వర్సిటీల ఇన్చార్జి వీసీగా నీతూకుమారి

**సాక్షి, హైదరాబాద్:** పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, నిజామాబాద్లోని తెలంగాణ యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ చాన్స్లర్గా కమర్షియల్ టాక్సెస్ కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.










## ఎంపికైన డీటీలకు నియామకపు పత్రాలు

**సాక్షి, హైదరాబాద్:** టీఎస్పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దార్లుగా ఎన్నికైన 259 మందిలో ఐదుగురు మినహా మిగతావారికి రాష్ట్ర ప్రభుత్వం నియామకపత్రాలు అందజేసింది. వరంగల్ (పట్టణ), రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు ప్రశాంత్ జీవన్ పాటిల్, హరీశ్లు.. జోన్–5, జోన్–6కు కేటాయించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కాగా, జోన్–5లో నలుగురు గైర్హాజరు కాగా.. జోన్–6లో ఒక అభ్యర్థి సర్టిఫికెట్ల వెరిఫికేషన్కు హాజరు కాలేదు. దీంతో గురువారం 254 మందికి నియామక పత్రాలు జారీ చేశారు. వీరి నియామకంతో తహసీల్దార్ కార్యాలయాల్లో కీలక అధికారుల కొరత తీరనుంది. ఒకట్రెండు రోజుల్లో వీరిని ఉమ్మడి జిల్లాల వారీగా కేటాయించనున్నారు.

## 24 నుంచి టీఎస్ఎస్పీ ఆర్ఎస్సైలకు శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ)కు ఎంపికైన కేడెట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ (ఆర్ఎస్ఐ)లకు ఈనెల 24వ తేదీ నుంచి హిమాయత్సాగర్లోని రాష్ట్ర పోలీసు అకాడమీ (టీఎస్పీఏ)లో శిక్షణ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థులు 18వ తేదీన ఉదయం 10 గంటలకు యూసఫ్గూడ మంజీరాహాల్లోని టీఎస్ఎస్పీ ఫస్ట్ బెటాలియన్లో రిపోర్టు చేయాలని గురువారం ఓ ప్రకటనలో అధికారులు తెలిపారు. కేడెట్ సబ్–ఇన్స్పెక్టర్ మెస్, ఆర్బీవీఆర్ఆర్, టీఎస్పీఏ పేరిట రూ. 15 వేల డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకురావాలని సూచించారు. అలాగే అన్ని విద్యార్హత, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, 10 పాస్పోర్టు ఫొటోలు, ఇండెమ్నిటీ బాండ్తో హాజరు కావాలని పేర్కొన్నారు.

## 14న ఆర్టీసీలో 'అప్రెంటిస్షిప్'పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో గత అక్టోబరు 31 నాటికి అప్రెంటిస్షిప్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 14న ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆర్టీసీ డిపోలు, యూనిట్లు, ఆయా ట్రేడ్లలో అప్రెంటిస్షిప్ పూర్తి చేసిన అభ్యర్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్ రీజియన్కు సంబంధించిన అభ్యర్థులు కూకట్పల్లి వై–జంక్షన్ వద్ద ఉన్న కూకట్పల్లి బస్స్టేషన్ ప్రాంగణం వద్ద.. హైదరాబాద్ రీజియన్కు చెందిన అభ్యర్థులు ఓ.వై.సి ఆసుపత్రి మిధాని బస్స్టేషన్ ప్రయాణ ప్రాంగణం వద్ద ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. మిగతా రీజియన్లకు సంబంధించిన అభ్యర్థులు శుక్రవారం సంబంధిత డిపోలను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.




| మోడల్ | తిన్నగా వచ్చే ప్రయోజనం (₹) | ఎక్స్ఛేంజ్ ప్రయోజనం (₹) | కార్పొరేట్ ప్రయోజనం (₹ వరకు) | మొత్తం ప్రయోజనం (₹ వరకు) |
|---|---|---|---|---|
| M8 | 1,39,000 | 25,000 | 7,000 | 1,71,000 |
| M6 | 77,000 | 25,000 | 7,000 | 1,09,000 |
| M4 | 36,000 | 15,000 | 7,000 | 58,000 |

# కార్యకర్తలకు అండగా ఉంటాం

## టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భరోసా



**సాక్షి, హైదరాబాద్:** పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల కుటుంబాలకు నిరంతరం అండగా ఉంటామని టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ప్రమాదవశాత్తూ మరణించే కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచేందుకు రూ.11.21 కోట్లను బీ మా సంస్థకు ప్రీమియంగా చెల్లించినట్లు వెల్లడించారు. ఇటీవల వివిధ ప్రమాదాల్లో మరణించిన 22 మంది పార్టీ కార్యకర్తల కుటుం బాలకు గురువారం తెలంగాణభవన్‌లో రూ.2 లక్షల చొప్పున బీమా పరిహా రం చెక్కులను ఆయన అందజేశారు. పరిహారం ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో బాధిత కుటుంబాలకు పార్టీ నేతలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇతరత్రా ఇబ్బందులేవైనా ఉంటే తనను సంప్రదించాల్సిందిగా బాధిత కుటుంబాలకు సూచించారు.

**గ్రంథాలయం ప్రారంభం:** తెలంగాణ భవన్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కేటీఆర్ ప్రారంభించారు. తెలంగాణ చరిత్ర, ఉద్యమ సాహిత్యం, తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన అభివృద్ధికి సంబంధించిన పూర్తి సమాచారం గ్రంథాలయంలో అందుబాటులో ఉంటుందన్నారు.

## ఆర్థిక క్రమశిక్షణ అప్పుడు గుర్తు రాలేదా?: దాసోజు



**సాక్షి, హైదరాబాద్:** ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మిగిల్చి ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ అంటూ కేసీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు. కొత్త అసెంబ్లీ, సచివాలయం కట్టాలనుకున్నప్పుడు ఆర్థిక క్రమశిక్షణ గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో అబద్ధాలు, మోసాలతోనే పాలన సాగించారని ఆరోపించారు. కమీషన్లు దండుకోవడానికి కాళేశ్వరం, మిషన్ కాకతీయ, భగీరథలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారన్నారు. లిక్కర్ ఆదాయాన్ని రూ.22 వేల కోట్లకు పెంచుకోవడం తప్ప సాధించిన ప్రగతి ఏమీ లేదని ఎద్దేవా చేశా రు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని, కులాల వారీ కార్పొరేషన్లు పెట్టలేదని, ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచలేదన్నారు.




బీజేపీ మహిళా సంకల్పదీక్షలో మాట్లాడుతున్న లక్ష్మణ్, పక్కన డీకే అరుణ

## ‘దీక్ష’ ఉద్యమానికి నాంది మాత్రమే

### బీజేపీ మహిళా సంకల్పదీక్షలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ చేపట్టిన మహిళా సంకల్ప దీక్ష మద్యనిషేధ ఉద్యమానికి నాంది మాత్రమేననీ దీన్ని దశలవారీగా ఉధృతం చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. మద్యం ప్రభావంతోనే మహిళలపై నేరాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, తెలంగాణలో మద్యాన్ని నిషేధించే వరకు పోరాడతామని వెల్లడించారు. గురువారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రెండురోజుల మహిళా సంకల్ప దీక్షకు లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యనియంత్రణ శాఖను, మద్యాన్ని పెంచే శాఖగా మార్చారన్నారు. ‘దిశ’సంఘటన తరువాత మద్యం పై సర్వత్రా చర్చ సాగుతోందని ఆడపిల్లలపై అకృత్యాలకు మద్యమే ప్రధాన కారణమని భావించి బీజేపీ దీక్ష చేస్తోందన్నారు. ఏపీ సీఎం జగన్ మద్య నియంత్రణపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారో వాటిని చూసైనా ఇక్కడి ప్రభుత్వం నేర్చుకోవాలని హితవు పలికారు. తాగండి, తన్నుకు చావండి అన్నట్లు సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బెల్ట్ షాపులను, అక్రమంగా వెలసిన పబ్‌లను కూడా ధ్వంసం చేయండని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీక్ష కేవలం ఉద్యమానికి నాంది మాత్రమే నన్నారు.

**తాగుబోతుల తెలంగాణగా మారింది: డీకే అరుణ**

బంగారు తెలంగాణను సీఎం కేసీఆర్ తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. మద్యం ప్రభావంతోనే దిశ, మానస, సమతలపై అత్యాచారాలు జరిగాయని, తెలంగాణ ప్రభుత్వం మద్య నిషేధంపై ఆలోచన చేయాలని తెలిపారు. ఉద్యమ సమయంలో తాను చెప్పిన మాటలను సీఎం కేసీఆర్ మర్చిపోయారని అభిప్రాయపడ్డారు.

# జనరల్ నర్సింగ్ కోర్సు ఎత్తివేత

- 2021–22 విద్యా సంవత్సరం నుంచి కోర్సుకు గుడ్‌బై
- జీఎన్‌ఎంతో స్కిల్డ్ నర్సులు రావడం లేదన్న ఆరోపణలు
- కోర్సును రద్దు చేయాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఆదేశాలు
- రాష్ట్రంలో దాదాపు 6 వేల జీఎన్‌ఎం సీట్లు ఔట్..
- వాటిని బీఎస్సీ నర్సింగ్ సీట్లుగా అప్‌గ్రేడ్ చేసుకోవడంలో అనాసక్తి
- నర్సుల్లో జీఎన్‌ఎం వారే 80% మంది.. తీవ్రమవనున్న నర్సుల కొరత

**సాక్షి, హైదరాబాద్:** జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) కోర్సుకు ప్రభుత్వం ముగింపు పలికింది. 2021–22 విద్యా సంవత్సరం నుంచి జీఎన్‌ఎం కోర్సు నిర్వహించేదిలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో 138 ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ స్కూళ్లల్లో 6 వేలకు పైగా జీఎన్‌ఎం సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇన్ని వేల సీట్లను ఒకేసారి రద్దు చేస్తుండటంతో నర్సింగ్ విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య మరింత పడిపోయే ప్రమాదముంది. కొన్ని రాష్ట్రాల్లో జీఎన్‌ఎం కోర్సు రద్దు చేసినా, వాటి స్థానే బీఎస్సీ నర్సింగ్ కోర్సు నిర్వహించేందుకు అనుమతించారు. దీంతో జీఎన్‌ఎం సీట్లు పోయినా బీఎస్సీ నర్సింగ్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ మన రాష్ట్రంలో ఇప్పటివరకూ ఆ దిశగా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నర్సుల్లో 80 శాతం జీఎన్‌ఎం అర్హత కలిగినవారే ఉన్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో బీఎస్సీ నర్సింగ్ చేసిన వాళ్లకంటే, జీఎన్‌ఎం చేసిన వాళ్లకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. బీఎస్సీ వాళ్ల కంటే తక్కువ వేతనాలకు పని చేయడమే ఇందుకు కారణమని నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అంటున్నారు.



### నైపుణ్యం ఉండటం లేదు..

డీఎంఈ పరిధిలోకి జీఎన్‌ఎం కోర్సులు వస్తాయి. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోకి బీఎస్సీ నర్సింగ్ కోర్సులు వస్తాయి. ఇంటర్ బైపీసీ చదివిన వాళ్లు బీఎస్సీ నర్సింగ్‌కు అర్హులుకాగా, ఇంటర్‌లో ఏ గ్రూప్ చదివినా జీఎన్‌ఎం చేయొచ్చు. జీఎన్‌ఎం మూడేళ్ల కోర్సు కాగా, బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల కోర్సు. అయితే జీఎన్‌ఎం పూర్తి చేసినా చాలా మంది నర్సుల్లో నైపుణ్యం ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. అందుకే చాలా ఆసుపత్రులు వీరికి తక్కువ వేతనాలిస్తూ పని ఎక్కువ చేయించుకుంటున్నాయన్న విమర్శలున్నాయి. పైగా జీఎన్‌ఎం డిప్లొమా కోర్సుగా కొనసాగుతోంది. దీంతో తదుపరి ఉన్నతస్థాయి కోర్సులకు వెళ్లడానికి వీలుండటం లేదని నర్సింగ్ విద్యార్థులు చెబుతున్నారు. దీన్ని కూడా డిగ్రీగా పరిగణిస్తే ప్రయోజనం ఉంటుందంటున్నారు. దీనిపై ఎన్ని విజ్ఞప్తులు చేసినా సర్కారు పట్టించుకోలేదని అంటున్నారు. జీఎన్‌ఎం కోర్సుతో నైపుణ్యం రావడం లేదన్న ఆరోపణల నేపథ్యంలోనే ఆ కోర్సును పూర్తిగా రద్దు చేయాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్ణయించింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించింది.

### ఇక ‘నర్సింగ్’వైపు కష్టమే..

ప్రస్తుతం రాష్ట్రంలో నర్సుల కొరత విపరీతంగా ఉంది. ఇంకా వేలాది మంది నర్సుల అవసరముంది. కానీ రాష్ట్రంలో సుమారు 80 ప్రైవేటు, 6 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో కలిపి బీఎస్సీ నర్సింగ్ సీట్లు కేవలం 5 వేల లోపే ఉన్నాయి. ఇందులో 40 శాతం కన్వీనర్ కోటా సీట్లు కాగా, 60 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లున్నాయి. మేనేజ్‌మెంట్ కోటా సీటు ఫీజు మొత్తం రూ.5 నుంచి 6 లక్షల వరకు ఉంటుంది. అలాగే మూడేళ్ల జీఎన్‌ఎం కోర్సుకు కూడా ప్రైవేటు కాలేజీలు రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు బీఎస్సీ నర్సింగ్‌లో కన్వీనర్ కోటా సీట్లు రాని విద్యార్థులంతా జీఎన్‌ఎం కోర్సుల్లో చేరుతున్నారు. ఇప్పుడు జీఎన్‌ఎం కోర్సు ఎత్తేస్తుండటంతో నర్సింగ్ చదివే విద్యార్థుల సంఖ్య మరింత తగ్గే అవకాశముందని నర్సింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జీఎన్‌ఎం కోర్సులు అందించే నర్సింగ్ స్కూళ్లను, బీఎస్సీ నర్సింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయాలని నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి లక్ష్మణ్ రుడావత్ కోరుతున్నారు.




## మహిళా కండక్టర్ల ఆప్రాన్ ఇలా..

**సాక్షి, హైదరాబాద్:** త్వరలో బస్సుల్లోని మహిళా కండక్టర్లు ఎరుపు రంగులో ఉన్న ఆప్రాన్ ధరించి విధుల్లో ఉండనున్నారు. మహిళా కండక్టర్లకు కొత్త యూనిఫామ్ కలర్ ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించడంతో అధికారులు ప్రస్తుతానికి దీన్ని ఎంపిక చేశారు. ఒక్కో మహిళా కండక్టర్‌కు ఇలాంటివి రెండు ఆప్రాన్‌లు, లేసుల్లేని షూ జత ఇవ్వనున్నారు. మహిళా అధికారి సుధ ఆధ్వర్యంలో కొందరు మహిళా కండక్టర్లతో ఏర్పాటు చేసిన కమిటీ ఈ రంగును ఎంపిక చేసి ఎండీకి నివేదిక అందజేసింది. ప్రస్తుతానికి ఆప్రాన్‌ల జారీతో సరిపుచ్చి, కొద్ది కాలం తర్వాత చీర/చుడీదార్‌లకు కూడా ప్రత్యేక యూనిఫామ్ ఉండేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు. ఎక్కువ మంది మహిళా కండక్టర్లు మాత్రం, చీర/చుడీదార్‌లను యూనిఫామ్‌లో చేర్చవద్దని, సాధారణ వస్త్రాలు ధరించి వాటిపై యూనిఫామ్‌లో భాగంగా ఆప్రాన్ ధరిస్తామని కోరారు. ఇప్పటికిప్పుడు చీరలు, చుడీదార్‌లు కొనేందుకు ఆర్టీసీ వద్ద డబ్బులు కూడా లేనందున.. ప్రస్తుతానికి పాత యూనిఫామ్‌పై ఆప్రాన్ ధరించేలా ఆదేశాలివ్వాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు చెర్రీ ఎరుపు రంగు వస్త్రం కోసం రేమండ్స్ షోరూమ్‌లను అధికారులు సంప్రదించారు. ప్రస్తుతానికి ఆప్రాన్ కోసం 8 వేల మీటర్ల వస్త్రం కావాల్సి ఉంది. చెర్రీ ఎరుపు అందుబాటులో లేని పక్షంలో దాన్ని మార్చే అవకాశం ఉంది. దాని బదులు ప్రత్యామ్నాయంగా నీలి రంగును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ తుది నిర్ణయం తీసుకుని ఆదేశాలు జారీ చేయనున్నారు.

# సుప్రీంకోర్టు వివరణ తీసుకోండి

**ఎన్‌కౌంటర్ మృతదేహాలను భద్రపరచడంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

- అప్పటివరకు గాంధీ ఆస్పత్రిలోనే భద్రపరచండి
- ‘పిల్స్’పై విచారణ నేటికి వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన దిశ నిందితుల మృతదేహాలను భద్రపరిచే వ్యవహారంపై సుప్రీంకోర్టు వివరణ తీసుకొని తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టులో శుక్రవారం ఉదయం ప్రత్యేకంగా ప్రస్తావించి స్పష్టత తీసుకోవాలని ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై దాఖలైన పలు ప్రజాహిత వ్యాజ్యాలపై విచారణను శుక్రవారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది. అప్పటివరకు నిందితుల మృతదేహాల్ని గాంధీ ఆస్పత్రిలోనే భద్రపర్చాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దిశ నిందితులు ఆరిఫ్, శివ, నవీన్, చెన్నకేశవులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై ఐపీసీలోని 302 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై వివిధ విచారణలను నిలుపుదల చేస్తూ సుప్రీంకోర్టు స్టే ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. మీడియాలో వచ్చిన సమాచారం ప్రకారం ఎన్‌కౌంటర్‌పై విచారణను సుప్రీంకోర్టు స్టే చేసిందని, ఈ పరిస్థితుల్లో ‘పిల్స్’పై



తాము విచారణ జరిపి ఒక్క లైను ఉత్తర్వులు కూడా ఇవ్వబోమని ధర్మాసనం తేల్చి చెప్పింది. నలుగురి మృతదేహాల గురించి సుప్రీంకోర్టు ఏమీ చెప్పినట్లుగా లేదని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. త్రిసభ్య కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేయడంతో ఆ కమిటీ మృతదేహాల్ని చూడాలని అనుకుంటోందా లేదా ఆ కమిటీ వచ్చే వరకూ మృతదేహాల్ని భద్రపరచాలా లేదా ప్రభుత్వం కోరినట్లుగా మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలా ఇదీకాక ఇంకేమైనా ఉత్తర్వులు ఇస్తుందా అనేది సుప్రీంకోర్టు నుంచి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు పొందాలని ధర్మాసనం పేర్కొంది.

### ప్రభుత్వం స్పష్టత తీసుకోనవసరం లేదు: ఏజీ

అంతకుముందు అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ మృతదేహాల్ని భద్రపరిచినట్లు సుప్రీంకోర్టు దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తీసుకువెళ్లారని చెప్పారు. దీనిపై లిఖితపూర్వక ఉత్తర్వులు ఏమీ లేవన్నారు. శుక్రవారం మృతదేహాల్ని తీసుకువెళ్లేందుకు నిందితుల కుటుంబ సభ్యులు సిద్ధంగా ఉన్నారని, ఎన్‌కౌంటర్‌పై సందేహాలు లేనందున సుప్రీంకోర్టు నుంచి ప్రభుత్వం స్పష్టత తీసుకోవాల్సిన అవసరం ఏమీ లేదన్నారు. అయితే కోర్టుకు సహాయకారిగా నియమితులైన (అమికస్ క్యూరీ) సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి మాత్రం ఏజీ ప్రకటనలో స్పష్టత లేదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు నుంచి ప్రభుత్వం శుక్రవారం తెలుసుకుని వివరణ తీసుకోవాలని, తదుపరి విచారణను వచ్చే సోమవారానికి (16వ తేదీకి) వాయిదా వేయాలని కోరారు. ఈ దశలో పిటిషనర్ తరఫు సుప్రీంకోర్టు న్యాయవాది వృందా గ్రోవర్ వాదిస్తూ ఎన్‌కౌంటర్ కేసులో సుప్రీంకోర్టు వాడిన పదాలను పరిశీలిస్తే ఎన్‌హెచ్‌ఆర్సీ, సిట్ దర్యాప్తులపై స్టే ఇచ్చిందని, హైకోర్టులోని కేసులపై కాదన్నారు. మృతదేహాల భద్రత వ్యవహారాన్ని పెండింగ్‌లో పెట్టాలని, శుక్రవారం తాము సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లి వివరణ పొందుతామని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ‘సుప్రీంకోర్టు స్టే అంటే హైకోర్టు విచారణ సహా కావచ్చు. అయినా మీడియాలో వచ్చిన కథనాలపై కాకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వుల ద్వారా స్పష్టమైన వివరణ ముఖ్యం కాబట్టి ప్రభుత్వమే సుప్రీంకోర్టు నుంచి వివరణ తీసుకోవాలి’అని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఈహెచ్‌ఎంఎస్ ద్వారా హాస్టళ్ల నిర్వహణ

**సాక్షి, హైదరాబాద్:** సంక్షేమ వసతి గృహాల నిర్వహణ ఇకపై ఈ-హాస్టల్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఈహెచ్‌ఎంఎస్) ద్వారా జరుగుతుందని ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకుడు కరుణాకర్ స్పష్టం చేశారు. హాస్టల్ విద్యార్థుల డైట్ బిల్లు లు, కాస్మోటిక్ చార్జీల బిల్లులను ఈహెచ్‌ఎంఎస్ ద్వారానే సమర్పించాల్సి ఉంటుందన్నారు. గురువారం జిల్లా సంక్షేమాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వసతి గృహాలకు కేటాయించిన బడ్జెట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని, నిర్దేశించిన గడువులోగా బిల్లులు సమర్పించాలని సూచించారు. ఈ నెల 31తో ఉపకార వేతన దరఖాస్తు గడువు ముగుస్తుందని, ఆలోపు వచ్చిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకుంటామన్నారు.



మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో జరిగిన సీఎస్ ఎస్‌కే జోషి కుమార్తె వివాహానికి హాజరైన సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు మహమూద్‌అలీ, ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

# ఎన్‌కౌంటర్‌పై త్రిసభ్య కమిషన్

▶ మొదటి పేజీ తరువాయి

విన్న అనంతరం.. ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉన్నందునే కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు న్యాయస్థానం పేర్కొంది. ‘కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్–1951’ ద్వారా దఖలుపడిన అధికారాలన్నీ ఈ కమిషన్ కలిగి ఉంటుందని వెల్లడించింది. కమిషన్‌కు హైదరాబాద్‌లో కావాల్సిన కార్యాలయం, వసతి, సచివాలయ సిబ్బంది, రవాణా సౌకర్యాలను తెలంగాణ ప్రభుత్వం సమకూర్చాలని ఆదేశించింది. అలాగే కమిషన్‌కు సీఆర్‌పీఎఫ్ భద్రత కల్పించాలని సూచించింది. కమిషన్‌కు కౌన్సిల్‌గా న్యాయవాది కె.పరమేశ్వరన్ వ్యవహరిస్తారని పేర్కొంది. నిందితుల మృతదేహాలు భద్రపరచాలన్న తెలంగాణ హైకోర్టు ఆదేశాలు తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు కొనసాగుతాయని ధర్మాసనం స్పష్టంచేసింది.

### ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నల వర్షం..

అంతకుముందు ఈ పిటిషన్లపై తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిం చారు. గంటపాటు సాగిన విచారణలో తొలుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శరద్ ఎ.బాబ్డే.. ప్రశ్నల వర్షం కురిపించారు. దిశ హత్యోదంతం సంఘటన రోహత్గీ వివరిస్తుండగా.. పిటిషన్ కేవలం ఎన్‌కౌంటర్‌కు సంబంధించినదని ధర్మాసనం ప్రస్తావించడంతో ఎన్‌కౌంటర్ జరిగిన తీరును రోహత్గీ నివేదించారు. ‘పోలీసులు నిందితులను తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో క్రైమ్ సీన్‌కు తీసుకెళ్లారు. అక్కడ బాధితురాలికి సంబంధించిన మొబైల్ వంటి వస్తువులను సేకరించారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా ఘటన తీరును తెలుసుకునే క్రమంలో విచారిస్తుండగా నిందితులు పోలీసులపై రాళ్లతో దాడి చేశారు. ఆయుధాలను లాక్కుని కాల్చడం ప్రారంభించారు’ అని తెలిపారు. జస్టిస్ బాబ్డే జోక్యం చేసుకుని ‘పోలీసుల నుంచి ఆయుధాలను లాక్కునే పరిస్థితి ఉంటుందా?’ అని ప్రశ్నించారు. దీనికి రోహత్గీ బదులిస్తూ.. ‘రాళ్లతో దాడి చేసి ఆయుధాలు లాక్కున్నారు. పోలీసులపైకి కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులకు గాయాలు కూడా అయ్యాయి’ అని బదులిచ్చారు. మరి దీనికి సంబంధించి మెడికల్ రిపోర్ట్ ఉందా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నిందితుల ను ఘటనాస్థలికి తీసుకెళ్లిన పోలీసు అధికారుల ర్యాంక్(హోదా) ఏంటని, కాల్పు లు జరిపిన అధికారుల ర్యాంక్ ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఏసీపీ నేతృత్వం లో సీఐ, ఎస్‌ఐ ర్యాంకులతో కూడిన అధికారుల బృందం అక్కడికి వెళ్లిందని రోహత్గీ వివరించారు. నిందితులు పిస్టల్‌ను, రాళ్లను ఒకేసారి ఎలా వినియోగించారని జస్టిస్ బాబ్డే ప్రశ్నించారు. వారు కాల్పులు జరిపారా? జరిపితే ఆ బుల్లెట్లను సేకరించారా? వాటిని ఎక్కడ దాచారు? అంటూ ప్రధాన న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు రోహత్గీ వివరంగా సమాధానాలు చెప్పారు. ఆత్మరక్షణలో భాగంగానే పోలీసులు చంపారని, వారికి వేరొక మార్గం కనిపించలేదని వివరించారు. ఈ ఎన్‌కౌంటర్‌పై సిట్ నిష్పాక్షిక విచారణ జరుపుతోందని, ఆ నివేది క వచ్చాక అవసరమైన పక్షంలో తదుపరి చట్టపరమైన చర్యలు ఉంటాయని నివేదిం చారు. అయితే ఈ సందర్భంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపిస్తే వచ్చే ఇబ్బందేంటని ధర్మాసనం ప్రశ్నించింది.

### సమాంతర దర్యాప్తు వీలుకాదు

ఇప్పటికే పీయూసీఎల్ కేసులో సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలన్నీ అమలు చేశామని, ఘటనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, పోలీస్ కమిషనర్ నేతృత్వంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) దర్యాప్తు జరుపుతోందని రోహత్గీ వివరించారు. దర్యాప్తు స్వతంత్రతపై విశ్వాసం లేనప్పుడే ఎన్‌హెచ్‌ఆర్సీ జోక్యం చేసుకోవాలని సుప్రీం కోర్టు మార్గదర్శకం ఉన్నప్పటికీ, దానిని కాదని ఇప్పటికే ఎన్‌హెచ్‌ఆర్సీ విచారణ జరుపుతోందని తెలిపారు. ఒకవైపు సిట్ ఈ కేసులో దర్యాప్తు జరుపుతుండగా మరోవైపు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో సమాంతర దర్యాప్తు సాధ్యం కాదని పేర్కొన్నారు. ‘పోలీసులపై తిరగబడి వారిపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ నిందితులపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. నిందితులు ఇద్దరు పోలీసు అధికారుల నుంచి ఆయుధాలు లాక్కుని కాల్పులకు దిగడంతో పోలీసులు ప్రతిఘటనగా ఈ కాల్పులు జరిపారు’ అని రోహత్గీ వివరించారు.

### ఈ విచారణ హాస్యాస్పదం...

‘పోలీసులపై హత్యాయత్నానికి దిగారంటూ చనిపోయిన వారిని నిందితులుగా చేర్చి విచారణ జరుపుతున్నామంటూ చెప్పడం దర్యాప్తును నీరుగార్చడమే. ఇక్కడ ప్రాసిక్యూషన్ విట్‌నెస్ ఎక్కడుంది? ఇది విచారణ ఎలా అనిపించుకుంటుంది. విశ్వసనీయతతో కూడిన అంశంగా దీనిని చూడాలి. మీరు మాట్లాడుతున్న విచారణకు అర్థం లేదు. నిందితులు లేరు. శిక్ష ఉండదు. మీ రక్షణ కోసమే నిర్వహించే విచారణ అవుతుంది. మీరేమీ చేయలేదని ఎవరు చెబుతారు? ఎవరి సాక్ష్యం ఆధారంగా చెబుతారు? ఈ విచారణ హాస్యాస్పదం అవుతుంది. ఈ విషయంలో మీరు స్టేట్స్‌మెన్‌లా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాం. ఇది పరిహాసం కాకూడదు’ అని జస్టిస్ బాబ్డే పేర్కొన్నారు.

### మీరు దోషులని మేమనడం లేదు

‘మీరు తప్పు చేశారని మేం అనడంలేదు. కానీ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి నిజాలు తెలియాల్సిన అవసరం ఉంది. ప్రజలకు తప్పనిసరిగా నిజాలు తెలియాలి. అందుకే ఈ న్యాయ విచారణ జరిపిస్తున్నాం.. వాస్తవాలు ఇవి అని మేం ఊహించజాలం. నిందితులు పోలీసుల కస్టడీలో ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. న్యాయ విచారణ జరగనివ్వండి. ఈ విషయంలో మీరు ఎందుకు అభ్యంతరపెడుతున్నారు’ అని ధర్మాసనం ప్రశ్నించింది. కానీ ఎన్ని ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించగలమని న్యాయవాది రోహత్గీ వాదించారు. ‘ఒకవైపు సిట్ దర్యాప్తు చేస్తోంది. ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా విచారిస్తోంది. ఇంకా ఎన్ని విచారణలు జరుగుతాయి?’ అని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ బాబ్డే స్పందిస్తూ ‘సిట్.. ఈ కమిషన్‌కు సహకరించవచ్చు. సాక్ష్యాలను సమర్పించవచ్చు’ అని సూచించారు. దీనిపై రోహత్గీ స్పందిస్తూ.. ‘కమిషన్‌ను నియమిస్తే హైకోర్టు, ఎన్‌హెచ్‌ఆర్సీ విచారణలను నిలుపుదల చేయండి’ అని నివేదించారు.

### మీడియాను నియంత్రించండి: పిటిషనర్

‘దిశ హత్యోదంతంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇదిగో సాక్ష్యం, అదిగో సాక్ష్యం అంటూ మీడియా అనవసరంగా ప్రసారాలు చేసి కేసుపై ప్రభావం చూపింది. ప్రజలను రెచ్చగొట్టేలా చేసింది’ అని పిటిషనర్లలో ఒకరైన మనోహర్‌లాల్ శర్మ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంలో ధర్మాసనం స్పందిస్తూ ‘విచారణ కమిషన్ విచారణ జరుపుతున్నప్పుడు మీడియా పబ్లిసిటీ ఇవ్వకుండా నియంత్రించాలని, విచారణపై కామెంట్లు చేయడం ఆపేలా నియంత్రించాలని సలహా వచ్చింది. అయితే ఈ విషయంలో ఆదేశాలు జారీ చేసేముందు సంబంధిత మీడియా అభిప్రాయం కూడా తీసుకోవాలని రోహత్గీ చెప్పారు. ఈ దిశగా మేం అభిప్రాయం కోరుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, పీటీఐకి నోటీసులు జారీ చేస్తున్నాం. దీనికి నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలి’ అని పేర్కొంది. కాగా పీటీఐని ఇంప్లీడ్ చేసేందుకు వీలుగా దరఖాస్తు చేసుకునేందుకు మనోహర్ లాల్ శర్మకు స్వేచ్ఛ ఇస్తున్నట్టు ఆదేశాల్లో స్పష్టంచేసింది. అలాగే ఈ కేసులో ప్రతివాది అయిన కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది.

**SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED**
6-1-50, Corporate Office, Mint Compound, Hyderabad-500 063

**TENDER NOTICE**

TSSPDCL intends to float tenders for procurement of (I)11KV End Termination Kits (ii) 1Cx120 Sq.mm LT XLPE Cable and (iii) RS Joist 175 x 85 mm on e-procurement platform.
For further details please visit www.tssouthernpower.com and www.tender.telangana.gov.in. Ph: 040-23431033, 1448, 1360.

ID. SPDCLCORP01443
Sd/- M.Balaraju, Chief General Manager(P&MM)

తెలంగాణ ప్రభుత్వం
**ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No.44/Yadadri/TUFIDC/Unit-II/CC Roads and Drains/2019-20, తేదీ: 11.12.2019
క్ర.సం. 1. పనిపేరు: యాదగిరి గుట్ట మున్సిపాలిటీ TUFIDCచే ఫండింగ్ అసిస్టెన్స్ క్రింద లోటస్ టెంపుల్ – బస్టాండ్ – టౌన్ మరియు పరిధి వరకు తుఫాన్ నీటి డ్రెయిన్/వరదనీటి రిటైనింగ్ వాల్ నిర్మాణము మరియు వివిధ ప్రదేశాల వద్ద CC రోడ్లు వేయుట. అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ.12,50,62,190.00. బిడ్ దాఖలు ముగింపు తేదీ: 02.01.2020న సా.04.30 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @tender.telangana.gov.inలో చూడవచ్చును. ఏవేని తదుపరి స్పష్టీకరణలు అవసరమైనచో SE(PH) కార్యాలయం, TUFIDC, UNIT-II, నల్గొండ వారిని కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు సెల్ నం. 9701385146.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, (PH), TUFIDC, UNIT-II (FAC)
DIPR Ro.No.1939-DP/CL/Advt/1/2019-20, Dt: 12.12.2019

**TGUGCET -2020**
2020-21 విద్యా సంవత్సరానికి తెలంగాణ సోషల్ వెల్ఫేర్/తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజిలలో మొదటి సంవత్సరం U.G. కోర్సులలో ప్రవేశానికి ప్రకటన

నోటిఫికేషన్ Rc.No.TGUGCET/3129/2019 తేది :11-12-2019
B.A./B.Com/BBA/B.Sc మొదటి సంవత్సరం డిగ్రీ (ఇంగ్లీష్ మీడియం) కోర్సులలో ప్రవేశానికి 19-01-2020న నిర్వహించబడే TGUGCET-2020 (తెలంగాణ గురుకులం అండర్‌గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) హాజరగుటకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (విద్యా సంవత్సరం 2019-20) లేదా 2019లో నిర్వహించిన 2 సంవత్సరాల ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్ష (కనీసం 40% మార్కులతో) పూర్తి చేసిన అర్హతగల పురుషులు & మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తు విధానము, కాలేజీలు మరియు ఆఫర్ చేయు కోర్సుల వివరాలను తెలిపే ప్రాస్పెక్టస్ మరియు సంబంధిత సమాచారం TSW & TTW REI సొసైటీ వెబ్‌సైట్స్: www.tswreis.in లేదా www.tgtwgurukulam.telangana.gov.inలో 13-12-2019 నుండి లభిస్తాయి. ఆన్‌లైన్ దరఖాస్తు 14-12-2019 నుండి లభిస్తుంది మరియు దరఖాస్తుల అప్‌లోడింగ్ కోసం ఆఖరు తేది : 05-01-2020.
సం/- డా. R.S. ప్రవీణ్‌కుమార్, కన్వీనర్, TGUGCET-2020
DIPR RO. No.537-PP/CL/ADVT/1/2019-20, Dt: 12-12-2019

తెలంగాణ ప్రభుత్వం
**ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No & తేది: 01, 03 to 07,35,32,23,11/SE/TUFIDC/UNIT-III/2019-20, తేది: 10.12.2019. 34/SE/TUFIDC/Unit-III/2019-20, తేది: 02.11.2019. పనుల సంఖ్య (11). పనుల పేర్లు: TUFIDCతో ULBలలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు – **మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ** – రైల్వేస్టేషన్ జంక్షన్, తెలంగాణ చౌరస్తా జంక్షన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్, క్లాక్ టవర్ జంక్షన్, అంబేద్కర్ విగ్రహం (బస్‌స్టాండ్) చౌరస్తా, రాజీవ్ గాంధీ విగ్రహం (అశోక్ టాకీస్) చౌరస్తా, సుభాష్ చంద్రబోస్ విగ్రహం చౌరస్తా అభివృద్ధి, ఆధునిక శ్మశాన వాటిక నిర్మాణము. **కోస్గి మున్సిపాలిటీ** – గంగారం లక్ష్మయ్య ఇంటి నుండి ఓం ప్రకాశ్ ఇంటి వెనుక వైపు వరకు CC డ్రెయిన్ నిర్మాణం. **నారాయణ్‌పేట్ మున్సిపాలిటీ** – పార్కుల అభివృద్ధి మరియు ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్ స్థాపించుట. **కొడంగల్ మున్సిపాలిటీ** – దహన వాటిక, సరిహద్దు గోడ, అప్రోచ్ రోడ్, మొ॥ వాటితో శ్మశాన వాటిక అభివృద్ధి కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. **మొత్తం ECV: 15.10 కోట్లు.** బిడ్ దాఖలు ప్రారంభతేది: 13.12.2019, బిడ్ దాఖలు ముగింపు తేది: 21.12.2019. తదుపరి వివరాలను ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @https:tender.telangana.gov.inలో చూడవచ్చును. ఇ-మెయిల్ID: se.unit3.tufidc@gmail.com. సంప్రదించు నం. 7416421348.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH), యూనిట్-III, TUFIDC, మహబూబ్‌నగర్
DIPR Ro.No: 1942-DP/CL/ADVT/1/2019-20, Dt: 12/12/2019

**APTS ANDHRA PRADESH TECHNOLOGY SERVICES**
Tender Call Notice for Procurement of 8-inch Tablets (10,061 Nos.) to O/o Commissioner & Director of Agriculture, GoAP, Vijayawada.
**Time schedule of various tender related events:**

| | |
|---|---|
| Bid calling date | 13-12-2019 |
| Pre-bid conference date/time | 17-12-2019, 10:00 AM |
| Bid closing date/time | 27-12-2019, 01:30 PM |
| Bid Document Fee | Rs.20,000/- |
| APTS Contact person | K. Dhavuryan Naik, Manager (HWP), Mob:9963029418 e-mail Id: dhavuryannaik.k@gov.in |
| APTS Reference No. | APTS/HWP/N/AGRI- TABLETS /2019 |

For further details regarding detailed Tender Notification, specifications and digital certificate please visit https://www.apts.gov.in and www.apeprocurement.gov.in.
Sd/- Managing Director, A.P. Technology Services Ltd.

# చదవాలని మందలిస్తే యాసిడ్ తాగింది



## టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

**ఎడపల్లి (బోధన్):** చదువులో వెనుకబడిందని తల్లి దండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన బోర్గం శంకర్, అన్నపూర్ణ దంపతులు వ్యవసాయ కూలి పనులు చేస్తూ పిల్లలను చదివి స్తున్నారు. పెద్ద కూతురు స్నేహలత (15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆమె కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధ పడుతోంది. అయితే, ఆమె చదువులో వెనుకబడి ఉందని గమనించిన తల్లిదండ్రులు బాగా చద వమని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన స్నేహలత.. ఇంట్లోని బాత్రూంలో ఉన్న యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితికి చేరుకున్న బాలికను తల్లిదం డ్రులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

# తాగొచ్చి వేధిస్తున్నాడని..

## భర్తను నరికి చంపిన భార్య

**కరీమాబాద్ :** నిత్యం మద్యం తాగొచ్చి హింసి స్తున్న భర్తను భార్య దారుణంగా నరికి చంపిం ది. ఈ సంఘటన వరంగల్ అర్బన్ జిల్లా ఖిలా వరంగల్ మండలం శంభునిపేట బుడిగజంగాల కాలనీలో గురువారం చోటు చేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న చిల్ల రాజ్‌కుమార్ (27), యాకలక్ష్మి దంపతులు. కూలి పనులు చేసే రాజ్‌కుమార్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగొచ్చి ఇంట్లో గొడవ చేయడమే కాకుండా హింసిస్తున్నాడు. ఈ క్రమంలో విసిగిపోయిన యాకలక్ష్మి గురువారం ఉదయం భర్త రాజ్‌కుమార్‌ను గొడ్డలితో నరికి చంపింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తూకం.. నిండా మోసం

## రిమోట్ కంట్రోల్‌తో దగా

- క్వింటాల్‌కు 26 కిలోల తగ్గుదల
- పసిగట్టి దళారులకు దేహశుద్ధి..
- పోలీసులకు అప్పగింత



దోనూర్‌లో మోసం చేసిన పత్తి దళారులు

**ధర్మపురి:** పత్తి తూకంలో రిమోట్ కంట్రోల్‌తో మోసానికి పాల్పడుతున్న దళారులను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దోనూర్‌లో చోటుచేసుకుంది. మార్కెట్ ధర కంటే ఎక్కువ ఇస్తామంటూ ఏడుగురు దళారులు గురువారం దోనూర్‌కు చేరుకున్నారు. రైతులు తోట ఈశ్వరయ్య రెండు క్వింటాళ్లు, ఏదుల సత్తన్న క్వింటాలున్నర విక్రయించారు. రైతులకు అనుమానం కలుగకుండా ఎలక్ట్రానిక్ కాంటాలపై తూకం వేశారు. అయితే క్వింటాల్ బరువు తూగుతుందనుకున్న బస్తా 75 నుంచి 80 కిలోలు రావడంతో రైతులకు అనుమానం కలిగింది. ఏదో తిరకాసు ఉందని గ్రహించిన వారు దళారుల వ్యవహారశైలిని గమనించారు. తూకం వేసే సమయంలో దళారుల నుంచి ఒకరు అక్కడి నుంచి దూరంగా వెళ్తుండటం, ప్యాంటు జేబుల్లో చేతులు పెట్టుకుంటుండటంతో అనుమానం వచ్చి సోదా చేయగా రిమోట్ కంట్రోల్ దొరికింది. కాంటాపై బస్తా వేయగానే సదరు వ్యక్తి రిమోట్‌లోని స్విచ్ నొక్కగానే దాదాపు 25 కిలోల బరువు తక్కువగా చూపిస్తుంది. దీంతో కోపోద్రిక్తులైన రైతులు దళారులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. రైతుల ఫిర్యాదుతో సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్‌కు చెందిన అంజన్న, రెవెల్లి దుబ్బరాజం, అంజన్న, జలంధర్, రాజశేఖర్, భూమయ్య, రంజిత్‌లను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెండు వాహనాలు, ఎలక్ట్రానిక్ కాంటాలు, రెండు రిమోట్లను స్వాధీనం చేసున్నామన్నారు.

## క్లుప్తంగా...

### తుది దశకు 'హాజీపూర్' విచారణ

**బొమ్మలరామారం:** సంచలనం సృష్టించిన హాజీపూర్ వరుస హత్యల కేసు విచారణ ముగింపు దశకు వచ్చినట్లు తెలుస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌కు చెందిన పాముల శ్రావణి, తిప్రబోయిన మనీషా, మైసిరెడ్డిపల్లికి చెందిన కల్పనలపై నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి అఘాయిత్యాలకు పాల్పడి హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసుపై గురువారం నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని విచారించారు. వందమందికి పైగా సాక్షులను విచారించిన కోర్టు, రెండు రోజుల్లో విచారణ పూర్తిచేసే అవకాశం ఉందని తెలుస్తోంది. నెలాఖరుకు తీర్పు వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### లక్ష్మీ బ్యారేజీలోకి 6.99 లక్షల రొయ్యపిల్లలు

**మహదేవపూర్:** భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీలో గురువారం 6.99 లక్షల రొయ్య పిల్లలను మంథిని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి వదిలారు.

# 5 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు చోరీ

### మిర్యాలగూడలో దుకాణం తాళం పగులకొట్టి అపహరణ

**మిర్యాలగూడఅర్బన్:** ఓ దుకాణంలో దొంగలు పడి డబ్బును కాకుండా ఉల్లిగడ్డలను ఎత్తుకెళ్లారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉల్లిగడ్డల వ్యాపారం నిర్వహిస్తున్న బక్కయ్య రోజు మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. తిరిగి గురువారం ఉదయం వచ్చి చూసేసరికి దుకాణం తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా పది బస్తాల ఉల్లిగడ్డలు (5 క్వింటాళ్లు) కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన బక్కయ్య, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, కౌంటర్ ఉన్నా దొంగలు దానిని ముట్టుకోలేదు.

# యాదాద్రికి గరుత్మంతుడి విగ్రహాలు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన గరుత్మంతుడి విగ్రహాలు ఆలయానికి చేరుకున్నాయి. ఆలయాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వైటీడీఏ అధికారులు, స్థపతులు, శిల్పులు కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రధాన ఆలయం, ప్రాకారాలు, మండపాల్లో గరుత్మంతుడి విగ్రహాలు, దీప కన్యలు, సింహాల శిల్పాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిని పాతగుట్టలో స్థపతుల పర్యవేక్షణలో నిష్ణాతులైన శిల్పులు రూపొందించారు. నాలుగు గరుత్మంతుడి విగ్రహాలు గురువారం పాతగుట్ట నుంచి ప్రధాన ఆలయం వద్దకు చేరాయి. రెండున్నర అడుగుల ఎత్తులో తయారైన వీటిని ప్రాకార మండపంలోని చిన్న విమానాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇక అరు అడుగుల ఎత్తులో రూపుదిద్దుకున్న రెండు దీప కన్యలను గర్భాలయానికి ఎదురుగా ఉన్న గోపురం వద్ద ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒకటిన్నర నుంచి రెండు అడుగుల ఎత్తులో తయారవుతున్న సింహాలను ప్రాకారంలో, మండపాల్లో అక్కడక్కడ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం యాదాద్రి కొండపైకి నాలుగు గరుత్మంతుడి విగ్రహాలు, రెండు దీప కన్య శిల్పాలు వచ్చాయి.



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధాన ఆలయం వద్ద గరుత్మంతుడి విగ్రహం

# ఐఐటీహెచ్‌లో ముగిసిన మొదటి దశ ప్లేస్‌మెంట్స్

**సాక్షి, సంగారెడ్డి:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) క్యాంపస్‌లో మొదటి దశ ప్లేస్‌మెంట్లలో భాగంగా 38 అంతర్జాతీయ ఆఫర్లను దక్కించుకున్నామని ఫ్యాకల్టీ ఇన్‌చార్జి (ప్లేస్‌మెంట్స్) డాక్టర్ ప్రదీప్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019–20 సంవత్సరానికి మొదటి దశ ప్లేస్‌మెంట్లలో భాగంగా ఈ ఎంపిక జరిగిందని, ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన మొదటి దశ ప్లేస్‌మెంట్ల ప్రక్రియ గురువారం ముగిసినట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న ప్రముఖ కంపెనీల్లో మైక్రోసాఫ్ట్, గోల్డ్మన్ సాచ్, జాగ్వార్ ల్యాండ్ రోవర్, ఈటన్, బీఎస్‌వై మెల్లన్, బజాజ్ ఆటో, టీఎస్ఎంసీ ఉన్నాయని వెల్లడించారు. రెండో దశ ప్లేస్‌మెంట్స్ జనవరి 2020లో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మొత్తం 483 మంది విద్యార్థులు నియామకాల కోసం నమోదు చేసుకున్నారని, ఉద్యోగ ఆఫర్లలో ఎక్కువ భాగం ఐటీ, ఐటీఈఎస్ రంగాల నుంచి వచ్చాయని వివరించారు.



న్యూఢిల్లీలో అవార్డు అందుకున్న ప్రమీల

# జాతీయ ఉత్తమ ఏఎన్ఎంగా ప్రమీల

**గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ప్రమీల ఆల్ ఇండియా ఉత్తమ ఏఎన్ఎంగా అవార్డు అందుకుంది. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో జరిగిన యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే సమావేశంలో కేంద్ర మంత్రి హర్షవర్ధన్ అవార్డు అందజేశారు. వైద్య సేవలపై ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన రెండు రోజుల శిక్షణలో ప్రమీల పాల్గొంది. ఇందులో ప్రతిభ కనబర్చినందుకు ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు.

### హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి

# పర్వతారోహకుడు అఖిల్

### ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అవార్డు ప్రదానం

**హన్మకొండ:** హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి పర్వతారోహకుడు రాసమల్ల అఖిల్ చేరారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ నయీంనగర్‌కు చెందిన అఖిల్ ఆగస్టు 15న భారత్, టిబెట్ సరిహద్దు లడఖ్‌లోని స్టాక్ కాంగ్రీ పర్వతాన్ని అధిరోహించి 365 అడుగుల జాతీయ పతకాన్ని సహచర పర్వతారోహకులతో కలసి ఎగురవేశాడు. అత్యంత పొడవైన జాతీయ జెండా ఎగురవేసినట్లుగా హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదైంది. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డును గుంటూరుకు చెందిన సాయి కిరణ్‌తో కలసి అఖిల్ అందుకున్నారు. ఈ సందర్భంగా సాహస విద్యార్థులను ఉప రాష్ట్రపతి వెంకయ్య అభినందించారు.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అఖిల్

# పుష్ప విలాపం!



**ఎన్నో ఆశలతో పెంచిన పూల తోటను ఆ రైతు తుంచివేశాడు. ఆశించిన దిగుబడి వచ్చినా, తగిన రేటు లేకపోవడంతో కుంగిపోయాడు. కూలీలకు కూడా డబ్బులు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆ రైతు రోటవేటర్‌తో తోటనంతా దున్నించేశాడు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మైలారం మీది తండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏపీలోని ప్రకాశం జిల్లా, చీరాలకు చెందిన పాలకుర్తి శ్రీను, రేణుక దంపతులు మైలారం మీది తండాలో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని చామంతి పూల సాగు చేపట్టాడు. దిగుబడి బాగానే వచ్చినా.. రేటు పడిపోయింది. గిట్టుబాటు కాక తోటను దున్నించాడు.** - బొమ్మలరామారం








| Models | Hexa | Harrier | Nexon | Tiago | Tigor |
|---|---|---|---|---|---|
| Best Offer of the Decade | ₹2,25,000* | ₹1,75,000* | ₹85,000* | ₹92,500* | ₹92,500* |

₹15,000* అదనపు కస్టమర్ ఆఫర్ కేవలం 15 డిసెంబర్ వరకు మాత్రమే లభ్యం. త్వరపడండి.

To know more, visit www.tatatiago.com | For Test Drive at your doorstep, SMS 'TIAGO' to 5616161 or call 1800 209 7979 (toll free) | /tiagofromtatamotors | @tiagotatamotors

Images and illustrations are indicative and for information purpose only. All features/specifications are not available in all variants and may vary for different variants. Accessories may or may not be a part of standard fitment. Dual tone is available in XZ+ variant in select body colour options. R15 alloy wheel is available for petrol variant only. *Terms and Conditions apply. #Price ex-showroom Hyderabad. Gold coin image for representation only.

Nalgonda, Miryalguda, Suryapet: 7303762953

సాక్షి
శుక్రవారం, డిసెంబర్, 13

# న్యాయ నియామకాల్లో జాప్యం

న్యాయవ్యవస్థ కంఠశోషే తప్ప దేశంలోని వివిధ హైకోర్టుల్లో న్యాయమూర్తుల పోస్టులు భర్తీ కాకుండానే ఉండిపోతున్నాయని మరోసారి వెల్లడైంది. మొత్తంగా 1,079 హైకోర్టు న్యాయమూర్తుల పదవులుండగా అందులో కేవలం 669మంది న్యాయమూర్తులు...అంటే 62 శాతంమంది మాత్రమే ఉన్నారని, 410 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. తగిన సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం వల్ల కేసుల పరిష్కారంలో ఎంత జాప్యం చోటుచేసుకుంటున్నదో, న్యాయం కోసం ఎదురుచూస్తున్న సాధారణ పౌరులు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో కేంద్రానికి తెలియనిది కాదు. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా న్యాయమూర్తుల నియామకం విషయంలో నిర్లక్ష్యమే కనబడుతోంది. సుప్రీంకోర్టు కొలీజియానికీ, కేంద్రానికీ మధ్య విభేదాలు తలెత్తిన సందర్భాలు ఇటీవలికాలంలో చాలానే ఉన్నాయి. అయినా గత అయిదేళ్లలో చేసిన నియామకాలు గమనిస్తే అంతక్రితం కన్నా ఎంతో కొంత మెరుగనే చెప్పాలి. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సరిపోదు. అలహాబాద్ హైకోర్టు 60 ఖాళీలతో అగ్రభాగాన ఉండగా, కలకత్తా హైకోర్టులో 32, ఢిల్లీ హైకోర్టులో 23, బొంబాయి హైకోర్టులో 29 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీలున్నాయి. అన్నిటికన్నా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిస్థితి మరీ అన్యాయం. అక్కడ 37మంది న్యాయమూర్తులకూ 15మంది మాత్రమే ఉన్నారు. గత జూన్‌లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాస్తూ కొత్తగా న్యాయమూర్తుల్ని నియమించడంతోపాటు హైకోర్టు న్యాయమూర్తుల రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచాలని కోరారు. అలాగే అవసరమైతే రాజ్యాంగంలోని 128, 224ఏ అధికరణల కింద సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తుల్ని నిర్దిష్ట కాలానికి న్యాయమూర్తులుగా నియమిస్తే పెండింగ్ కేసుల బెడద తీరుతుందని సూచించారు. కానీ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ అభిప్రాయమేమిటో తెలియదు. సుప్రీంకోర్టులో మొన్న జూన్ నాటికి 58,669 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రోజూ కొత్తగా దాఖలయ్యే కేసుల సంఖ్య కూడా కలుపుకుంటే ప్రస్తుతం అవి మరింతగా పెరిగివుండొచ్చు. తగినంతమంది న్యాయమూర్తులు అందుబాటులో లేని కారణంగా అనేక ముఖ్యమైన కేసుల పరిష్కారం కూడా ఆలస్యమవుతోంది.

కేసుల్లో చిక్కుకోవడం వల్లనో, న్యాయం కోసం న్యాయస్థానాల్ని ఆశ్రయించడం వల్లనో వాటి చుట్టూ తిరగకతప్పనివారికి ఈ జాప్యం వల్ల కలిగే ఖేదమేమిటన్నది బాగా తెలుసు. తమ కేసు చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉందని, త్వరగా పరిష్కరించాలని కోరే కక్షిదారులకు న్యాయస్థానాలనుంచి ఆశాజనకమైన జవాబు రావడం లేదు. అవి నిస్సహాయ స్థితిలో ఉండటమే అందుకు కారణం. మన దేశంలో సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఏభై ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 1,000 వరకూ ఉంటే...25 ఏళ్లనుంచి పెండింగ్‌లో ఉన్న కేసులు రెండు లక్షలపైనే. సివిల్ తగాదాలకు సంబంధించి మొత్తంగా 90 లక్షల కేసులు ఎటూ తెమలకుండా ఉన్నాయి. వీటిల్లో 20 లక్షలకుపైగా కేసుల్లో...అంటే 23 శాతం కేసుల్లో కనీసం సమన్లు కూడా జారీ చేయలేదని గత ఆగస్టులో జస్టిస్ గొగోయ్ చెప్పారంటే న్యాయమూర్తుల నియామకం సమస్య ఎలాంటి పరిస్థితులకు దారితీస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. క్రిమినల్ కేసుల పరిస్థితి ఇంతకన్నా ఘోరం. 2 కోట్ల 10 లక్షల క్రిమినల్ కేసుల్లో కోటి వరకూ కేసులు ఇంకా సమన్లు జారీ చేసే దశలోనే ఉన్నాయి. ఈ క్రిమినల్ కేసుల్లో 45 లక్షల వరకూ చిన్న తగాదాలకు సంబంధించినవి. ఇది ప్రమాదకర పర్యవసానాలకు దారితీస్తుంది. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో మాత్రమే కాదు... కింది కోర్టుల్లో కూడా న్యాయాధికారుల కొరత తీవ్రంగా ఉంది. దేశవ్యాప్తంగా 5,000 ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. ఇలా ఎక్కడికక్కడ అన్ని స్థాయిల్లోనూ ఖాళీలుంటే న్యాయం దక్కడం సాధ్యమేనా? ఉన్నత స్థాయి న్యాయస్థానాల్లో పదవుల భర్తీ విషయంలో జరుగుతున్న జాప్యం గురించి కనీసం కొలీజియాన్ని సాకుగా చూపడానికి ఉంది. కానీ జిల్లా కోర్టుల్లోనూ, సబార్డినేట్ కోర్టుల్లోనూ పూర్తికావాల్సిన నియామకాల మాటేమిటి? దీనికి సంబంధించి జాతీయ స్థాయిలో నియామక విధానం తెస్తామని రవిశంకర్ ప్రసాద్ ఇప్పటికే చెప్పారు. ఆ విషయంలో కేంద్రం నుంచి ప్రతిపాదనలు వస్తే సానుకూలంగా స్పందిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే ఈమధ్యే అన్నారు గనుక ఈ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందనుకోవాలి. న్యాయమూర్తుల నియామకంలో చోటు చేసుకుంటున్న జాప్యం కేంద్రం, న్యాయవ్యవస్థల మధ్య నెలకొన్న ఆధిపత్య సమస్య లేదా అహంభావ సమస్య పర్యవసానంగా ఏర్పడిందని కొందరు న్యాయవేత్తలు చెబుతున్నారు. కానీ వీటి పర్యవసానాలు మాత్రం ప్రజలు అనుభవించవలసి వస్తున్నది. ఇది ఎడతెగకుండా సాగడం సరైంది కాదు.

న్యాయమూర్తుల నియామకాల్లో జాప్యం వల్ల ప్రజలకు సకాలంలో న్యాయం దక్కని దుస్థితి ఏర్పడింది. క్రిమినల్ కేసుల విచారణ ఏళ్లతరబడి పెండింగ్‌లో పడిపోవడం వల్ల ఆ కేసుల్లో నిందితులుగా ఉన్న నిరుపేదలు జైళ్లలో గడపవలసి వస్తోంది. కొందరైతే తమ నేరానికి అనుభవించాల్సిన శిక్షా కాలానికి మించి జైళ్లలో మగ్గుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు బెయిల్ తెచ్చుకుంటున్నారు. అవసరమైన సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. అమెరికాలో పది లక్షలమంది జనాభాకు సగటున 107మంది న్యాయమూర్తులుంటే మన దేశంలో ఆ సంఖ్య పది మాత్రమే. అలాగే అక్కడి న్యాయమూర్తులు సగటున ఏడాదికి 81 కేసులు పరిష్కరిస్తుంటే మన న్యాయమూర్తులు 2,600 కేసులు పరిష్కరిస్తున్నారు. న్యాయమూర్తులపై ఈ స్థాయిలో భారం మోపడం ఎంత మాత్రం న్యాయం కాదు. కనుక ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణం కదలాలి. న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి బ.పాడ్యమి ఉ.10.31 వరకు తదుపరి విదియ, నక్షత్రం మృగశిర ఉ.7.28 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం ప.3.49 నుంచి 5.23 వరకు, దుర్ముహూర్తం ఉ.8.35 నుంచి 9.19 వరకు, తదుపరి ప.12.15 నుంచి 1.01 వరకు, అమృతఘడియలు... రా.9.23 నుంచి 10.43 వరకు.

**సూర్యోదయం :** 6.25
**సూర్యాస్తమయం:** 5.24
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# సత్వరమైతేనే.. న్యాయం!



దిలీప్ రెడ్డి

న్యాయం అందించడం ఒక ఎత్తైతే న్యాయం అందుతుందనే విశ్వాసం ప్రజల్లో కలిగించడం మరో ఎత్తు! అవిచ్ఛిన్నంగా, కచ్చితంగా, సత్వరంగా ఒకటోది అందితే రెండోది దానంతట అదే సిద్ధిస్తుంది. మనం, మన వ్యవస్థలు, ప్రభుత్వాలు పనిగట్టుకొని అందించాల్సింది మొదటిదే! రెండోదాని కోసం ఎవరూ ప్రత్యేకంగా కృషి చేయాల్సిన పని లేదు. అంతటా న్యాయం సులువుగా అందుతున్న క్రమంలో అంతే సహజంగా విశ్వాసం ప్రజల్లో ఏర్పడుతుంది, క్రమంగా బలపడుతుంది. రెండోది లేదంటే, మొదటిది లభించడం లేదనే అర్థం! ఈ దుస్థితి ఇటీవల బాగా పెరిగింది. న్యాయం అంత తేలిగ్గా దొరక్కపోవడం, కొన్నిసార్లు ఎంతకీ లభించకపోవడంతో అది లభిస్తుందనే విశ్వాసం పౌర సమాజంలో సన్నగిల్లుతోంది. అనుచిత జాప్యాలతో సాగే నేర దర్యాప్తు–న్యాయ విచారణ ప్రక్రియ (క్రిమినల్ జస్టిస్ సిస్టమ్) న్యాయనిరాకరణే కాక తీరని నష్టమనే భావన జనంలో బలపడుతోంది. ముఖ్యంగా ఆడవాళ్లపై అఘాయిత్యాలు జరిగి, పట్టుబడ్డ నిందితులు బేషుగ్గా జైళ్లలోనో, బెయిల్‌పై వచ్చి బయటో కాలం వెళ్లదీస్తున్నపుడు... న్యాయం జరుగుతుందనే నమ్మకం సడలుతోంది. ఇది ఆరంభం నుంచీ ఉన్న పరిస్థితేం కాదు. పలు జాడ్యాల వల్ల ముప్పిరిగొంటున్న ఇటీవలి అనుచిత జాప్యాలే ఇందుకు కారణం. మన పరిపాలన, పోలీసు–దర్యాప్తు, న్యాయ వ్యవస్థ ఇలా అన్నిచోట్లా నిర్వాకాలు వెరసి ఉమ్మడిగా విశ్వాసాన్ని సన్నగిల్లజేస్తున్నాయి.

ఫలితంగా, ప్రజాస్వామ్య ప్రక్రియను కాదని ప్రజలు సత్వర ఫలితాల కోసం ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. అవి ప్రజాస్వామ్యబద్ధమైన చర్యలు కావు అని తెలిసినా... కాప్ పంచాయతీల వైపు మొగ్గుతున్నారు. అసాంఘిక శక్తుల సెటిల్‌మెంట్లకు తలొగ్గుతున్నారు. అసహజ ఎన్‌కౌంటర్లనూ సమర్థిస్తున్నారు. హక్కుల సంఘాల కృషినీ అభిశంసిస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఎక్కడికక్కడ తీర్పులిచ్చే చర్యల్ని తప్పుపట్టకపోగా... గట్టిగా సమర్థిస్తున్నారు. పట్టరాని హర్షాలు, పాలాభిషేకాలు అందుకే! ఇదివరకెప్పుడూ లేనంత తీవ్ర స్థాయిలో ఈ రకం భావజాలం వ్యాపిస్తోంది. ప్రమాదకరంగా ఇది బలపడుతోంది. తీవ్ర భావోద్వేగాలకు లోనవుతున్న కొందరు ఈ పరిస్థితిని సామాజిక మాధ్యమాల్లో నెత్తికెత్తుకుంటున్నా... ఇదంత మంచిది కాదనేది విజ్ఞుల అభిప్రాయం. తాజా ఘటనల్లో అది కొట్టొచ్చినట్టు కనిపించింది. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఏం కోరుకోవాలి, నిజానికి ఏం కోరుకుంటున్నారు? అని లోతుగా చూస్తే... ఈ పరిణామాలు ఆలోచనాపరుల్లో కాస్త గగుర్పాటు కలిగిస్తున్నాయి.

### కఠిన శిక్షా? కచ్చితమైన శిక్షా?

నేర దర్యాప్తు, న్యాయ విచారణల్లో జరిగే అనుచిత జాప్యాల వల్ల తీవ్రమైన నేరాల్లోనూ కేసులు కొలిక్కి రావట్లేదు. సత్వర న్యాయం దొరకటం లేదు. నేరస్తులకు శిక్షలు లేవు. బాధితుల కడగండ్లు తీరటం లేదు. ఇది ప్రజల్ని అసహనానికే కాకుండా ఆగ్రహానికీ గురిచేస్తోంది. బాధితులకు, ప్రజాస్వామ్యవాదులకు న్యాయవ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లడంతోపాటు దీనివల్ల మరో ప్రమాదం కూడా ఉంది. ఆడవాళ్లపై అఘాయిత్యాలు చేసే వారికి, ఆ మాటకొస్తే నేరస్వభావులెవరికైనా చట్టమంటే, శిక్షలంటే భయం లేని తెంపరితనం వచ్చేస్తుంది. అది బరితెగింపులకు దారితీస్తోంది. మొత్తం జనాభాతో పోల్చినపుడు నేరాలకు పాల్పడే వారి సంఖ్య చాలా తక్కువే అయినా, చట్టాలంటే భయంలేనితనం వల్ల సర్వత్రా అభద్రత రాజ్యమేలుతోంది. 'తప్పు చేసిందెవరైనా, ఎంతవారైనా శిక్ష తప్పదు...' అన్న నమ్మకం బలపడాలి. అది బలహీనులకు భరోసా కల్పిస్తూనే నేర స్వభావులకు భయాన్నీ కలిగిస్తుంది. ఏడేళ్ల కింద జరిగి, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'నిర్భయ కేసు'లో నిందితులైన వారికి ఇప్పటికీ శిక్షలు అమలు కాకపోవడాన్ని సాధారణ జనం కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. నేర నిర్ధారణ జరిగి, శిక్షలు ఖరారై... అమలు జరుగకపోవడం వారికి మరింత కోపకారణమవుతోంది. న్యాయ 'ప్రక్రియ' అంటేనే పరిహాసం చేస్తున్నారు.

సమకాలీనం



మరోవంక, ఇక్కడ హైదరాబాద్ శివార్లలో జరిగిన 'దిశ' దుర్మార్గం తర్వాత స్వల్ప వ్యవధిలోనే 'ఎన్‌కౌంటర్'లో నిందితులు నలుగురు చనిపోవడం ఒకింత ఉపశమనం కలిగించింది. దాంతో, ఎక్కువ మంది ఈ రెండు... నిర్భయ, దిశ కేసుల అంతిమ ఫలితాన్ని సరిపోల్చి చూస్తున్నారు. దేనికన్నా ఏది నయం? అని బేరీజు వేస్తున్నారు. నిర్భయ ఘటన తర్వాతనాడే దేశం అట్టుడికింది. సాక్ష్యాత్తూ దేశ రాజధాని నడిబొడ్డున ఇంత దారుణమా? అనే ఆగ్రహావేశాలు సర్వత్రా పెల్లుబికాయి. కేంద్ర ప్రభుత్వం జస్టిస్ వర్మ నేతృత్వంలో కమిషన్ వేసింది. దాని ముందుకు రకరకాల ప్రతిపాదనలు వచ్చాయి. పిల్లలు, మహిళలపై అత్యాచారం, హత్యోదంతం వంటి అఘాయిత్యాలకు తలపడే వారికి కఠిన శిక్షలు అమలు పరచాలనే వాదనా వచ్చింది. అక్కడికక్కడే మరణ శిక్ష విధించాలని, నేరుగా ఉరి తీయాలని... ఇలా వచ్చిన పలు ప్రతిపాదనల్లో చట్టాల్ని సమూలంగా మార్చే అంశం కూడా తెరపైకొచ్చింది. ప్రస్తుత చట్టాల్లోనూ ఆయా శిక్షలున్నాయని, కొత్తగా అమానుష శిక్షలు ప్రతిపాదించి నాగరిక సమాజం వెనక్కి నడవాల్సిన పనిలేదనే వాదనా వినిపించింది. అయితే ప్రక్రియలో జాప్యం నివారించి, సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలనే గట్టి వాదన ముందుకు వచ్చింది.

### సమయపరిమితే సరైన మార్గం

అన్నిస్థాయిల్లోనూ సమయపరిమితులు విధించి నేర దర్యాప్తు–న్యాయ విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం ఓ పరిష్కారం. అవసరం మేర ఎప్పటికప్పుడు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు ఒక మార్గం. దయాభిక్షతో సహా తీర్పు తదనంతర ప్రక్రియకూ సమయ పరిమితులుండాలి. కొన్ని నేరాల్లో దయాభిక్షే ఉండకూడదు. కఠిన శిక్షల్ని వర్తింప చేయడం ద్వారా, ఎవరూ మహిళలపై ఏ దుశ్చర్యకూ తలపడలేని విధంగా భయం పుట్టించాలి. జాప్యాల్ని హరించి, ప్రక్రియను సత్వరం పూర్తి చేస్తే ఫలితాలుంటాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిందదే! సీఆర్పీసీ, ఐపీసీలను తగు విధంగా సవరించడంతో పాటు సొంతంగా ఒక చట్టాన్ని తీసుకురావాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదించింది. సామాజిక మాధ్యమాల వేదికగా జరిగే దుశ్చర్యలకూ పగ్గాలు వేసే చర్యల్ని ప్రతిపాదించారు. ముసాయిదా కూడా సిద్ధమైంది. ఇక నేడో, రేపో అసెంబ్లీలో ఆ బిల్లు చట్టరూపు సంతరించుకోవడమే తరువాయి.

మహిళలపై దుర్మార్గపు హింస జరిగినపుడు వారం రోజుల్లో నేర దర్యాప్తు, పక్షం రోజుల్లో న్యాయ విచారణ పూర్తిచేసి, నిర్ధారించే సాక్ష్యాలున్న కేసుల్లో మూడు వారాల్లో తుది తీర్పు ఇప్పించాలనేది తాజా చొరవ ఉద్దేశం. న్యాయ ప్రక్రియపై ప్రజలకు భరోసా కల్పించడమే కాకుండా నేర స్వభావుల్లో భయం కలిగిస్తే లక్ష్యం నెరవేరినట్టే! ఇదొక్కటే సరిపోతుందా? అని సందేహం వ్యక్తం చేసేవాళ్లుంటారు. ఇలాంటి సంస్కరణలు, చట్ట సవరణలు, సత్వర చర్యలు అన్ని స్థాయిల్లో ఉంటే పని సజావుగా జరిగిపోతుంది. హైకోర్టు, సుప్రీంకోర్టు స్థాయిలో విచారణకు గడువెలా విధిస్తారనే వాదన రావొచ్చు! అసాధారణ పరిస్థితుల్లో తప్ప కేసు విచారణలకు సమయ పరిమితులు విధించుకోవచ్చు. ప్రక్రియను సత్వరం పూర్తిచేసి ఒక హేతుబద్ధమైన ముగింపుకు తీసుకురావాలనే ఒత్తిడయితే ఉన్నత స్థాయి న్యాయ వ్యవస్థపైనా పెరుగుతుంది. సత్వర విచారణ, తగు తీర్పుతోనే సరిపోదు, సదరు శిక్షలు అమలు కావాలి. జరిగిన నేరపు ఘోరత్వం జనుల స్మృతిపథం నుంచి జారక ముందే నేరస్తులకు శిక్షలు అమలయితేనే సార్థకం.

### ఏకకాలంలో ఎన్ని కావాలో...!

కేసు నమోదు దశ నుంచి ప్రాసిక్యూషన్ ముగిసే దాకా నేర దర్యాప్తు ప్రక్రియను పోలీసులు వేగిరపర్చాలి. పాలన, సాంకేతిక, దురుద్దేశ పూర్వక జాప్యాలన్నింటినీ హరించాలి. ముఖ్యంగా దేశంలో అత్యాచార నేరాల పెరుగుదల తీరు ఆందోళన కలిగిస్తోంది. జరిగినా, పలు సాంఘిక కారణాల వల్ల నమోదయ్యేవే తక్కువంటే, ఈ అధికారిక గణాంకాలు గగుర్పాటు కలిగిస్తున్నాయి. గత 15 ఏళ్లలో 3.41 లక్షల అత్యాచార కేసులు నమోదయ్యాయి. ఒక వైపు ఘటనలు పెరుగుతుంటే, మరోవైపు శిక్షల రేటు తగ్గుతోంది. 2016లో 38,947 కేసులు రాగా 6,289 కేసుల్లోనే శిక్షలు పడ్డాయి. మహిళలపై జరిగే నేరాల్లో పోలీసుల సత్వర స్పందన, బాధ్యతాయుత ప్రవర్తన చాలా ముఖ్యం. దర్యాప్తుతో పాటు న్యాయ విచారణ ప్రక్రియలోనూ వేగం పెరగాలి. గర్భస్థ పిండాలుగా ఉన్నప్పటి నుంచి కడ శ్వాసవరకు మహిళలపై గౌరవ భావం కలిగేలా మన సమాజానికి అవగాహన పెంచాలి. కుటుంబం, బడి, పనిప్రదేశం, బహిరంగ స్థలం.... ఇలా అన్ని చోట్లా, ప్రతి స్థాయిలో వివక్ష పోవాలి. మనిషి తప్ప సృష్టిలో మరే జీవి పాల్పడని అతి హీనమైన నేరం అత్యాచారం. అది సామూహికంగా జరిగి, ఘాతుకమైన హత్యతో ముడివడటం భూమ్మీద అతిపెద్ద నేరం! దీనికి సమాజం నుంచే పరిష్కారం లభించాలి. దీన్ని పూర్తిగా నిర్మూలించడానికి అన్ని విధాలుగా, అన్ని స్థాయిల్లో సమాజం సమాయత్తం కావాలి. ఇది సమష్టి బాధ్యత.

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### దురాలోచన



"నా దురాలోచన ఏమిటంటే.. బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన కొన్నినాళ్లలోనే ట్రిపుల్ తలాక్, 370 అధికరణం, ఎన్నార్సీ, అయోధ్య, సీఏబీ వంటి పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకుంది కదా, మరి వచ్చే ఎన్నికల కోసం ఎటువంటి ఎత్తువేయబోతోంది?'

– జైనాబ్ సికిందర్, రచయిత

### అధికారికం



"పౌరసత్వ బిల్లు ఆమోదంతో భారత రాజ్యాంగం మరణించినట్టే. ఇక భారత్ అధికారికంగా హిందూ దేశం"

– అర్ఫా ఖనుమ్ షెర్వాణీ, జర్నలిస్ట్

### హేట్సాఫ్



"ట్రిపుల్ తలాక్, ఎన్ఆర్సీ, అయోధ్య, పౌరసత్వ సవరణ బిల్లు (సీఏబీ) అన్నీ కేవలం ఆరు నెలల్లోనే ఇన్ని చర్యలు తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు హేట్సాఫ్. భారతీయులంతా ఎంతో సంతోషిస్తారని నేను కచ్చితంగా చెప్పగలను"

– వినితా హిందుస్తానీ, టీచర్

### నీరోస్



"అస్సాం కూడా కశ్మీర్‌లా మండుతోంది. రోమ్ తగలబడుతుంటే నీరో ఫిడేల్ వాయించినట్లుగా.. దేశం తగలబడిపోతుంటే ఈ ఆధునిక నీరో ఫిడేలు వాయించుకుంటున్నారు. హనుమంతుడు కేవలం లంకను మాత్రమే తగులబెట్టాడు. ఈ ఆధునిక హనుమంతులు మొత్తం దేశాన్నే తగులబెడుతున్నారు"

– మార్కండేయ ఖట్జూ, మాజీ న్యాయమూర్తి

### ఫలితం



"అస్సామీలను విస్మరించి మీరు హడావిడిగా పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదించినందుకు ఫలితం అల్లర్లు. అస్సామీలు పోలీసులు కాల్పులు ఎదుర్కొంటుంటే.. బెంగాలీ, బీహారీలు తమపై జరుగుతున్న దాడులతో భయాందోళనలతో ఉన్నారు. అమిత్ షా గారూ.. దీనంతటికీ జవాబుదారీ ఎవరిది? ప్రజలంతా అవస్థలు పడుతుంటే మీరు బీజేపీ గురించే ఆలోచిస్తారా?"

– శ్రీవత్స, కాంగ్రెస్ నేత

### ల్యాండ్‌మార్క్



"మన విలువలైన కారుణ్యానికి, సౌభ్రాతృత్వానికీ ఈరోజు కీలకమైనది, గుర్తుంచుకోదగ్గది. సీఏబీ రాజ్యసభలో ఆమోదం పొందడం సంతోషంగా ఉంది. బిల్లుకు అనుకూలంగా ఓటు వేసిన ఎంపీలందరికీ కృతజ్ఞతలు. సంవత్సరాలుగా పీడనను ఎదుర్కొంటున్నవారికి ఈ బిల్లు ఉపశమనాన్ని ఇస్తుంది"

– నరేంద్ర మోదీ, ప్రధాని

### ఆర్నెల్లు



"ఈ పౌరసత్వ సవరణ బిల్లు 64 ఏళ్లుగా, 370 అధికరణం రద్దు 65 ఏళ్లుగా, ట్రిపుల్ తలాక్ బిల్లు 72 ఏళ్లుగా, రామ మందిరం 51 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నిటినీ కేవలం 180 రోజుల్లో మోదీ పరిష్కరించారు. భారతదేశ పాలనలో ఈ ఆర్నెల్లు ఉత్తమమైనవని మీకు అనిపించడం లేదా?"

– మహేశ్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

# ఎన్‌కౌంటర్ జరిగిందా లేక చేశారా?

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

హైదరాబాద్‌లో నలుగురు అత్యాచార నిందితులను కాల్చేసిన సంఘటనపై మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. హైదరాబాద్ హైకోర్టు పిల్ విచారణ జరుపుతున్నది, మానవ హక్కుల కమిషన్ బృందం కూడా ప్రశ్నిస్తున్నది. ఎన్‌కౌంటర్ చేస్తా అంటే అర్థం చంపేస్తా అని. ఎన్‌కౌంటర్ చేశారంటే హత్య చేశారనే చదువుకోవాలి. నేరం రుజువు చేయకుండా, పోలీసులు నలుగురికి మరణదండన విధించి, వెనువెంటనే అమలు చేశారు. ఇదో వీరోచిత కార్యంగా భావించి, చాలామంది జనం నీరాజనాలు ఇస్తున్నారు. కొందరు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి ఫొటోలు దిగి ఫేస్‌బుక్‌లో పెట్టుకుంటున్నారు. లైక్స్ సాధిస్తున్నారు.

శంషాబాద్ ఘటనలో దిశ.. దిక్కూ దిశ లేకుండా నేరగాళ్ల పాలబడి నలిగిపోతున్న దశలో బాధితురాలి తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌కు వెళ్తే పరిధి కాదని పరుగులు పెట్టించి, చివరకు అర్ధరాత్రి ఎప్పుడో ఎఫ్ఐఆర్ రాసే సమయానికి ఆమె నామరూపాలు కోల్పోయి మంటల్లో మాడిపోయింది. ఆ రాత్రి పోలీసులు పరుగెత్తి, అక్కడ కాల్పులు జరిపి నలుగురిని చంపి దిశను కాపాడి ఉంటే నిజంగా వారు హీరోలే?

దిశపై అత్యాచారం చేసి కాల్చేసిన సంఘటనపై స్థానిక, జాతీయ మీడియా కలిసి పాలనా వ్యవస్థను, వారి నిర్లిప్తతను అసమర్థతను ఎండగట్టాయి. జాతీయ స్థాయిలో పరువుపోయిందని అర్థమయింది. ఆలస్యంగా జూలు దులిపిన ఐదో సింహం నలుగురిని అరెస్టు చేసింది. నిందితుల భద్రత కోసం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ స్వయంగా పోలీసుస్టేషన్‌కు వచ్చి 14 రోజుల కస్టడీ మంజూరు పత్రాన్ని ఇచ్చారు. కోర్టు ఆవిధంగా నమ్మి నిందితులను జాగ్రత్తగా పోలీసులకు అప్పగించింది. దిశ నిందితులు నేరస్తులని రుజువుచేసి, శిక్షించే రాజ్యాంగబద్ధమైన అధికారం కలిగి ఉన్నా ఆ అవకాశాన్ని న్యాయస్థానం కోల్పోయింది. కోర్టు విచారణా వ్యవహారంలో అడ్డుపడితే కోర్టు ధిక్కార నేరం. మరి, ఎవరైనా జైలుకు వెళ్తారా?

చిల్లర దొంగలను కూడా భద్రంగా కోర్టుకు తీసుకువెళ్లాలి. పారిపోకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. ఒక్కోసారి కాళ్లకు చేతులకు గొలుసులు కడతారు. జాలీ వ్యాన్ కిటికీతో కలిపి బేడీలు వేస్తారు. ఇప్పుడు బేడీలు ఎవరూ వాడని మ్యూజియం పరికరాలు అవుతున్నాయా? అసలు బేడీలు వాడడం ఎందుకు, తుపాకులే వాడితే సరిపోతుందనేది కొత్త సిద్ధాంతమా? నలుగురు నిందితులను నేర ఘటన జరిగిన చోటికి అర్ధరాత్రే తీసుకువెళ్లవలసిన అవసరం ఉందా? తీసుకువెళ్తే అన్ని జాగ్రత్తలు వహించారా లేదా? మూడు బుల్లెట్లు దిగినా, ప్రాణం పోతున్నా మొదటి నిందితుడు తుపాకీ గట్టిగా పట్టుకుని పడిపోయాడా? మీ దగ్గర బేడీలు లేవా? అని జాతీయ మానవ హక్కుల సంఘం ప్రతినిధులు ప్రశ్నించినట్టు పత్రికల్లో రాశారు.

ఆత్మరక్షణ కోసం ఏమైనా చేయవచ్చు. చంపేయవచ్చు. ఆత్మరక్షణ హక్కు సహజమైనది. రాజ్యాంగబద్ధమైనది. చట్టం కల్పించినది. సాక్ష్య చట్టం, శిక్షా చట్టం, ప్రక్రియా చట్టం మూడూ చాలా స్పష్టంగా వివరించిన హక్కు. పోలీసులు కూడా మనుషులే, కనుక వారికీ ఆ హక్కు ఉంది. హైదరాబాద్ పోలీసులు ఈ హక్కు నిజంగా వాడుకుని ఉంటే ఎన్‌కౌంటర్ సహజంగా జరిగినదే అయితే, రుజువు చేసుకోవలసిన బాధ్యత వారిపైనే ఉందని సాక్ష్య చట్టం వివరిస్తున్నది. కోర్టుకు నమ్మదగిన రుజువులు ఇస్తే సెక్షన్ 100 (ఐపీసీ) కింద మినహాయింపు వర్తిస్తుంది. నిర్దోషులవుతారు. అప్పుడు వారితో సెల్ఫీలు దిగవచ్చు. అందుకని వెంటనే ఎన్‌కౌంటర్ చేసిన నిందిత పోలీసులపైన కేసు నమోదు చేయవలసిన బాధ్యత ఇతర పోలీసుల పైన ఉంది. ఎప్పుడు కేసు పెడతారు? ఎన్‌కౌంటర్ జరిగిందా? చేశారా?

నేరాలకు సాక్ష్యాలు సేకరించాల్సిన బాధ్యత గాలికి వదిలేసి, కాల్చేసి చేతులు దులుపుకునే పోలీసు అధికారులకు ప్రమోషన్ ఇచ్చి న్యాయమూర్తులుగా నియమిస్తే.. వారు ఉరితాడు లేకపోయినా, తలారి రాకపోయినా తక్షణ మరణ దండన విధించవచ్చు, ప్రేక్షకులూ, అభిమానులు ఆలోచనలు మానేసి పాలాభిషేకాలు చేసుకోవచ్చు. జైళ్లకు కోర్టులకు తాళాలు వేసుకోవచ్చు. రాజ్యాంగం కాగితాల్ని తుపాకులను తుడుచుకోవడానికి సద్వినియోగం చేయవచ్చు.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# గొల్లపూడి గుడ్‌బై



భరద్వాజ

గొల్లపూడి మారుతీరావు అనే ఒక్క పేరే అనేక రకాలుగా సాక్షాత్కరిస్తుంది. బుద్ధిజీవులకు ఓ మహా రచయిత దర్శనమిస్తాడు. సినీ జీవులకు ఆ పేరు వినగానే నాగభూషణం లాంటి విలన్ గుర్తొస్తాడు. పత్రికా ప్రపంచంలో జీవనయానం ప్రారంభించి రంగస్థల, సినీ రచయితగా అనేక పాత్రలు పోషించిన ఆయన వేదిక దిగేశారు.

1939 ఏప్రిల్ 14న విజయనగరంలో జన్మించిన గొల్లపూడి విద్యార్థిగా ఉన్నప్పుడే రచనా వ్యాసంగంలోకి దూకేశారు. తొలి దశలో కథలు రాయడం ప్రారంభించారు. ఆ తర్వాత కలాన్ని నమ్ముకునే జీవించాలనుకున్నారు. ఆంధ్రప్రభలో చేరారు. అట్నుంచి రేడియోకి విస్తరించారు. నాటక రచయితగా కళ్లు లాంటి ప్రయోగాత్మక రచనతో అవార్డులతో పాటు ప్రేక్షక హృదయాలనూ గెల్చుకున్నారు.

రచనా రంగంలో విజయపతాకం ఎగరేసిన గొల్లపూడి సహజంగానే దుక్కిపాటి మధుసూదనరావు దృష్టిని ఆకర్షించారు. అరెకపూడి కౌసల్యాదేవి రాసిన చక్రభ్రమణం నవల ఆధారంగా తెరకెక్కిన డాక్టర్ చక్రవర్తి సినిమాకు స్క్రీన్ ప్లే రచయితగా గొల్లపూడిని ఆహ్వానించారు దుక్కిపాటి. ఆ స్క్రీన్ ప్లే రచనకు నంది పురస్కారం అందుకున్నారు. ఆ తర్వాత విశ్వనాథ్ తొలి చిత్రం ఆత్మగౌరవం స్క్రిప్టుకు మరోసారి నంది గొల్లపూడిని వరించింది. అనేక సూపర్ హిట్ చిత్రాలకు డైలాగ్ రైటర్‌గా పనిచేశారు గొల్లపూడి. ఎస్.డి. లాల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన అనేక సూపర్ హిట్ చిత్రాలకు డైలాగ్స్ రాశారు. అన్నదమ్ముల అనుబంధం లాంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు డైలాగ్స్ రాసి తన కలానికి మాస్ పల్స్ కూడా తెల్సుననిపించారు మారుతీరావు.

కోడి రామకృష్ణ దర్శకుడుగా అరంగేట్రం చేయడానికి ముందుగా అనుకున్న కథ తరంగిణి. అయితే చిత్ర కథానాయకుడు చిరంజీవి అని నిర్మాత కన్ఫర్మ్ చేయడంతో కథ మారి ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య అయ్యింది. అందులో ఓ పాలిష్డ్ విలన్ రోల్ ఉంటుంది. దాన్ని ఎవరితో చేయించినా పండదనిపించింది కోడి రామకృష్ణకు. ఫైనల్‌గా మీరే చేసేయండని గొల్లపూడిని బలవంత పెట్టేశారు. ఆయనా సరే అనేశారు. అలా నటుడుగా తెర ముందుకు వచ్చి సక్సెస్ కొట్టారు.

ఆ తర్వాత అనేక పాత్రలు గొల్లపూడిని వెతుక్కుంటూ వచ్చాయి. అలా వచ్చిన వాటిలో అద్భుతంగా పేలినవి అనేకం ఉన్నాయి. అభిలాషలో ఉత్తరాంధ్ర మాండలికంలో ఓ శాడిస్ట్ విలన్ రోల్ చేశారు గొల్లపూడి. బామ్మర్ది అనే ఊతపదంతో ప్రవేశించే ఆ పాత్ర అభిలాష సెకండాఫ్‌ను నిలబెట్టింది. అలా సినిమా సక్సెస్‌కు ఊతంగా నిల్చిన అనేక పాత్రలకు గొల్లపూడి ప్రాణం పోశారు.



నివాళి

సుమారు 87 చిత్రాలకు కథ, స్క్రీన్ ప్లే, మాటలు సమకూర్చిన గొల్లపూడి నటుడుగా 230 చిత్రాలు చేశారు. క్యారెక్టర్ రోల్స్‌తో పాటు హాస్యనటుడిగానూ మెప్పించారు. ముఖ్యంగా గుంటనక్క తరహా విలనిజం చేయాలంటే.. గొల్లపూడిదే అగ్రతాంబూలం. గొల్లపూడి నటనలో ఓ నిండుదనం ఉంటుంది. డైలాగ్ మీద పట్టు ఉంటుంది. అద్భుతమైన మాడ్యులేషన్ ఉంటుంది. ఫైటింగులు చేసే విలనీ కాదు... జస్ట్ అలా కూల్‌గా మాట్లాడుతూ అపారమైన దుర్మార్గం గుప్పించే పాత్రలు పోషించాలంటే చాలా టాలెంట్ కావాలి. అధికారం కావాలి. నాగభూషణం చేయగలిగేవాడు. పాత్రకు న్యాయం చేయడానికి ఒక్కోసారి స్వతంత్రించేవారు కూడా. గొల్లపూడిలో మళ్లీ ఆ స్థాయి నటుడు కనిపిస్తాడు. చిరంజీవి ఛాలెంజ్ మూవీలో స్మిత భర్త పాత్రలో గొల్లపూడి ఆ తరహా విలనీ అద్భుతంగా పండించారు.

విస్తృతమైన తన అనుభవాల సారాన్ని అమ్మ కడుపు చల్లగా పేరుతో ప్రచురించారు గొల్లపూడి. ఆయన బాగా ఔట్ స్పోకెన్. ఎటువంటి దాపరికాలూ ఉండవు. తన మనసులో అనిపించింది రాసేస్తారు. అందుకే ఆయన అంత విస్తృతంగా రాసేస్తారు. ఇంటర్ నెట్‌లో కూడా అంత విస్తారంగా రాసిన రచయితలు అరుదు. అదీ మారుతీయం. వయసు పెరిగిన తర్వాత అడపాదడపా గౌరవప్రదమైన పాత్రల్లో కనిపిస్తూ... అచ్చతెనుగు నుడికారాన్ని వినిపిస్తూ... కనిపించిన నటుడు గొల్లపూడి. ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసిన గొల్లపూడి కలం ఆయన కన్నుమూసే వరకు అలసట చెందక సాహితీ వ్యవసాయం చేస్తూనే ఉంది. ఇప్పుడు స్మృతిగా మిగిలిపోయింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899


'సంసారం ఒక చదరంగం'లో..

నివాళి

# సముద్రం మౌనం దాల్చింది

ఒక కెరటం తీరానికి నుదురు తాకించి
మరి అలాగే ఉండిపోయింది.
ఒక వాక్ప్రవాహం తన ధారను నెమ్మదింపజేసి
విరామం ప్రకటించింది.
ఒక చేయి రాసి రాసి కాగితాల బొత్తిని
ఆఖరుసారి అటక మీద విసిరేసింది.
ఒక ముఖం తాను పూసుకునే రంగును
అక్కర్లేనట్టుగా నేలన ఒంపేసింది.
ఒక పదేపదే వచ్చే ప్రస్తావన
ఇక రాలేనన్నట్టుగా పక్కకు తప్పుకుంది.
ఒక అనంత జ్ఞాపకాల రాశి మన్నింపు కోరుతూ
తనను తాను శూన్యపరుచుకుంది.
ఒక సముద్రం తన ఘోషను చాలించింది.
ఒక కడలి మౌనం దాల్చింది.
గొల్లపూడి మారుతీరావుకు 'సాయంకాలమైపోయింది'.


గొల్లపూడి మారుతీరావు

● ఖదీర్

'సంసారం ఒక చదరంగం' సినిమాలో నెల ఖర్చుల దగ్గర తండ్రికీ కొడుక్కూ మాటామాటా పెరుగుతుంది. ఎదురుగా ఉన్నది ముసలితండ్రి. ఎదిరిస్తున్నది యవ్వనంలో ఉన్న కొడుకు. 'నిన్ను నేను సాకాల్సిన పని లేదు' అంటాడు కొడుకు. 'నిన్ను కనీ పెంచి పెద్ద చేసిన ఈ తండ్రితోనే మాట్లాడుతున్నావా నువ్వు' అంటాడు తండ్రి. 'అవును' అంటాడు కొడుకు. 'నీ చదువుల కోసం ఓవర్‌టైమ్ పని చేసి ఫీజులు కట్టిన తండ్రితోనే మాట్లాడతున్నావా నువ్వు?' అంటాడు తండ్రి. 'అవును' అంటాడు కొడుకు. 'నీకు యాక్సిడెంట్ అయితే భుజాల మీద మోసుకొని వెళ్లి రక్తమిచ్చి కాపాడుకున్న తండ్రితోనే మాట్లాడుతున్నావా నువ్వు?' అంటాడు తండ్రి. 'అవును' అంటాడు కొడుకు.

ఇంకో తండ్రయితే ఆ క్షణంలో కుప్పకూలుతాడు.

కాని ఆ తండ్రి మాత్రం, అక్కడ ఉన్న తండ్రి మాత్రం, నెరిసింది తల వెంట్రుకలే తప్ప రోషం కాదు అనుకుని తాపీగా, తీర్పుగా, పెద్దగా 'అయితే నా ఇంట్లో నుంచి బయటకుపోరా కుక్కా' అంటాడు.

ఆ క్షణంలో ఆ తండ్రి చాలామందికి గుర్తుండి పోయాడు.

ఆ తండ్రిగా నిలబడ్డ గొల్లపూడి మారుతీరావు కూడా.

ఎడమ చేయి ఆడిస్తూ డైలాగ్ చెప్పి పాపులర్ అయిన తారలు ఇద్దరున్నారు తెలుగులో. ఒకరు సూర్యకాంతం. మరొకరు గొల్లపూడి మారుతీరావు. ఇద్దరూ నాటకాల నుంచి వచ్చినవాళ్లే.

'కాని నాకు సినిమా నటన నేర్పింది మాత్రం చిరంజీవి. ఆయనే కెమెరా ముందు ఎలా నిలబడాలి, ఎలా విరమించుకోవాలి నేర్పించాడు' అని వినమ్రంగా చెప్పుకున్నారు గొల్లపూడి.

మొదటి సినిమా 'ఇంట్లో రామయ్య–వీధిలో కృష్ణయ్య' (1982) విడుదలయ్యి హిట్ అయ్యేంత వరకూ ఆల్ ఇండియా రేడియోలో ఉద్యోగం చేస్తూనే సినిమాల్లో, నాటకాల్లో, సాహితీ వ్యాసంగంలో రాణించారు గొల్లపూడి. అప్పటి వరకూ ఆయన ఏనాడూ విశ్రాంతిగా లేరు. ఆ తర్వాత కూడా లేరు.

విశాఖలో బాల్యం గడపడం, విశాఖ సముద్రాన్ని చూస్తూ ఎదగడం, ఆ గాలి, ఆనాటి సాంస్కృతిక ఔన్నత్య స్పర్శ తాకుతూ ఉండటం ఆయనను ఆది నుంచి అవిశ్రాంతంగానే ఉంచింది. బి.ఎస్సీ ఆనర్స్‌లో చేరారుగాని ఏనాడూ చదువు మీద శ్రద్ధ లేదు. తెల్లవారి లేస్తే ఊరి వీధుల్లో కనిపించే పురిపండా అప్పలస్వామి, చాగంటి సోమయాజులు, రావిశాస్త్రి, అప్పుడప్పుడు శ్రీపాద వంటి గొప్పవారు ఆయనను ఊరికే ఉంచలేదు. పుస్తకాల వెంట పడేలా చేసి పదిహేనేళ్లకే కళ్లకు అద్దాలు తెచ్చుకునేలా చేశారు. చేతికి కలం ఇచ్చి రాసేందుకు పరుగులెత్తించారు. గొల్లపూడి రాయడమే కాదు ఆ రోజులలోనే పెద్ద పెద్ద ఇంగ్లిష్ నవలలని అనువాదం చేయడం మొదలెట్టారు. ఉంటున్నది విశాఖ. పక్కనే విజయనగరం. 'కన్యాశుల్కం' రాసిన గురజాడ వారి ఊరు. చీటికిమాటికి నాటకోత్సవాలు జరిగి తారసపడే జె.వి.సోమయాజులు, జె.వి.రమణ మూర్తి, కె.వెంకటేశ్వరరావు వంటి నటులు. ఆయన నాటక రచయిత అయ్యాడు. ఆంధ్ర యూనివర్సిటీలో నాటకం పేరు చెబితే గురొచ్చే విద్యార్థి రచయితగా ఎదిగాడు.

నిజంగానే మనం ఎలా ఉన్నామనేది మనం ఎవరితో ఉన్నాం అన్నదాన్ని బట్టే ఆధారపడి ఉంటుంది. ఢిల్లీలో ఉద్యోగవేటకు వెళ్లినప్పుడు ఆయన దోస్తీ చేసింది పురాణం సుబ్రహ్మణ్యశర్మతో. చిత్తూరులో ఆంధ్రప్రభ రిపోర్టర్‌గా చేరినప్పుడు కలిసి తిరిగింది కె.సభావంటి రచయితలతో. శంకరంబాడి సుందరాచార్యవంటి గేయకర్తలతో. జి.కృష్ణ వంటి ఉద్దండ జర్నలిస్టుల జ్ఞానానికి ఆయన దోసిట పట్టాడు. ఇక రేడియోలో దేవులపల్లి కృష్ణశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, బుచ్చిబాబు, ఉషశ్రీ... కూచుంటే ఒక భావ వీచిక. మాట్లాడితే ఒక సృజనకేళిక. అదంతా ఆయన చేత 'కళ్లు', 'రెండు రెళ్లు ఆరు' వంటి శక్తిమంతమైన నాటికలు రాసేలా చేసింది. నవలలు, కథలు ఆయనకు పేరు తెచ్చి పెట్టాయి. అవే ఆయనను సినిమాలలో ప్రవేశపెట్టాయి.

**చేసింది చాలు అని ఏనాడూ అనుకోకుండా చేయాల్సింది ఎంతో ఉంది అని గొల్లపూడి నుంచి నేర్చుకోవాలి.**


'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య'లో..


'బ్రహ్మోత్సవం'లో..


'మంగమ్మగారి మనవడు'లో..


'కంచె'లో..


'లీడర్'లో..


'తరంగిణి'లో..


'మనిషికో చరిత్ర'లో..


'రౌడీఫెలో'లో..

## మా ఇద్దరిదీ గురుశిష్యుల బంధం – చిరంజీవి

''గొల్లపూడి మారుతీరావుగారిది, నాది గురుశిష్యుల బంధం. ఆయన కుమారుడి పేరున నిర్వహించే గొల్లపూడి శ్రీనివాస్ అవార్డ్ ఫంక్షన్‌కి ఇటీవల వెళ్లాను. తర్వాత మళ్లీ ఆయన్ను కలవలేదు. నేను 1979లో 'ఐ లవ్ యూ' అనే సినిమా చేశాను. ఆ చిత్రనిర్మాత భవన్నారాయణగారు నాకు గొల్లపూడి మారుతీరావుగారిని పరిచయం చేశారు. అప్పటికే మారుతీరావుగారు చాలా పెద్ద రచయిత, పాత్రికేయుడిగానూ చేశారు. సాహిత్యపరంగా కూడా ఎంతో పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తి, విద్యాధికులు. ఆయన దగ్గర డైలాగ్స్ నేర్చుకోమని నన్ను పంపించారు. అప్పుడు మారుతీరావుగారు డైలాగులు ఎలా పలకాలో నేర్పించారు. ఆ విధంగా ఆయన నాకు గురువనే చెప్పాలి. 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' సినిమాలో ఒక రకమైన శాడిజమ్, కామెడీగా ఉండే క్యారెక్టర్‌కి గొల్లపూడిగారు బాగుంటారని డైరెక్టర్ కోడి రామకృష్ణగారు అనగానే నాకూ కరెక్ట్ అనిపించింది. ఆయన ఆ పాత్రలో అద్భుతంగా నటించారు. ఆ విధంగా నా సహనటుడుగా ఆయన చేయడం అనేది నాకో మంచి అనుభూతి. ఆ తర్వాత 'ఆలయశిఖరం', 'అభిలాష', 'చాలెంజ్'... ఇలా ఎన్నో సినిమాల్లో కలిసి నటించాం. ఎప్పుడు కలుసుకున్నా గతాన్ని గుర్తు చేసుకుంటూ చాలా ఆప్యాయంగా మాట్లాడేవారు. అలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలి దూరమవ్వడం అనేది చాలా బాధాకరం.


'సుందరకాండ'లో..


'పుణ్యస్త్రీ'లో..

సాహిత్యం నుంచి, రేడియో నుంచి వెళ్లిన అందరూ సినిమాల్లో సక్సెస్ కాలేదు. కాని గొల్లపూడి అయ్యారు. నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు కోడూరి కౌసల్యాదేవి 'చక్రభ్రమణం' నవలను 'డాక్టర్ చక్రవర్తి' పేరుతో సినిమాగా మలచాలంటే ఆ కష్టతరమైన ప్లాట్‌కు ట్రీట్‌మెంట్ రాయగలిగే చేయి గొల్లపూడిదిగా తప్ప మరొకటిగా కనిపించలేదు. ఆ సినిమాకు దర్శకత్వశాఖలో పని చేసిన కె.విశ్వనాథ్ గొల్లపూడిని గమనించి 'ఆత్మగౌరవం'తో మొదలు 'చెల్లెలి కాపురం', 'శుభలేఖ', 'ఓ సీత కథ', 'శుభసంకల్పం' సినిమాల వరకూ పని చేశారు. వారిద్దరూ ఆప్తమిత్రులు.

కాని గొల్లపూడి సినిమా కెరీర్‌లో మరో ముఖ్యవాటాదారు ఎన్.టి.ఆర్ అని చెప్పాలి. ఎన్.టి.ఆర్ తాను నటించిన రీమేక్ చిత్రాలు 'నిప్పులాంటి మనిషి' (జంజీర్), 'అన్నదమ్ముల అనుబంధం' (యాందోకి బారాత్), 'నేరం నాది కాదు, ఆకలిది' (రోటీ), 'లాయర్ విశ్వనాథ్' (విశ్వనాథ్) అన్నింటికీ సంభాషణ రచయితగా గొల్లపూడినే ఎంచుకున్నారు. గొల్లపూడి రచన చేసిన సినిమాలలో 'ఆరాధన', 'అమెరికా అమ్మాయి', 'పాపం పసివాడు', 'మరపురాని తల్లి' చెప్పుకోవాల్సినవి. కోడి రామకృష్ణకు 'ఇంట్లో రామయ్య–వీధిలో కృష్ణయ్య', 'తరంగిణి', 'ముక్కుపుడక' వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన రచయిత గొల్లపూడి. గొల్లపూడిని నటుణ్ణి చేసి కోడి రామకృష్ణ, కోడి రామకృష్ణకు రాసి గొల్లపూడి పరస్పరం లాభపడ్డారు. 'సంసారం ఒక చదరంగం', 'పుణ్యస్త్రీ', 'మా పల్లెలో గోపాలుడు', 'మన్నెంలో మొనగాడు' ఇవన్నీ గొల్లపూడి మెరిసిన చిత్రాలు. భార్య చాటు భర్తగా 'ముద్దుల కృష్ణయ్య', 'ప్రేమ' సినిమాల్లో, కుతంత్రుడిగా 'స్వాతిముత్యం'లో, సింగిల్‌పూరి సుబ్బారావుగా 'సుందరకాండ'లో, అమాయక పంతులుగారిగా 'మంగమ్మగారి మనవడు'లో ఆయన నవ్విస్తారు. 'లీడర్', 'కంచె', 'బ్రహ్మోత్సవం', 'మనమంతా' ఆయన చివరగా కనిపించిన సినిమాలు.

సినిమా నటుడిగా ఎంత కృషి చేశారో రచయితగా, టీవీ వ్యాఖ్యాతగా, కాలమిస్ట్‌గా గొల్లపూడి అంతే కృషి చేశారు. చేసిన పనంతా ఒకచోట కూర్చి చూస్తే ఇంత పని సాధ్యమా అనిపిస్తుంది. కథలు, నవలలు, నాటికలు, కాలమ్స్, యాత్రాకథనాలు... అసంఖ్యాకంగా రాస్తూనే ఉన్నారు. తన జీవితానుభవాలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు చెప్పే 'జీవనకాలమ్' పాఠకులకు ఒక అనుభవాత్మకపాఠం. 'అమ్మకడుపు చల్లగా' ఆయన ఆత్మకథ. డెబ్బయ్యేళ్లు పైబడిన వయసులో ఎవరైనా పడక్కుర్చీకి పరిమితమవుతారు. కాని ఆయన ఆ వయసులో తెలుగు కథను గౌరవించాలని బయలుదేరి ఎంతో ప్రయాసతో నూరుమంది రచయితలను ఇంటర్వ్యూ చేసి వారి కథలను పరిచయం చేస్తూ టీవీ ప్రోగ్రామ్ చేసి అంతటితో ఆగక 'వందేళ్ల కథకు వందనాలు' పేరుతో విలువైన గ్రంథం ప్రచురించడం కచ్చితంగా శ్లాఘించదగిన పని.

చెట్టంత కొడుకు, గొల్లపూడి శ్రీనివాస్, ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ శోకం నుంచి తట్టుకొని నిలబడటానికి చివరి శ్వాస వరకూ ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. శ్రీనివాస్ పేరు మీద ఆయన ఏర్పాటు చేసిన అవార్డు దేశంలో గౌరవప్రదమైన అవార్డు అని దానిని అందుకున్న ఆమిర్‌ఖాన్ వంటి వారిని చూస్తే అర్థమవుతుంది.

చేసింది చాలు అని ఏనాడూ అనుకోకుండా చేయాల్సింది ఎంతో ఉంది అని గొల్లపూడి నుంచి నేర్చుకోవాలి. కొందరు తమకు తెలిసిన దానిని తమతోనే ఉంచుకుంటారు. ఇవ్వడం, పంచడం ఉదార విషయాలు. ఆ ఇవ్వడం, పంచడం తెలిసిన ఉదారత గొల్లపూడిలో ఉంది. కొన్ని ఆయన అభిప్రాయలతో, తత్త్వంతో కొందరికి భేదం ఉండొచ్చు. కాని మాట్లాడే పెద్దమనిషి ఒకడు మనతో ఉన్నాడు అనే భావన అవసరం.

గొల్లపూడి మారుతీరావు అనే నూరు కెరటాల సముద్రపు హోరు ఇక మీదట వినిపించకపోవచ్చు. 'గిరీశం' వంటి పాత్రలను పదేపదే ప్రతిష్ఠాపన చేయడానికి ఆయన కనపడకపోవచ్చు. వేదిక మీద ఒక మంచి ఉపన్యాసం ఇవ్వడానికి మైకందుకుంటూ గోచరం కాకపోవచ్చు. వారం వారం అలవాటైన ఒక పలకరింపుకు ఎప్పటికీ గుడ్‌బై చెప్పేయవచ్చు.

కాని ఆయన వదిలివెళ్లిన గుర్తులు ఇప్పటికిప్పుడు చెరిగిపోవు. చెదిరిపోవు. మిగిలిన మౌనంలోని సంభాషణ కూడా.

● ముగ్గు-ముచ్చట



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34.
muggulu.sakshi@gmail.com



హైదరాబాద్ : దిల్సుఖ్‌నగర్ (మూసారంబాగ్) | దిల్సుఖ్‌నగర్ (హనుమాన్ నగర్) | ఎల్ & టి మాల్, పంజాగుట్ట | జివికె వన్ | ఇనార్బిట్ మాల్ | జూబ్లీ హిల్స్ | బంజారా హిల్స్ | ఎ.ఎస్.రావు నగర్ | ఫోరం మాల్ మంజీరా మాల్ | హిమాయత్ నగర్ | ఇంకా ఇక్కడ లభించును: CENTRAL | sochstore.com వద్ద ఆన్‌లైన్‌లో కూడా షాపింగ్ చేయండి

# నువ్వా నేనూ సేమ్ రా అనుకున్నాను


● వెంకటేశ్

"మల్టీస్టారర్ సినిమాలు సౌకర్యంగా ఉంటున్నాయి కాబట్టే చేస్తున్నాను. కంఫర్ట్ లేకపోతే ఎందుకు చేస్తాను? ఇద్దరి యాక్టర్స్‌కి మధ్య వాతావరణం సరిగ్గా లేకపోతే అది సెట్లోనూ బావుండదు. స్క్రీన్ మీద అస్సలు బావుండదు. షూటింగ్ లొకేషన్‌కి వెళ్లినప్పుడు హ్యాపీగా వెళ్లాలి కానీ ఈ హీరో ఉన్నాడా? మన స్క్రీన్ టైమ్ ఎంత అనే ఆలోచనలతో కాదు. నటుడిగా 33 ఏళ్లు పూర్తి చేసుకున్నాను. ఇప్పుడు కూడా ఎంజాయ్ చేయకపోతే ఉపయోగం ఏంటి?" అన్నారు వెంకటేశ్. నేడు ఆయన పుట్టిన రోజు. నాగచైతన్యతో కలసి వెంకటేశ్ నటించిన మల్టీస్టారర్ చిత్రం 'వెంకీ మామ'. బాబీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను సురేశ్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా వెంకటేశ్ చెప్పిన విశేషాలు.

- నేను, నాగచైతన్య.. ఆ తర్వాత నేను, రానా కలసి నటించాలన్నది నాన్న గారి కోరిక. అలాగే మేమందరం కలసి ఓ సినిమా చేయాలనుకున్నారు ఆయన. అప్పుడు మాకు తగ్గ కథలు కుదర్లేదు. చైతన్య, నేను కలిసి యాక్ట్ చేయడం ఇప్పటికి కుదిరింది. చైతూతో నటించడం హ్యాపీగా, థ్రిల్లింగ్‌గా అనిపించింది.
- 'వెంకీ మామ' కేవలం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మాత్రమే కాదు. కథలో, పాత్రల్లో చాలా లోతు ఉంటుంది. యాక్షన్, ఎమోషన్ అన్నీ సమపాళల్లో పక్కా కమర్షియల్ సినిమాలా ప్యాక్ చేశాం.
- చిన్నప్పుడు పిల్లలందరిలో మాకు ఫేవరెట్ చైతన్యే. బొద్దుగా ఉండేవాడు. అందరం వాణ్ణి బాగా ముద్దు చేసేవాళ్లం. యాక్టర్‌గా చైతన్య చాలా నేర్చుకుంటున్నాడు. వేరే వాళ్లతో పోల్చుకోకుండా తనతో తను పోటీపడి, ప్రొఫెషన్‌తో నిజాయతీగా ఉంటూ పని చేసుకుంటూ వెళ్లాలి.
- చైతూ, నేను ఇంట్లో వేరు.. సెట్లో యాక్ట్ చేయడం వేరు. మామా అల్లుళ్లుగా ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయాలి. ఈ సినిమా షూటింగ్ మొదట్లో చైతూని గమనిస్తూ ఉండేవాణ్ని. కామ్‌గా ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. 'ఏం ఆలోచిస్తున్నావు రా?' అనుకునేవాణ్ణి (నవ్వుతూ). కానీ వాడు నాలానే కామ్‌గా ఉండటం గమనించాను. 'నువ్వా నేనూ సేమ్ రా' అనుకున్నాను. మామ లొకేషన్‌కి 9కి వస్తున్నాడని 8.45కే వచ్చేవాడు. నడక, ఆ స్టయిల్‌తో పాటు ఏదో ఆలోచించడం కూడా మేనమామ (చైతూకి వెంకీ మేనమామ) పోలికే వచ్చినట్టుంది (నవ్వుతూ).
- చైతన్యకి చిన్నప్పుడు యాక్టింగ్ మీద ఆసక్తి లేకపోయినా యాక్టర్ అయ్యాడు. నేను, రానా కూడా అనుకోకుండా నటనలోకి వచ్చాం. అయినప్పటికీ ప్రేక్షకులు మమ్మల్ని ఆదరించారు. తెలుగు సినిమా అభిమానులు చాలా స్పెషల్. నచ్చితే ఏ సినిమా అయినా చూస్తారు. యాక్టర్స్‌ను విపరీతంగా ప్రేమిస్తారు. మధ్యలో ఫ్లాప్స్ వచ్చినా, ఆ హీరో నుంచి హిట్ సినిమా వస్తే మళ్లీ తప్పకుండా చూస్తారు. నేను జీవితంలో ప్రతిరోజూ బోనసే అనుకుంటాను. దేవుడు నా పట్ల చాలా దయగా ఉన్నాడనుకుంటాను. దానికి తగ్గట్టు కష్టపడుతుంటాను. అప్పుడే అందరూ 'యాక్టర్‌గా ఇంకా వీడిలో ఏదో ఉంది' అనుకుంటారు. లేకపోతే ఇండస్ట్రీ నుంచి పంపించేస్తారు. 33 ఏళ్లల్లో ఫస్ట్ టైమ్ నా బర్త్‌డేకు రిలీజవుతున్న సినిమా ఇదే. సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాను. బర్త్‌డే సెలబ్రేషన్స్ ప్లాన్ చేయలేదు.
- మల్టీస్టారర్ చిత్రాలు ఆడుతున్నాయి కాబట్టి చేస్తున్నాను. వరుసగా రెండు సినిమాలు పోయాయనుకోండి, మల్టీస్టారర్స్ ఎక్కువ అయిపోయాయి అంటారు. కొన్ని సినిమాలు సోలోగా చేయండి అంటారు. యంగ్ యాక్టర్స్‌లో ఎన్టీఆర్‌తో చేయాలనుంది. నానీతో చేయాల్సింది, కానీ కుదర్లేదు.
- నాన్నగారు సినిమాలే జీవితం అన్నట్లు జీవించారు. ఆయనతో పోలిస్తే మాకు ఉన్న ప్యాషన్ చాలా తక్కువ అనిపిస్తుంది. తెలియకుండానే సినిమా గురించి నాకు చాలా నేర్పించారు. ఆయన్ని మించిన గొప్ప టీచర్ లేరు.
- 'అసురన్' రీమేక్ జనవరిలో స్టార్ట్ అవుతుంది. సమ్మర్‌లో రిలీజ్ చేస్తాం. శ్రీకాంత్ అడ్డాల మంచి కమ్‌బ్యాక్ ఇవ్వాలని కసి మీద ఉన్నాడు.
- ఎప్పటినుంచో యాక్టింగ్ నుంచి రిటైర్‌మెంట్ తీసుకోవాలి అనుకుంటున్నాను. అన్నయ్యవాళ్లు వదలడం లేదు. ఏదో రోజు జంప్ అయిపోతాను.
- నేను వెబ్ సిరీస్‌లోకి కూడా వచ్చేస్తున్నాను. 'వెబ్ సిరీస్‌లో యాక్ట్ చేయండి' అని ఎవరో ఒకరు వచ్చి అడగడం ఎందుకు? నేనే దర్శకులను అడుగుతాను. నాకోసం ఏదో ఒకటి రాయండి. వెబ్ సిరీస్ కథలు తీసుకు రండి చేద్దాం అని.
- స్క్రీన్ టైమ్ ఎంత అని ఆలోచించకుండా కథకు తగ్గట్టు నటించాలి. నా స్క్రీన్ టైమ్ ఎంత? అని ఆలోచిస్తే సినిమాలు చేయలేం. గతంలో సూపర్ స్టార్స్‌ని గమనిస్తే నాగేశ్వరరావుగారు, కృష్ణగారు, శోభనబాబుగారు స్క్రీన్ టైమ్ పట్టించుకోకుండా పాత్రలు చేశారు. చాలెంజింగ్ యాక్టర్స్‌లా ఉండాలి. ప్రస్తుతం యంగ్ హీరోలతో చేస్తున్నాను. వాళ్ల బాడీ లాంగ్వేజ్ గమనిస్తుంటాను. కామెడీ ప్రాధాన్యం ఉన్న చిత్రాలు చేస్తున్నాను కదా ఈ సినిమా మార్పులా ఉంటుంది.
- ప్రస్తుతం ప్రపంచంలో కొంచెం నెగటివిటీ ఉంది. మనం ఎన్ని మంచి పనులు చేసినా, ఒక్క తప్పు చేస్తే దాన్నే ఎత్తి చూపుతారు. అది మాత్రమే గుర్తుపెట్టుకుంటారు. సంతోషంగా ఉండండి. ప్రతిదీ సీరియస్‌గా తీసుకోవద్దు. అందరం పాజిటివ్‌గా ఉందాం. అందరూ బావుండాలి అని కోరుకుందాం. ఆనందమైన ప్రపంచాన్ని కోరుకుంటుంటాను.

# మా ఆయన గొప్ప ప్రేమికుడు


● విజయ్ దేవరకొండ, ఐశ్వర్యా రాజేశ్

"మా ఆయన పేరు శీనయ్య. ఆయన ప్రపంచంలోనే గొప్ప ప్రేమికుడు'' అంటోంది సువర్ణ. ఈ భార్యాభర్తల కథేంటి? అసలు వాళ్ల ప్రేమకథేంటి? తెలియాలంటే వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం వరకూ వెయిట్ చేయాలి. విజయ్ దేవరకొండ హీరోగా రాశీ ఖన్నా, ఐశ్వర్యా రాజేశ్, కేథరీన్ థెరీసా, ఇజబెల్లా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. క్రాంతి మాధవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేయస్ రామారావు సమర్పణలో కేఏ వల్లభ నిర్మించారు. ఈ సినిమాలోని హీరోయిన్ల పాత్రలను పరిచయం చేస్తూ పోస్టర్లు రిలీజ్ చేస్తోంది చిత్రబృందం. గురువారం ఐశ్వర్యా రాజేశ్, విజయ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సువర్ణ అనే గృహిణి పాత్రలో ఐశ్వర్యా రాజేశ్ నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సినిమా రిలీజ్ కానుంది.

# వీర్.. బీర్ కలిశార్


● రణ్‌వీర్


● రణ్‌బీర్

బాలీవుడ్‌లో ప్రస్తుతం ఉన్న యంగ్ యాక్టర్స్‌లో ముందు వరుసలో ఉండే నటులు రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్. విభిన్న కథలు, అద్భుతమైన నటనతో పోటాపోటీగా కనిపిస్తుంటారు. ఇప్పుడు ఈ ఇద్దరూ స్క్రీన్ మీద కనిపించబోతున్నారు అని బాలీవుడ్ టాక్. వీళ్లిద్దరూ కలసి 1994 బ్లాక్‌బస్టర్ మూవీ 'అందాజ్ అప్నా అప్నా' సీక్వెల్‌లో నటించబోతున్నారన్నది వార్త. 'అందాజ్ అప్నా అప్నా' చిత్రంలో ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ కలసి నటించారు. రాజ్‌కుమార్ సంతోషీ దర్శకత్వం వహించిన ఈ సినిమా మంచి సక్సెస్ సాధించింది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌ను రూపొందించే పనిలో పడ్డారు దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషీ. ఈ సీక్వెల్ కోసం ఈ వీర్... బీర్.... అదేనండీ.. రణ్‌వీర్, రణ్‌బీర్‌తో చర్చలు జరుపుతున్నారట. వచ్చే ఏడాది ఈ సీక్వెల్ సెట్స్ మీదకు వెళ్లొచ్చు.

# ఈ ఏడాది చాలా స్పెషల్


● కియారా అద్వానీ

'2019 నాకు స్పెషల్‌గా నిలిచింది. నటిగా నేను గుర్తుంచుకోదగ్గ సంవత్సరం ఇది' అంటున్నారు కియారా అద్వానీ. బాలీవుడ్‌లో కియారాకు ఈ ఏడాది అద్భుతంగా సాగింది. ఈ విషయం గురించి కియారా అద్వానీ మాట్లాడుతూ – ''ఈ ఏడాది నేను నటించిన 'కబీర్ సింగ్' ఘన విజయాన్ని అందుకుంది. 300 కోట్లు వసూళ్లు సాధించింది. ఈ సినిమాకు ప్రేక్షకులు అందించిన ప్రేమ మాటల్లో చెప్పలేను. తొలిసారి లేడీ ఓరియంటెడ్ మూవీ ('ఇందూ కీ జవానీ') చేస్తున్నాను. 'కళంక్'లో చేసిన స్పెషల్ సాంగ్ మంచి పేరు తెచ్చిపెట్టింది. అలానే ఈ ఏడాదిని 'గుడ్‌న్యూస్' సినిమాతో ముగించబోతున్నాను. ఇందులో అక్షయ్ కుమార్, కరీనా కపూర్‌లతో యాక్ట్ చేసే ఛాన్స్ లభించింది. వచ్చే ఏడాది కూడా ఇలానే కొనసాగాలనుకుంటున్నాను'' అన్నారామె.

# ఏపీ దిశా చట్టం అభినందనీయం


● చిరంజీవి

దిశ హత్యాచారం నేపథ్యంలో మహిళలపై అత్యాచారానికి పాల్పడేవాళ్లకు సత్వరమే కఠిన శిక్ష విధించేలా చట్టం తీసుకొస్తామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ క్రిమినల్ లా చట్ట సవరణ బిల్లు-2019కు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాన్ని ప్రముఖ నటుడు చిరంజీవి అభినందించారు. ''దిశా' చట్టం-2019 పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ముఖ్యంగా మహిళా సోదరీమణులకు, లైంగిక వేధింపులకు గురవుతున్న చిన్నారులకు ఈ చట్టం భరోసా, భద్రత ఇస్తుందన్న ఆశ నాలో ఉంది. 'దిశ' ఘటన మనందర్నీ కలచివేసింది. ఆ భావోద్వేగాలు తక్షణ న్యాయాన్ని డిమాండ్ చేశాయి. తక్షణ న్యాయం కంటే సత్వర న్యాయం మరింత సత్ఫలితాలను ఇస్తుందన్న నమ్మకం అందరిలో ఉంది. అలాంటి సత్వర న్యాయం కోసం ఆంధ్రప్రదేశ్‌లో తొలి అడుగు పడటం హర్షణీయం. సీఆర్పీసీ (కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసిజర్)ని సవరించడం ద్వారా నాలుగు నెలలు అంతకంటే ఎక్కువ పట్టే విచారణా సమయాన్ని 21 రోజులకు కుదించే వీలు ఉంది. సోషల్ మీడియాలో మహిళల గౌరవాన్ని కించపరచడంలాంటివి చేస్తే ఐపీసీ (ఇండియన్ పీనల్ కోడ్) ద్వారా తీవ్రమైన శిక్షలు, చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడితే జీవిత ఖైదు విధించడం ద్వారా నేరాలోచన ఉన్నవాళ్లలో భయం కల్పించే విధంగా చట్టం తేవడాన్ని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ప్రత్యేక కోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల్ని కల్పించడం వల్ల మహిళాలోకం నిర్భయంగా, స్వేచ్ఛగా ఉండగలుగుతుందన్న నమ్మకం నాకు ఉంది'' అని ఓ ప్రకటనలో చిరంజీవి వెల్లడించారు.

## గొల్లపూడి మారుతీరావు మృతికి ప్రముఖుల స్పందన


● మారుతీరావుతో నిఖిల్

'హ్యాపీడేస్' (2007) చిత్రానికి ముందు ఓ చిన్న సినిమా కోసం యాక్టర్ కమ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా గొల్లపూడి మారుతీరావుగారితో పని చేశాను. గొల్లపూడిగారు నాకు ఇచ్చిన సలహాలు, సూచనలు ఇప్పటికీ నాతో ఉన్నాయి. గొప్ప చిత్రాలతో ఆయన ఎప్పటికీ మనతోనే ఉంటారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి

– నటుడు నిఖిల్

### నన్ను హీరో అని పిలిచేవారు


● శివాజీరాజా

నేను సినిమా ఇండస్ట్రీకి హీరోగా పరిచయం అయిన చిత్రం 'కళ్లు'. నాకు నటుడిగా జన్మనిచ్చిన తండ్రి మారుతీ రావుగారు. ఆ సినిమా కథ ఆయనదే. ఆ సినిమా తర్వాత నటులుగా కూడా నేను, ఆయన చాలా సినిమాలు చేశాం. ఆయనకు 'అరుణాచ లం' అంటే ఇష్టం. విచిత్రంగా నేను ఇప్పుడు అక్కడే ఉన్నాను. 'కళ్లు' సినిమా అప్పటినుంచి ఇప్పటివరకూ నన్ను 'హీరో' అనే పిలిచేవారు. 'కళ్లు' అనేది నా జీవితంలో మంచి జ్ఞాపకం. ప్రముఖ కెమెరామేన్ ఎం.వి. రఘు ఈ సినిమాతో దర్శకుడయ్యారు.

గొల్లపూడిగారికి చాలా ఇష్టమైన కథ 'కళ్లు'. ఈ సినిమాకి 'తెల్లారింది లెగండో..' అనే మంచి పాట రాశారు 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారు. ఆయన పెద్ద కొడుకు పేరు రాజా. నన్నూ కొడుకులా భావించి, 'రాజా' అనే పిలుస్తారు. ఈ చిత్రానికి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారు సంగీతదర్శకుడు. ఈ సినిమాకి మూడు నంది అవార్డులు వచ్చాయి. నిజానికి ఈ సినిమాని రజనీకాంత్ హీరోగా తమిళంలో మొదలుపెట్టారు. రెండు మూడు రీళ్లు తీశాక ఆపేశారు. ఆ తర్వాత తెలుగులో నన్ను హీరోగా పెట్టి తీశారు. నంది అవార్డు మాత్రమే కాదు.. అప్పుడు ఉన్న ప్రైవేట్ అవార్డులతో కలిపి నాకు పదిహేను పదహారు అవార్డులు వచ్చాయి. అలా 'కళ్లు' సినిమాకి చాలా విశేషాలున్నాయి. అంతటి మంచి సినిమాకి అవకాశం ఇచ్చారు. గొల్లపూడిగారు మంచి నటుడు, రచయిత. ఆయనకు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. 'కళ్లు' 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐదేళ్ల క్రితం ఫంక్షన్ చేశాం. ఆ ఫంక్షన్‌లోనే చివరిసారి ఆయన్ను కలిశాను. ఆయన ఎక్కడ తిరుగుతుంటే అక్కడ సరస్వతి తిరుగుతున్నట్లు అనిపించేది. అంతటి మహానుభావుడిని కోల్పోయాం. ఆయన లేని లోటు భర్తీ చేయలేనిది.

– నటుడు శివాజీరాజా

### అది ఆయనకే సాధ్యం


● కోన వెంకట్

గొప్ప నటుడు, రచయిత అయిన గొల్లపూడి మారుతీరావుగారు చనిపోవడం చాలా బాధాకరం. ఎందుకంటే ఒక రచయితగా నేను ఆయనకు పెద్ద అభిమానిని. ఆయన కథారచయితగా, మాటల రచయితగా, స్క్రీన్ ప్లే రచయితగా మూడు నంది అవార్డులు గెలుచుకున్నారు. అది ఎవరికీ సాధ్యం కాదు. అలాగే ఆయనకు ఒక పెక్యులియర్ స్టైల్ ఉంది. టైమింగ్ ఉంది. విచిత్రమైన మాడ్యులేషన్ ఉంది. 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య, చాలెంజ్.. ఇలా ఆయన ఎన్నో సినిమాల్లో చేసిన పాత్రలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. అటువంటి గొప్ప రచయిత, నటుడు మన మధ్య లేకపోవడం మన దురదృష్టం. సినీ రంగానికి ఇది తీరని లోటుగా భావిస్తున్నాను. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

– రచయిత, నిర్మాత కోన వెంకట్






సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
13-12-2019

ఆభరణం



# అధరాలంకరణం

**పెదవులకు లిప్‌స్టిక్ వాడకం గురించి తెలుసు. చెవులకు, ముక్కుకు ఆభరణాల అలంకరించుకోవడం తెలుసు. కానీ, పెదవులకు కూడా ఆభరణం ధరించడం గురించి విన్నారా? కొత్తగా వచ్చిన ఈ ఆభరణం ఇప్పుడు యువతను ఆకట్టుకుంటోంది.**

జ్యువెల్రీ డిజైనర్లు ఫ్యాషన్ ప్రియుల అభిరుచులను దృష్టిలో పెట్టుకొని వినూత్న డిజైన్లను సృష్టిస్తున్నారు. వీటిలో భాగంగా వచ్చిందే లిప్ జ్యువెల్రీ.

- కొన్ని గిరిజన జాతుల్లో పెదవులను కూడా కుట్టి, ఆభరణాల అలంకరించుకోవడం ఉన్నది. దీనినే కొత్తగా ఇప్పుడు ఫ్యాషన్ జ్యువెల్రీలో సరికొత్తగా ప్రవేశపెట్టారు ఆభరణాల నిపుణులు.
- లిప్ జ్యువెల్రీని కింది పెదవికి తగిలించుకునేలా హుక్ ఉంటుంది. కింది పెదవికి హుక్ ఉన్న ఆభరణాన్ని తొడిగి, కొద్దిగా ప్రెస్ చేసి సెట్ చేయాలి.
- మేకప్ పూర్తయిన తర్వాతనే ఈ ఆభరణాన్ని ఉపయోగించాలి.
- పెదవులను కుట్టి, స్టడ్స్‌తో అలంకరించే ఆభరణాలు కూడా ఉన్నాయి.
- ఆన్‌లైన్ మార్కెట్‌లో అధరాలకు అందాన్ని పెంచే ఆభరణాలను కొనుగోలు చేయవచ్చు. డిజైన్, మెటల్‌ను బట్టి ధరలు ఉన్నాయి.





ఫ్యాషన్

# కుచ్చుల బొమ్మలు



**పుట్టినరోజు, ఫ్యామిలీ గెట్ టు గెదర్స్, క్రిస్టమస్, న్యూ ఇయర్ ఇలా ఈ నెలలో వచ్చే వేడుకల జాబితా ఎక్కువే. ఈ సందర్భాలలో పిల్లల దుస్తుల విషయంలో అమ్మలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుంటారు. వేడుక ఏదైనా నలుగురిలో తమ చిన్నారులు మరింతగా వెలిగిపోవాలని కోరుకుంటారు. పిల్లలకు సౌకర్యంతో పాటు గ్రాండ్‌గా ఉండే కుచ్చుల గౌన్లు ఇవి..**

## సౌకర్యం ముఖ్యం

పిల్లలకు ఏ దుస్తులు సౌకర్యంగా ఉంటే ఆ డ్రెస్‌లో ఎక్కువ సేపు ఉంటారు. సాధారణంగా కాటన్, ఖాదీ బట్టలైతే వారి లేత చర్మానికి గుచ్చుకోవు. వీటిని బేస్ చేసుకుంటూ పిల్లల కోసం నెటెడ్ మెటీరియల్‌తో డిజైన్ చేసిన ఈవెనింగ్ పార్టీవేర్ ఇది.

* * *

**కుచ్చుల వేడుక...** వేడుకలో పిల్లలు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా కనిపించాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. పిల్లలు కూడా నలుగురిలో తిరుగుతూ సందడి చేస్తుంటారు. తమ చుట్టూ తాము రౌండ్‌గా తిరగడం అంటే పిల్లలకు చాలా ఇష్టం. అలాంటప్పుడు తాము వేసుకున్న గౌన్ ఎంత ఫ్లెయిర్ వస్తే అంత బాగుంటామనుకుంటారు

* * *

**పేస్టల్ కలర్స్...** ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నవి పేస్టల్ కలర్స్. పిల్లలు కూడా ఆ రంగులను ప్లెజంట్‌గా భావిస్తారు. జర్దోసీ వర్క్స్ కొంతవరకు కావాలనుకుంటే చిన్న చిన్న పువ్వులు, కట్ బీడ్స్ వాడుకోవచ్చు. ఇవి పిల్లల చర్మానికి గుచ్చుకోవు. చూడ్డానికీ బాగుంటుంది.

**నిహారిక**
ఫ్యాషన్ డిజైనర్,
శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్
instagram:
**Niharika Design Studio**

**పిల్లలకు ఎంత తక్కువ యాక్ససరీస్ వాడితే అంత సౌకర్యంగా ఉంటారు.**

* * *

**జుట్టుకు చిన్న బ్యాండ్, మెడలో పల్చగా ఉండే చిన్న చైన్, చేతికి సన్నని బ్రేస్‌లెట్ వేస్తే చాలు.**

* * *

**పిల్లల చర్మానికి హాని కలిగించనవి ఏవైనా బాగుంటాయి.**

* * *

**చెప్పలు హీల్స్ కాకుండా ఫ్లాట్‌గా ఉండే షూస్‌ను ఎంచుకుంటే సౌకర్యంగా ఉంటాయి.**

* * *

**ఇలాంటి డ్రెస్సుల మీదకు ఏ ఇతర యాక్ససరీస్ కూడా అంతగా ఎలివేట్ అవ్వవు. అందుకని ఏ ఇతర హంగులూ అక్కర్లేదు.**

నిర్వహణ
**నిర్మలారెడ్డి**

అమెరికా

# అల్లిక బ్యాగులు





**కుట్లు, అల్లికలు మనవారికి కొత్తేమీ కాదు. ఇప్పుడంటే లెదర్, కాటన్ బ్యాగులను విరివిగా వాడుతున్నారు. కానీ, రాబోయే ఏడాదికి గాను న్యూయార్క్ వాసులు రకరకాల అల్లిక బ్యాగులు వాడనున్నారు. ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన స్ప్రింగ్ ఫ్యాషన్ వీక్ 2020లో క్రొచెట్ బ్యాగులను ప్రదర్శించారు. అక్కడ వీటి సృష్టికర్త డిజైనర్ ఉల్లా జాన్సన్. ఆర్కియాలజిస్ట్ అయిన ఉల్లా జాన్సన్ బ్రాండ్ వస్తువులకు ఆమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, ఆసియా దేశాలలో విశేషమైన గుర్తింపు ఉంది.**









ఫ్యామిలీ డాక్టర్

హోమియో కౌన్సెలింగ్స్

## పీసీవోడీకి చికిత్స ఉందా?

**నా భార్య వయసు 36 ఏళ్లు. ఇటీవల ఆమె శరీరంపై వెంట్రుకలు ఎక్కువగా పెరుగుతుంటే డాక్టర్‌కు చూపించాం. ఆమె పీసీఓడీతో బాధపడుతున్నట్లు చెప్పారు. దీనికి హోమియోలో చికిత్స ఉందా? వివరించండి.**

**- సుమన్ ప్రసాద్, మహబూబ్‌నగర్**

రుతుక్రమం సవ్యంగా ఉన్న మహిళల్లో నెలసరి అయిన 11–18 రోజుల మధ్యకాలంలో వాళ్లలోని రెండు అండాశయల్లోని ఏదో ఒకదాని నుంచి అండం విడుదల అవుతుంది. అలా జరగకుండా అపరిపక్వమైన అండాలు వెలువడి అవి నీటిబుడగల్లా అండాశయపు గోడలపై ఉండిపోయే కండిషన్‌ను పీసీవోడీ (పాలిసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్) అంటారు. ఇవి రెండువైపులా ఉంటే 'బైలేటరల్ పీసీఓడీ' అంటారు. ఈ సమస్యకు కచ్చితమైన కారణాలు తెలియనప్పటికీ జన్యుపరమైన అంశాలు ఒక కారణంగా భావిస్తున్నారు. అంతేగాక ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ హార్మోన్ల అసమతౌల్యత వల్ల ఈ సమస్య తలెత్తవచ్చు. సరైన జీవనశైలి పాటించనివారిలోనూ ఇది ఎక్కువ.

**లక్షణాలు:** నెలసరి సరిగా రాకపోవడం, వచ్చినా అండాశయం నుంచి అండం విడుదల కాకపోవడం, రుతుస్రావం సమయంలో ఎక్కువ రక్తంపోవడం, రెండు రుతుక్రమాల మధ్యకాలంలో రక్తస్రావం కావడం, నెలసరి వచ్చే సమయంలో కడుపులో బాగా నొప్పిరావడం, నెలసరి రాకపోవడం, బరువు పెరగడం, తలవెంట్రుకలు రాలిపోతుండటం, ముఖం, వీపు, శరీరంపై మొటిమలు రావడం, ముఖం, ఛాతీపైన మగవారిలా వెంట్రుకలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

దీనివల్ల సంతానకలగకపోవడం, స్థూలకాయం, డయాబెటిస్, కొందరిలో చాలా అరుదుగా హృద్రోగ సమస్యలు రావచ్చు. రోగిని భౌతిక లక్షణాలతో పాటు అల్ట్రాసౌండ్ స్కాన్, హెచ్‌సీజీ, టెస్టోస్టెరాన్, ఆండ్రోజెన్, ప్రోలాక్టిన్ మొదలైన హార్మోన్ల పరీక్షలు, రక్తంలో చక్కెరపాళ్లు, కొలెస్ట్రాల్ శాతం వంటి పరీక్షలతో దీన్ని నిర్ధారణ చేయవచ్చు. హోమియో విధానంలో సరైన హార్మోన్ వ్యవస్థను పరిపుష్టం చేయడం ద్వారా దుష్ఫలితాలేవీ లేకుండా శాశ్వతంగా పీసీఓడీని నయం చేయవచ్చు.





**డా॥ శ్రీకాంత్ మొర్లావర్,**
**సీఎండీ, హోమియోకేర్**
**ఇంటర్నేషనల్, హైదరాబాద్**

## తినగానే ఈ సమస్యలు ఎందుకిలా?

**నా వయసు 45 ఏళ్లు. భోజనం పూర్తికాగానే టాయిలెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. కొన్నిసార్లు మలబద్ధకం, విరేచనం ఒకదాని తర్వాత మరొకటి కనిపిస్తున్నాయి. మలంలో జిగురు కూడా కనిపిస్తుంది. కడుపులో మెలిపెట్టినట్లుగా నొప్పి వస్తోంది. తేన్పులు, కడుపు ఉబ్బరం వికారం, తలనొప్పి, ఆందోళన వంటివి ఉన్నాయి. దయచేసి నా సమస్య ఏమిటో వివరించి, హోమియోలో చికిత్స చెప్పండి.**

**– డి. గణేశ్, గుంటూరు**



మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీరు ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దీనికి వాస్తవమైన కారణాలు స్పష్టంగా తెలియదు. అయితే • జీర్ణవ్యవస్థలో తరచూ వచ్చే ఇన్ఫెక్షన్లు • దీర్ఘకాల జ్వరాలు • మానసిక ఆందోళన • కుంగుబాటు • ఎక్కువరోజులు యాంటీబయాటిక్స్ వాడటం • జన్యుపరమైన కారణలు • చిన్నపేగుల్లో బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో ఉండటం వంటివి ఐబీఎస్‌కు దోహదం చేస్తాయి. సాధారణంగా ఈ వ్యాధి పురుషుల్లో కంటే మహిళల్లో మూడువంతులు ఎక్కువ. మీరు చెప్పిన లక్షణాలతో పాటు కొందరిలో నొప్పి లేకుండా కూడా ఐబీఎస్ వస్తుండవచ్చు. వీళ్లలో చాలా వేగంగా మలవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంటుంది. నిద్రలేస్తూనే టాయెలెట్‌కు పరుగెత్తాల్సి వస్తుంది. ఐబీఎస్ క్యాన్సర్‌కు దారితీయదు. ప్రాణాంతకమూ కాదు. అయితే చాలా ఇబ్బంది పెడుతుంది.

దీని నిర్ధారణకు నిర్దిష్టమైన పరీక్ష అంటూ ఏదీ లేదు. కాకపోతే రోగి లక్షణాలను బట్టి, రోగి కడుపులో ఏవైనా పరాన్నజీవులు ఉన్నాయా లేదా, చిన్నపేగుల్లో బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ ఏవైనా ఉన్నాయా అనే కొన్ని అంశాల ఆధారంగా దీన్ని చాలా నిశిత పరిశీలనతో వ్యాధి నిర్ధారణ చేస్తారు. దాంతోపాటు మలపరీక్ష, రక్తపరీక్ష, అల్ట్రాసౌండ్ స్కానింగ్ అబ్డామిన్, ఎండోస్కోపీ, హైడ్రోజెన్ బ్రీత్ టెస్ట్ వంటి పరీక్షలు ఈ వ్యాధి నిర్ధారణకు తోడ్పడతాయి.

**వ్యాధి నివారణ/నియంత్రణకు సూచనలు :** • పీచుపదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి • ఒత్తిడిని నివారించుకోవాలి • పొగతాగడం, మద్యపానం అలవాట్లను పూర్తిగా మానుకోవాలి • రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవాలి.

**హోమియోలో చికిత్స:** ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్‌కు హోమియోలో అత్యంత శక్తిమంతమైన మందులు అందుబాటులో ఉన్నాయి. కారణం ఏదైనప్పటికీ అంటే ఉదాహరణకు జీర్ణవ్యవస్థలో ఉండే ఇన్ఫెక్షన్లూ, దీర్ఘకాలంగా మందులు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావం వల్ల జీర్ణవ్యవస్థలో వచ్చే మార్పులు, ఒత్తిడి, ఆందోళన వల్ల ఐబీఎస్ వస్తే దాన్ని హోమియో ప్రక్రియలో కాన్‌స్టిట్యూషనల్ సిమిలియమ్ ద్వారా చికిత్స చేసి, సమస్యను చాలావరకు శాశ్వతంగా పరిష్కరించవచ్చు.



**డాక్టర్ టి.కిరణ్‌కుమార్,**
**డైరెక్టర్,**
**పాజిటివ్ హోమియోపతి,**
**విజయవాడ, వైజాగ్**

# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

శుక్రవారం
13-12-2019


బ్యాంకింగ్ స్పెషల్

# కొలువుల ఖాతా.. తెరవాలంటే...!

**ఆకర్షణీయమైన వేతనాలు.. సుస్థిరమైన కెరీర్.. ఎదిగేందుకు అపార అవకాశాలు.. తక్కువ వడ్డీకే సులువైన గృహ, వాహన రుణ సదుపాయం.. ఇలా ఎన్నో సౌకర్యాలు బ్యాంకింగ్ రంగంలో పనిచేసే ఉద్యోగుల సొంతం! ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఏటా నియామకాలు చేపడుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్, పీవో (ప్రొబేషనరీ ఆఫీసర్లు) వంటివి క్రేజీ కొలువులు!! వీటితోపాటు మార్కెటింగ్, టెక్నికల్, బిజినెస్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్, హెచ్ఆర్, లా ఆఫీసర్లు, చార్టర్డ్ అకౌంటెంట్స్, అగ్రికల్చరల్ ఆఫీసర్లు, ఐటీ ఆఫీసర్లు వంటి స్పెషలిస్ట్ ఆఫీసర్(ఎస్‌వో) ఉద్యోగాలను సైతం భర్తీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. బ్యాంకింగ్ రంగంలో కొలువులు.. ఎంపిక విధానాలు.. పరీక్షల తీరుతెన్నులు.. సిలబస్ విశ్లేషణ.. ప్రిపరేషన్ గురించి తెలుసుకుందాం..!**

బ్యాంకింగ్ రంగంలో క్లర్క్, పీవో, ఎస్‌వో ఉద్యోగాల భర్తీ

ప్రిలిమ్స్, మెయిన్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక

పక్కా ప్రిపరేషన్‌తో కొలువు దక్కించుకోవచ్చంటున్న నిపుణులు



## బ్యాంకుల నియామకాలు.. బహువిధాలు

- ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, విదేశీ బ్యాంకులన్నింటిలో కలిపి మొత్తం 13.5 లక్షల మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నట్లు అంచనా. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల భర్తీని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సె లక్షన్(ఐబీపీఎస్)చేపడుతోంది. ఎస్‌బీఐ మాత్రం క్లర్క్, పీవో, స్పెషలిస్ట్ ఆఫీసర్ వంటి కొలువులకు సొంతంగానే నియామకాలు జరుపుతోంది.
- ప్రైవేటు బ్యాంకులు.. కొన్ని పోస్టులకు రాత పరీక్షలు, మరికొన్ని పోస్టులకు రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూలు కూడా నిర్వహిస్తున్నాయి.
- పెద్ద బ్యాంకులు మిడిల్ లెవల్ మేనేజ్‌మెంట్ పోస్టులను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లు వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో ప్లేస్‌మెంట్స్ ద్వారా భర్తీ చేస్తున్నాయి.
- ఐసీఐసీఐ, యాక్సిస్, కోటక్ మహీంద్ర లాంటి బ్యాంకులు డీమ్డ్ యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకొని.. పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి.. ఆ తర్వాతే నియామకం ఖరారు చేస్తున్నాయి.
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, ఐడీబీఐ వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు సైతం పీజీ డిప్లొమా కోర్సుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి.



## ఎస్‌బీఐ ఎంపిక ప్రక్రియ

దేశంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ. క్లర్క్, పీవో పోస్టుల భర్తీకి ఏటా నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఏదైనా డిగ్రీ అర్హతతో వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. పీవో ఎంపిక ప్రక్రియలో భాగంగా.. ప్రిలిమ్స్, మెయిన్, గ్రూప్ ఎక్సర్‌సైజ్/ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపిన అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి.. మెయిన్ రాసేందుకు అనుమతిస్తారు. మెయిన్‌లో కటాఫ్ సాధించిన వారిని గ్రూప్ ఎక్సర్‌సైజ్/ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు.

### ప్రిలిమ్స్

ఎస్‌బీఐ పీవో ఎంపిక ప్రక్రియలో తొలి దశ అయిన ప్రిలిమ్స్ పరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో మొత్తం మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రశ్నలు30 ప్రశ్నలు-30మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 35 ప్రశ్నలు-35మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ఒక్కో సెక్షన్‌కు 20 నిమిషాల సమయం కేటాయించారు. ప్రిలిమ్స్‌లో సాధించిన మార్కుల ఆధారంగా కేటగిరీల వారీగా మెరిట్ లిస్ట్ తయారు చేసి.. అలా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేస్తారు.

### ఎస్‌బీఐ మెయిన్ పరీక్ష విధానం

| సెక్షన్ | ప్రశ్నలు | మార్కులు | సమయం (నిమిషాలు) |
|---|---|---|---|
| రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ | 45 | 60 | 60 |
| డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ | 35 | 60 | 45 |
| జనరల్/ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ | 40 | 40 | 35 |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 35 | 40 | 40 |
| **మొత్తం** | 155 | 200 | 3 గంటలు |

- ఎస్‌బీఐ మెయిన్ ఎగ్జామినేషన్‌లో 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ పరీక్షతోపాటు 50 మార్కులకు 30 నిమిషాల్లో రాసే విధంగా డిస్క్రిప్టివ్ టెస్ట్(లెటర్ రైటింగ్, జనరల్ ఎస్సే) ఉంటుంది. ఇందులో నిర్ణీత మార్కులు సాధించిన వారికి తర్వాతి దశ గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూలు ఉంటాయి. మెయిన్ పరీక్ష, డిస్క్రిప్టివ్ టెస్ట్, గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుంది. మెయిన్ పరీక్ష, డిస్క్రిప్టివ్ టెస్ట్ రెండింటిలో 250 మార్కులకు సాధించిన స్కోరును 75కు, గ్రూప్ ఎక్సర్‌సైజెస్, ఇంటర్వ్యూల్లో 50 మార్కులకు వచ్చిన స్కోరును 25 మార్కులకు కుదించి.. ఫైనల్ కటాఫ్ స్కోరు నిర్దేశిస్తారు. మొత్తంగా 100 మార్కులకు సాధించిన స్కోరు ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

### ఎస్‌బీఐ క్లర్క్ పరీక్ష

- ఎస్‌బీఐ క్లర్క్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఏదైనా డిగ్రీ. ఈ పోస్టుల భర్తీకి రెండంచెల ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. తొలి దశలో ప్రిలిమ్స్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తుంది. ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపిన అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేస్తారు. ప్రిలిమ్స్ పరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో మొత్తం మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ఒక్కో సెక్షన్‌కు 20 నిమిషాల సమయం కేటాయించారు. నెగిటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రిలిమ్స్‌లో సాధించిన మార్కుల ఆధారంగా కేటగిరీల వారీగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులను మెయిన్‌కు ఎంపిక చేస్తారు.
- క్లర్క్ మెయిన్ పరీక్ష కూడా ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో 200 మార్కులకు జరుగుతుంది. ఇందులో మొత్తం నాలుగు సెక్షన్‌లు.. జనరల్ అవేర్‌నెస్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులకు; జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు-40 మార్కులకు; క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు; రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-60 మార్కులకు నిర్వహిస్తారు. మెయిన్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.



## ఐబీపీఎస్

ఐబీపీఎస్.. ఎస్‌బీఐ గ్రూప్ మినహా దేశంలోని జాతీయ బ్యాంకులన్నింటిలో క్లర్క్, ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో), స్పెషలిస్ట్ ఆఫీసర్(ఎస్‌వో) పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. ఐబీపీఎస్‌ను ప్రారంభించకముందు బ్యాంకులు సొంతంగా ఉద్యోగ నియామకాలు చేపట్టేవి. దీంతో అభ్యర్థులు ఒక్కో బ్యాంకుకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకుల రిక్రూట్‌మెంట్ అంతా ఐబీపీఎస్ ద్వారానే జరుగుతోంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్ఆర్‌బీ)ల్లోని ఉద్యోగాల భర్తీ సైతం ఐబీపీఎస్ చేపడుతోంది.

### ఐబీపీఎస్ భర్తీ చేసే కొలువులు

- క్లర్క్ » మేనేజ్‌మెంట్ ట్రైనీ/పీవో » ఆర్ఆర్‌బీ (అసిస్టెంట్స్, ఆఫీసర్లు: స్కేల్-1, 2, 3) » స్పెషలిస్ట్ ఆఫీసర్.

### ఐబీపీఎస్.. క్లర్క్, పీవో

ఐబీపీఎస్ చేపట్టే నియామకాల్లో అత్యంత క్రేజీ ఉద్యోగాలు.. క్లర్క్, పీవో. జాతీయ బ్యాంకుల్లో, ఆర్ఆర్‌బీల్లో క్లర్క్, పీవో కొలువుల భర్తీకి ఐబీపీఎస్ నోటిఫికేషన్లు ఇస్తుంది. రెండింటికీ పరీక్ష విధానం, ఎంపిక ప్రక్రియ దాదాపు ఒకేవిధంగా ఉంటుంది. ప్రిలిమ్స్, మెయిన్, ఇంటర్వ్యూ.. ఇలా మూడు దశల్లో జరుగుతుంది. పీవో, ఆపై స్థాయి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. క్లర్క్/అసిస్టెంట్ ఉద్యోగాలకు మెయిన్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగానే తుది ఎంపిక జరుగుతుంది. ఐబీపీఎస్ మాదిరిగానే ఎస్‌బీఐ కూడా పీవో, క్లర్క్ స్థాయి ఉద్యోగాలకు ప్రత్యేకంగా నోటిఫికేషన్లు విడుదల చేస్తుంది.




### ప్రిలిమ్స్ దాటితేనే

ఐబీపీఎస్, ఎస్‌బీఐ చేపట్టే పీవో, క్లర్క్ ఉద్యోగాల భర్తీలో మొదట ప్రిలిమ్స్ పరీక్ష ఉంటుంది. ఇందులో గట్టెక్కితేనే తదుపరి దశకు అర్హత సాధిస్తారు. ప్రిలిమ్స్ పరీక్ష వ్యవధి ఒక గంట. ప్రిలిమ్స్‌లో అభ్యర్థుల వడపోత ప్రక్రియ జరుగుతుంది.

### ప్రిలిమినరీ పరీక్ష విధానం

| విభాగం | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 30 | 30 |
| క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 35 | 35 |
| రీజనింగ్ ఎబిలిటీ | 35 | 35 |
| **మొత్తం** | 100 | 100 |

### ఆర్ఆర్‌బీ ప్రిలిమ్స్

ఆర్ఆర్‌బీ ప్రిలిమ్స్ పరీక్ష కాస్త భిన్నంగా ఉంటుంది. ఇందులో రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాలుంటాయి. ఒక్కో విభాగం నుంచి 40 ప్రశ్నల చొప్పున మొత్తం 80 ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇక్కడ సెక్షన్‌వైజ్ కటాఫ్ మార్కులుండవు.

### మెయిన్ స్వరూపం

- ఐబీపీఎస్ పీవో మెయిన్ పరీక్షలో సబ్జెక్టుల వారీగా ప్రత్యేక సమయం ఉంటుంది. అంటే.. అభ్యర్థి సదరు సెక్షన్‌కు కేటాయించిన సమయంలోనే ఆయా ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి.
- ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ మెయిన్ పరీక్షలో సెక్షన్‌వైజ్‌గా సమయం కేటాయించలేదు.
- ఎస్‌బీఐ మెయిన్ పరీక్ష స్వరూపం కూడా ఇలానే ఉంటుంది. కానీ సెక్షన్లు, వాటికి కేటాయించే సమయాలు, కాఠిన్యత స్థాయిలో తేడాలుంటాయి.

| సబ్జెక్టు | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| రీజనింగ్ | 50 | 50 | 40 ని. |
| క్వాంటిటేటివ్ ఎబిలిటీ | 50 | 50 | 40 ని. |
| జనరల్ అవేర్‌నెస్ | 40 | 40 | 20 ని. |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 40 | 40 | 30 ని. |
| కంప్యూటర్ లాంగ్వేజ్ | 20 | 20 | 10 ని. |
| **మొత్తం** | 200 | 200 | 140 ని. |

### తుది ఎంపిక

ఆఫీసర్ స్కేల్-1/పీవో పోస్టుల భర్తీలో మెయిన్ స్కోర్ ఆధారంగా కామన్ ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తారు. మెయిన్, కామన్ ఇంటర్వ్యూల్లో ప్రతిభను బట్టి తుది ఎంపిక ఉంటుంది. క్లర్క్/అసిస్టెంట్ పోస్టులకు మెయిన్ మార్కుల ఆధారంగానే ఎంపిక జరుగుతుంది. ఇంటర్వ్యూలు ఉండవు.

### ఐబీపీఎస్.. స్పెషలిస్ట్ ఆఫీసర్

- బ్యాంకులకు ఐటీ ఆఫీసర్లు, అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్లు, రాజభాష అధికారి, లా ఆఫీసర్లు, హెచ్ఆర్ ఆఫీసర్లు, మార్కెటింగ్ ఆఫీసర్లు వంటి ప్రత్యేక నిపుణుల అవసరం ఉంటుంది. ఆయా పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ ఎస్‌వో నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. సంబంధిత అర్హత ఉన్న వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఐటీ ఆఫీసర్ పోస్టులకు కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీ డిగ్రీ లేదా పోస్టు గ్రాడ్యుయేషన్ ఉండాలి.
- అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్1) పోస్టులకు అగ్రికల్చర్/హార్టికల్చర్/యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/ఫిషరీ సైన్స్/ఫుడ్ సైన్స్/ఫుడ్ టెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/సంబంధిత సబ్జెక్టుల్లో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- రాజభాష అధికారి పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే.. హిందీలో పీజీతోపాటు డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదవాలి. లేదా సంస్కృతంలో పీజీతోపాటు డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులు చదివుండాలి. లా ఆఫీసర్ పోస్టులకు పోటీ పడాలంటే.. 'లా డిగ్రీ' తోపాటు బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలి.
- హెచ్ఆర్ పోస్టులకు పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/హెచ్ఆర్/ హెచ్ఆర్‌డీ/సోషల్ వర్క్/ లేబర్ లా సబ్జెక్టుల్లో పీజీ లేదా డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులు.
- మార్కెటింగ్ ఆఫీసర్ల పోస్టులకు సదరు స్పెషలైజేషన్‌తో పీజీ స్థాయి కోర్సులు చేసిన వారు అర్హులు.

### ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ పరీక్షలో రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్ తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి. లా ఆఫీసర్లు, రాజభాష అధికారి పోస్టులకు మాత్రం క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు బదులు జనరల్ అవేర్‌నెస్ ఉంటుంది. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నల చొప్పున మొత్తం 200 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు. నెగిటివ్ మార్కులుంటాయి. సెక్షన్‌వైజ్ కటాఫ్ కూడా ఉంటుంది.

## బ్యాంకింగ్ డిప్లొమా కోర్సులు

బ్యాంకులు గత కొన్నేళ్లుగా నియామక ప్రక్రియలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి. ప్రైవేటు విద్యాసంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని.. బ్యాంకింగ్ కార్యకలాపాలపై పీజీ డిప్లొమా కోర్సులు అందిస్తున్నాయి. 9నెలల నుంచి ఏడాది వరకు శిక్షణ ఇచ్చి.. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులను మాత్రమే పీవోలుగా నియమించుకుంటున్నాయి. గతంలో కేవలం ప్రైవేటు బ్యాంకులు మాత్రమే ఈ తరహా నియామక ప్రక్రియను చేపట్టేవి. ప్రస్తుతం పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు సైతం పీజీ డిప్లొమా కోర్సుల ద్వారా శిక్షణకు మొగ్గ చూపుతున్నాయి.

### నియామక ప్రక్రియ

- ఆన్‌లైన్ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్,ఇంటర్వ్యూలు నిర్వహించి.. పీజీ డిప్లొమా కోర్సుకు ఎంపిక చేస్తున్నాయి. కోర్సుకు అయ్యే ఫీజు చెల్లించాల్సిన బాధ్యత అభ్యర్థులదే. బ్యాంకులు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయి. ఈ మొత్తాన్ని ఉద్యోగంలో చేరాక చెల్లించొచ్చు.
- ప్రభుత్వ, ప్రైవేటు, ఫారెన్ బ్యాంకులు ఐఐఎంలు, ఐఐటీలు, ఇతర ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు నిర్వహించి స్పెషలైజ్డ్ ప్రొఫెషనల్స్‌ను నియమించుకుంటున్నాయి.




- బ్యాంకుల్లో మిడిల్ లెవల్ మేనేజ్‌మెంట్, స్పెషలైజ్డ్ కేటగిరీల్లో ఉద్యోగాలు కోరుకునే వారికి పలు ఇన్‌స్టిట్యూట్‌లు పీజీ స్థాయిలోనే కోర్సులు అందిస్తున్నాయి. ఆయా కోర్సులు, స్పెషలైజేషన్స్ ఆధారంగా కోర్సు పూర్తికాగానే కొలువులు ఖాయం చేసుకోవచ్చు.
- ఆర్‌బీఐ, బ్యాంకులు కలిసి ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్-పుణె, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ వంటి వాటికి బ్యాంకింగ్ స్పెషలైజ్డ్ కోర్సులను అందించడంలో పేరుంది.

## ప్రిపరేషన్.. పటిష్టంగా..

దాదాపు అన్ని బ్యాంకింగ్ పరీక్షలకు ఒకే సిలబస్ ఉంటుంది. ఇతర పరీక్షలతో పోలిస్తే.. బ్యాంకింగ్ పరీక్షల్లో వేగానికి, కచ్చితత్వానికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి స్పీడ్‌గా గణించే నేర్పును అలవర్చుకోవాలి.

### ఉమ్మడి సబ్జెక్టులు

దాదాపు అన్ని బ్యాంకింగ్ పరీక్షల్లో ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(న్యూమరికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్), రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ (బ్యాంకింగ్ స్పెషల్ రిఫరెన్స్‌తో), కంప్యూటర్ నాలెడ్జ్ కామన్‌గా కనిపిస్తాయి.

### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

- ఈ విభాగంలో ప్రశ్నలన్నీ ప్రధానంగా హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్‌పై ఉంటాయి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజ్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్-కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్చర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్ షిప్ విభాగాలు కీలకం. సింప్లిఫికేషన్స్‌కు బోడ్‌మస్ రూల్స్‌ను అనుసరించి ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి. ఫలితంగా సింప్లిఫికేషన్స్ సులువు అవుతాయి.

### డేటా అనాలసిస్

డేటా ఇంటర్‌ప్రెటేషన్, టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాల్లోని సమాచారాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. ఈ విభాగం ఎక్కువగా పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోల మిళితంగా ఉంటుంది. కాబట్టి అర్థమెటిక్ అంశాలు కీలకం.

### రీజనింగ్

అభ్యర్థుల అనలిటికల్ సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఉద్దేశించిన విభాగం.. రీజనింగ్. అభ్యర్థుల విజయాన్ని తారుమారు చేసేది ఈ విభాగమే. ఇటీవల పరీక్షల్లో హై లెవల్ రీజనింగ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. అజంప్షన్స్, ఆర్గ్యుమెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, కోడింగ్, డీ-కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి. మరీ ముఖ్యంగా అనలిటికల్ రీజనింగ్, సిలాయిజమ్స్, ఇన్ ఈక్వాలిటీస్, ఇన్‌పుట్ అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీల నుంచే ఎక్కువ ప్రశ్నలు ఎదురవుతాయి. పీవో పరీక్షల్లో కాఠిన్యత స్థాయి ఎక్కువగా ఉంటుంది.

### ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇందులో వొకాబులరీ, రీడింగ్ కాంప్రెహెన్షన్, గ్రామర్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. సినానిమ్స్,ఆంటోనమ్స్, సెంటెన్స్ కరెక్షన్,వొక్యాబులరీ, సెంటెన్స్ రీఅరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇంగ్లిష్ విభాగంలో కేవలం గ్రామర్‌కే పరిమితం కాకుండా..జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో మంచి మార్కుల కోసం వొక్యాబులరీ ఉపయోగపడుతుంది. అలాగే గ్రామర్‌పై పట్టు ఉంటేనే సెంటెన్స్ కరెక్షన్ చేయగలం.



### జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో బ్యాంకింగ్ రంగంలోని తాజా పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కేవైసీ, అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ గవర్నర్, డిప్యూటీ గవర్నర్, ఆర్థిక సంబంధ సంస్థల అధిపతులు, సెబీ చైర్మన్, ఐఆర్‌డీఏ అధిపతి మొదలైనవి తెలుసుకోవాలి. నీతి ఆయోగ్, దాని చైర్మన్, డిప్యూటీ చైర్మన్, సభ్యులు తదితర వివరాలు తెలుసుకోవాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించిన చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన అవసరం. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ పరంగా ఆర్థిక సంబంధ వ్యవహారాల(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.

### కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి ప్రధానంగా కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, నెట్‌వర్క్, లేయర్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షార్ట్ కట్స్, ఎంఎస్ ఆఫీస్ ఫంక్షనింగ్, షార్ట్‌కట్స్,కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాల(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్..) గురించి తెలుసుకోవాలి.

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
13-12-2019



## ‘డబ్ల్యూటీఏ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’గా యాష్లే బార్టీ

ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌తో పాటు టెన్నిస్ ముగింపు సీజన్ టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్ టైటిల్‌ను గెలిచిన ఆస్ట్రేలియా భామ యాష్లే బార్టీ మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ‘ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’ పురస్కారం గెల్చుకుంది. ఈ ఏడాది గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన నయోమి ఒసాకా (జపాన్–ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత), సిమోనా హలెప్ (రొమేనియా–వింబుల్డన్ విజేత), బియాంక ఆండ్రెస్కూ (కెనడా–యూఎస్ ఓపెన్ విజేత) ఈ అవార్డు కోసం పోటీపడ్డా... 82 శాతం ఓట్లు పొందిన బార్టీనే అవార్డు వరించింది. ఇవోని గూలాగాంగ్ (1976లో) తర్వాత నంబర్‌వన్ ర్యాంకును సొంతం చేసుకున్న తొలి ఆసీస్ క్రీడాకారిణిగా బార్టీ నిలువడం మరో విశేషం. ఆమె కోచ్ క్రెయిగ్ టైజెర్ ‘డబ్ల్యూటీఏ కోచ్ ఆఫ్ ద ఇయర్’గా నిలిచాడు.

# రారండోయ్... సత్తా చూపుదాం

## ‘సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్’కు ఎంట్రీల ఆహ్వానం

SAKSHI PREMIER LEAGUE

క్రికెట్టే మీ జీవితమా...
అయితే ఇక్కడ మీ జీవితమే
మారిపోవచ్చు...
ఆశల ఆకాశం... కలల ప్రపంచం...
మీ నిలువెత్తు ప్రయత్నానికి
మా అతి పెద్ద వేదిక...
కేవలం మీరు చేయాల్సిందల్లా...
ముందుగా ఎంట్రీలు పంపించడం..
ఆ తర్వాత బరిలోకి దిగడమే.

*తెలంగాణ రాష్ట్రంలోని ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జనవరి తొలి వారం నుంచి సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్ (ఎస్‌సీపీఎల్) జరగనుంది.*

SAKSHI MEDIA GROUP
www.sakshi.com



### ఏ ఏ విభాగాల్లో...

- సాక్షి ప్రీమియర్ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–18 జూనియర్ స్థాయిలో (1–12–2001 తర్వాత జన్మించి ఉండాలి)... అండర్–24 సీనియర్ స్థాయిలో (1–12–1995 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.
- జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 11,12) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది.
- సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

### ఎన్ని జట్లకు అవకాశం...

- ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా మూడు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. మూడు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు.

### జట్ల నమోదు ఇలా....

- సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనాలనుకునే జట్లు దరఖాస్తుతోపాటు మూడు డాక్యుమెంట్‌లను జత చేయాలి.
- **డాక్యుమెంట్–1:** కళాశాల లెటర్ హెడ్‌పై జట్టులోని 15 మంది ఆటగాళ్ల పేర్లు, ఫోన్ నంబర్లు రాసి ప్రిన్సిపాల్ సంతకం, రబ్బరు స్టాంపు వేసి పంపించాలి.
- **డాక్యుమెంట్–2:** 15 మంది ఆటగాళ్ల ఫోటోలు, వారి వివరాలు, పదో తరగతి పరీక్ష హాల్ టికెట్ నంబర్ రాసి, ఫోటోలపై ప్రిన్సిపాల్ సంతకం చేయాలి. చివర్లో ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ సంతకాలు, రబ్బరు స్టాంపుతో పంపించాలి.
- **డాక్యుమెంట్–3:** (మ్యాచ్ జరిగే రోజు ఇవ్వాలి): ఆటగాళ్ల భద్రతకు సంబంధించిన డిక్లరేషన్ దరఖాస్తు చివర్లో ప్రిన్సిపాల్ సంతకం, రబ్బరు స్టాంపుతో పంపించాలి.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం... www.arenaone.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. ధ్రువ పత్రాలు లేకుండా వచ్చిన ఎంట్రీలను పరిగణించరు.

### ముఖ్యమైన విషయం...

- మ్యాచ్ సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు సంబంధించి పదో తరగతి మార్కుల మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి.
- మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్‌గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.
- గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం

### ఎంట్రీ ఫీజు...

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ. 1200 ఎంట్రీ ఫీజుగా చెల్లించాలి. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. www.arenaone.in వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను డిసెంబర్ 22వ తేదీలోగా పంపించాలి.

**ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు**

**99120 35299, 96665 72244**
(హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్)

**95055 14424, 96660 13544**
(వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఆదిలాబాద్)

**తెలంగాణలోని ఉమ్మడి జిల్లాలను మూడు జోన్‌లుగా విభజించారు.**

జోన్–1లో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉన్నాయి.
(ఈ మూడు జిల్లాల మ్యాచ్‌లు మాత్రం హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తారు)
జోన్–2లో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ ఉన్నాయి.
జోన్–3లో నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ ఉన్నాయి.
ఒక్కో జోన్ నుంచి విజేత జట్టు రాష్ట్ర స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తుంది.

**టోర్నీ ఫార్మాట్**

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. తెలంగాణలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

# బెర్త్‌లు 73 బరిలో 332

- ఐపీఎల్ వేలానికి తుది జాబితా ఖరారు
- కోల్‌కతాలో 19న వేలం

**ముంబై:** ఐపీఎల్–2020 వేటకు ముందు వేలం పాటకు రంగం సిద్ధమైంది. ఆల్‌రౌండర్లపై కోట్లు కురిపించేందుకు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. మ్యాక్స్‌వెల్ (ఆస్ట్రేలియా), క్రిస్ మోరిస్ (దక్షిణాఫ్రికా)లతో పాటు పేసర్ కమిన్స్ (ఆస్ట్రేలియా) ఈ వేలంలో హాట్ కేక్‌లు కావొచ్చని ఐపీఎల్ వర్గాలు భావిస్తున్నాయి. కోల్‌కతాలో ఈ నెల 19న అందుబాటులో ఉన్న 73 బెర్త్‌ల కోసం జరిగే ఆటగాళ్ల వేలంలో బ్యాట్స్‌మెన్ ఫించ్, క్రిస్ లిన్, జాసన్ రాయ్, మోర్గాన్, రాబిన్ ఉతప్పలను తొలి రౌండ్‌లోనే చేజిక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు ఉత్సాహం చూపించనున్నాయి. వేలానికి అందుబాటులో ఉన్న ఆటగాళ్ల తుది జాబితాను ఐపీఎల్ పాలక మండలి బుధవారం ఫ్రాంచైజీలకు అందజేసింది. తొలిదశలో 971 మంది వున్న జాబితాను 332 మందికి కుదించింది. ఈ తుది జాబితాలో 19 మంది భారత ఆటగాళ్లతో పాటు ఫ్రాంచైజీల కోరిన 24 మంది క్రికెటర్లున్నారు. ఇందులో విండీస్ పేసర్ విలియమ్స్, ఆల్‌రౌండర్ క్రిస్టియన్, లెగ్ స్పిన్నర్ జంపా (ఆసీస్), బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ ముష్ఫికర్ ప్రముఖులు కాగా... సర్రే యువ బ్యాట్స్‌మన్ విల్ జాక్స్ కొత్త కుర్రాడు. ఇతను యూఏఈలో జరిగిన టి10 మ్యాచ్‌లో 25 బంతుల్లోనే ‘శత’క్కొట్టాడు. లాంక్‌షైర్‌తో జరిగిన మ్యాచ్ లో జాక్స్ 30 బంతుల్లో 11 సిక్సర్లు, 8 బౌండరీలతో 105 పరుగులు చేశాడు. ప్యారీ వేసిన ఓవర్లో అయితే 6బంతుల్లో 6 సిక్సర్లు బాదేశాడు. దీంతో ఈ మెరుపు వీరుడిపై ఫ్రాంచైజీలు పోటీపడే అవకాశముంది.

- వేలం వరుసలో ముందుగా బ్యాట్స్‌మెన్ వస్తారు. ఆ తర్వాతే ఆల్‌రౌండర్లు, కీపర్లు, పేసర్లు, స్పిన్నర్లు వస్తారు. తాజా జాబితాలో అత్యధిక ప్రాథమిక ధర కలిగిన ఏడుగురు ఆటగాళ్లున్నారు. మ్యాక్స్‌వెల్, కమిన్స్, హాజల్‌వుడ్, మార్ష్, స్టెయిన్, మాథ్యూస్, మోరిస్‌ల ప్రాథమిక ధర రూ. 2 కోట్లు కాగా... రాబిన్ ఉతప్ప రూ. కోటిన్నరతో తర్వాతి స్థానంలో ఉన్నాడు.



# సింధు నిష్క్రమణ

ఆగస్టులో విశ్వవిజేతగా అవతరించాక ఆడిన ఆరు టోర్నీల్లోనూ అంతగా ఆకట్టుకోలేకపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లోనూ తడబడింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఈ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వరుసగా రెండో పరాజయం చవిచూసి ఈ టోర్నీ లీగ్ దశలోనే నిష్క్రమించింది. నేడు జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో సింధు గెలిస్తే ఆమెకు సీజన్‌ను విజయంతో ముగించిన ఊరట లభిస్తుంది.

- వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో భారత స్టార్‌కు రెండో పరాజయం
- సెమీస్ అవకాశాలు ఆవిరి
- నేడు హి బింగ్‌జియావోతో చివరి మ్యాచ్

**గ్వాంగ్‌జౌ (చైనా):** గత రెండేళ్లలో బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో టైటిల్ పోరుకు చేరడంతో పాటు గతేడాది చాంపియన్‌గా కూడా నిలిచిన భారత స్టార్ పీవీ సింధు ఈసారి మాత్రం నిరాశ పరిచింది. సెమీఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో సింధు పోరాడి ఓడిపోయింది. ప్రపంచ రెండో ర్యాంకర్ చెన్ యుఫె (చైనా)తో గురువారం జరిగిన గ్రూప్ ‘ఎ’ రెండో లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్ సింధు 22–20, 16–21, 12–21తో ఓటమి చవిచూసింది. 72 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌లో 17–20తో వెనుకబడింది. అయితే ఒక్కసారిగా విజృంభించిన సింధు వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి తొలి గేమ్‌ను 22–20తో దక్కించుకుంది. అయితే ఈ ఏడాది ఆరు సింగిల్స్ టైటిల్స్ గెలిచిన చెన్ యుఫె రెండో గేమ్‌లో పుంజుకుంది. ఆరంభంలోనే 8–4తో ఆధిక్యంలోకి వెళ్లి అదే జోరులో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో చెన్ యుఫె తన దూకుడు కొనసాగించి సింధు ఆట కట్టించింది. మరో మ్యాచ్‌లో అకానె యామగుచి 25–27, 21–10, 21–13తో హి బింగ్‌జియావో (చైనా)పై గెలిచింది. గ్రూప్ ‘ఎ’లో రెండేసి మ్యాచ్‌లు నెగ్గినందుకు చెన్ యుఫె, యామగుచి సెమీఫైనల్‌కు చేరారు. నేడు జరిగే నామమాత్రపు మ్యాచ్‌ల్లో హి బింగ్‌జియావోతో సింధు; యామగుచితో చెన్ యుఫె తలపడతారు.

## శ్రీలంక 263/6

**రావల్పిండి:** పాకిస్తాన్, శ్రీలంక మొదటి టెస్టు రెండో రోజు ఆటకు వరణుడు అడ్డు తగిలాడు. దీంతో రెండో రోజు పూర్తి స్థాయి ఆట సాగలేదు. గురువారం కేవలం 18.2 ఓవర్ల ఆట జరగగా... ఆట నిలిచిపోయే సమయానికి శ్రీలంక 6 వికెట్లు కోల్పోయి 263 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 202/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక... డిక్‌వెలా (63 బంతుల్లో 33; 4 ఫోర్లు) వికెట్‌ను మాత్రమే కోల్పోయింది. ధనంజయ డి సిల్వా (131 బంతుల్లో 72 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధశతకం సాధించాడు. ధనంజయ, పెరీరా (6 బంతుల్లో 2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

## ప్రణవ్, మేఘన పరాజయం

**సురబయ (ఇండోనేసియా):** ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగు షట్లర్ల ఆట ముగిసింది. అండర్–17 బాలుర సింగిల్స్ రెండో రౌండ్‌లో గంధం ప్రణవ్ రావు 13–21, 21–16, 14–21తో హు యా చి (చైనీస్ తైపీ) చేతిలో... బాలికల సింగిల్స్ రెండో రౌండ్‌లో మారెడ్డి మేఘన రెడ్డి 16–21, 13–21తో సారనా యోషికవా (జపాన్) చేతిలో ఓడిపోయారు.

## లబ్‌షేన్ హ్యాట్రిక్ శతకం

**ఆసీస్ 248/4 ● న్యూజిలాండ్‌తో తొలి టెస్టు**



**పెర్త్:** ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న ఆస్ట్రేలియా ఆటగాడు లబ్‌షేన్ (202 బంతుల్లో 110 బ్యాటింగ్; 14 ఫోర్లు, సిక్స్) వరుసగా మూడో టెస్టులో శతకం బాదాడు. ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన రెండు టెస్టుల్లోనూ సెంచరీలు చేసిన లబ్‌షేన్... న్యూజిలాండ్‌తో గురువారం ఇక్కడ ఆరంభమైన డే నైట్ టెస్టు మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. లబ్‌షేన్ మెరిపించడంతో కివీస్‌తో టెస్టులో ఆసీస్ భారీ స్కోరుపై కన్నేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా ఓపెనర్ బర్న్స్ (9) విఫలమయ్యాడు. వార్నర్ (43; 4 ఫోర్లు), స్మిత్ (43; 4 ఫోర్లు) రాణించారు. సాంట్నర్ వేసిన 74వ ఓవర్ రెండో బంతిని లాంగాన్ మీదుగా సిక్సర్ కొట్టిన లబ్‌షేన్ తన కెరీర్‌లో మూడో శతకాన్ని నమోదు చేశాడు. ప్రస్తుతం లబ్‌షేన్‌తోపాటు హెడ్ (20 బ్యాటింగ్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.



**అలీందార్ రికార్డు:** ఈ మ్యాచ్ ద్వారా పాకిస్తాన్‌కు చెందిన అలీమ్ దార్ అత్యధిక టెస్టులకు అంపైరింగ్ చేసిన అంపైర్‌గా గుర్తింపు పొందారు. వెస్టిండీస్ అంపైర్ స్టీవ్ బక్నర్ (128 టెస్టులు) పేరిట ఉన్న ఉన్న రికార్డును అలీం దార్ (129 టెస్టులు) సవరించారు.

## చెన్నై చేరిన భారత క్రికెటర్లు



**చెన్నై:** ‘పొట్టి ఆట’ ముగియడంతో ఆటగాళ్లు వన్డే సిరీస్ ఆడేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా చెన్నైలో తొలి వన్డే జరుగనుండటంతో భారత్, వెస్టిండీస్ ఆటగాళ్లు గురువారం ఇక్కడికి చేరుకున్నారు. ఎం.ఎ.చిదంబరం స్టేడియంలో ఆదివారం ఇరుజట్ల మధ్య తొలి వన్డే జరుగుతుంది. చెన్నై రాక సందర్భంగా భారత కెప్టెన్ కోహ్లి... కుల్దీప్, జడేజాలతో కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేసి ‘టచ్‌డౌన్ చెన్నై’ అనే క్యాప్షన్ పెట్టాడు.

# భరత్, రికీ భుయ్ సెంచరీలు

## విదర్భతో ఆంధ్ర రంజీ మ్యాచ్ ‘డ్రా’


భరత్


రికీ భుయ్

**మూలపాడు (విజయవాడ):** వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (208 బంతుల్లో 102 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్సలు), రికీ భుయ్ (209 బంతుల్లో 100 నాటౌట్; 13 ఫోర్లు, సిక్స్) అజేయ శతకాలతో పోరాడారు. ఫలితంగా డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో జరిగిన గ్రూప్ ‘ఎ’ రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌ను ఆంధ్ర జట్టు ‘డ్రా’గా ముగించింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు విదర్భకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర జట్టు ఖాతాలో ఒక పాయింట్ చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 100/2తో చివరి రోజు గురువారం ఆట కొనసాగించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 103.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 314 పరుగులు చేసి 84 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఫలితం తేలదనే కారణంతో మరో 23.2 ఓవర్లు మిగిలి ఉండగానే ఇరు జట్ల సారథులు ‘డ్రా’కు అంగీకరించారు. 130 పరుగులు వెనుకబడి... కనీసం ‘డ్రా’తో గట్టెక్కాలంటే రోజు మొత్తం బ్యాటింగ్ చేయాల్సిన చోట ఆంధ్ర అద్భుతం చేసింది. డిఫెండింగ్ చాంపియన్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంది. ఓవర్‌నైట్ స్కోర్‌కు మరో 19 పరుగులు జోడించిన జ్ఞానేశ్వర్ (61) అర్ధ శతకం అనంతరం అవుట్ అయ్యాడు. ఈ సమయంలో రికీ భుయ్‌కి జత కలిసిన శ్రీకర్ భరత్ జట్టును ఆదుకున్నాడు. ఎంతో ఓపికను ప్రదర్శించిన ఈ జోడీ క్రీజులో పాతుకు పోయింది. ఇదే క్రమంలో ఇద్దరూ సెంచరీలు కూడా పూర్తి చేసుకున్నారు. వీరిద్దరూ అభేద్యమైన నాలుగో వికెట్‌కు 186 పరుగుల జోడించారు. చివరి రోజు 66.4 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన విదర్భ కేవలం ఒక్క వికెట్‌ను మాత్రమే సాధించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా డబుల్ సెంచరీ హీరో గణేశ్ సతీశ్ నిలిచాడు. ఆంధ్ర జట్టు తమ తదుపరి మ్యాచ్‌ను ఒంగోలులో ఈ నెల 17 నుంచి ఢిల్లీతో ఆడుతుంది.

**హైదరాబాద్ ఓటమి**

మరోవైపు హైదరాబాద్ జట్టు రంజీ సీజన్‌ను ఓటమితో ఆరంభించింది. హైదరాబాద్ వేదికగా గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్లతో తేడాతో ఓడింది. చివరి రోజు ఆటను 239/6తో మొదలు పెట్టిన ఆతిథ్య జట్టు 90.1 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ప్రత్యర్థికి 187 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. గుజరాత్ 36.4 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 187 పరుగులు చేసి గెలిచింది. ప్రియాంక్ పాంచల్ (90; 14 ఫోర్లు, 2 సిక్సలు) రాణించగా... భార్గవ్ మెరాయ్ (69 నాటౌట్; 6 ఫోర్లు, సిక్స్), ధ్రువ్ (23 నాటౌట్, , 2 ఫోర్లు) మిగతా పనిని పూర్తి చేశారు.

# ధోని బెస్ట్ ఫుట్‌బాలర్: రోహిత్

## ‘ల లీగా’ భారత అంబాసిడర్‌గా ‘హిట్‌మ్యాన్’



**ముంబై:** భారత ఓపెనర్ రోహిత్ శర్మ ‘ల లీగా’ భారత ప్రచారకర్తగా వ్యవహరిస్తాడు. క్రికెట్ క్రేజ్ ఉన్న భారత్‌లో ఫుట్‌బాల్‌ను అనుసరించేవాళ్ల సంఖ్య పెంచేందుకు ‘ల లీగా’ వర్గాలు స్టార్ బ్యాట్స్‌మన్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఈ సందర్భంగా ‘హిట్‌మ్యాన్’ మీడియాతో మాట్లాడుతూ... టీమిండియాలో ఫుట్‌బాల్ అభిమానులు చాలామందే ఉన్నారని హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌లైతే సాకర్ స్టార్లను బాగా అనుసరిస్తారని, వాళ్ల హెయిర్ స్టయిల్‌ను కూడా అలాగే మార్చుకున్నారని చెప్పాడు. టీమిండియాలో బెస్ట్ ఫుట్‌బాలర్ ఎవరనే ప్రశ్నకు సమాధానమిస్తూ ‘ధోని తమ జట్టులో నంబర్‌వన్ ఫుట్‌బాల్ ప్లేయర్’ అని చెప్పాడు. స్వీడన్ స్టార్ జ్లాటన్ ఇబ్రహిమోవిచ్ పోలికలతో ఉన్న ఇషాంత్ శర్మను ఉద్దేశించి ‘ఇప్పటికే మా జట్టులో జ్లాటన్ రూపంలో ఇషాంత్ ఉన్నాడుగా’ అని చమత్కరించాడు. భారత్‌లో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) పుణ్యమాని ఫుట్‌బాల్‌కు ఆదరణ అంతకంతకూ పెరుగుతోందని ఫ్రాన్స్ సాకర్ స్టార్ జినెదిన్ జిదాన్ అభిమాని అయిన రోహిత్ చెప్పాడు. ముఖ్యంగా గత ఐదేళ్లుగా ఫుట్‌బాల్‌పై ఆసక్తి గణనీయంగా పెరిగిందన్నాడు. సాకర్‌లో సత్తాగల కుర్రాళ్లకు ఐఎస్ఎల్ మంచి వేదికని అన్నాడు. స్పెయిన్‌లో ప్రముఖ ఫుట్‌బాల్ లీగ్ అయిన ‘ల లీగా’కు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉంది. ఈ లీగ్‌లో రియల్ మాడ్రిడ్ మళ్లీ విజేతగా నిలిచినా ఆశ్చర్యం లేదని రోహిత్ పేర్కొన్నాడు. రియల్ మాడ్రిడ్‌కు జిదాన్ కోచ్‌గా ఉన్నాడు.

హైదరాబాద్‌లోని శంషాబాద్ ఫోర్ట్ గ్రాండ్‌లో గురువారం జరిగిన భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు అజహరుద్దీన్ కుమారుడు అసద్... భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సోదరి ఆనమ్ వివాహ విందుకు హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, తదితరులు



సాక్షి **బిజినెస్**
శుక్రవారం
13-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 169 ▲ | 62 ▲ |
| 40,582 | 11,972 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,676 | ▲ | 22 |
| డోజోన్స్‌ | 27,980 | ▲ | 69 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,274 | ▲ | 57 |
| డాక్స్‌ | 13,222 | ▲ | 75 |
| షాంఘై | 2,916 | ▼ | 9 |
| నికాయ్‌ | 23,425 | ▲ | 33 |

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 69.90 | 71.54 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | ఎస్‌బీఐ | 91.92 | 95.15 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.34 | 80.27 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 63.93 | 66.36 |
| AUS$ | ఆస్ట్రేలియా డాలర్‌ | ఎస్‌బీఐ | 47.64 | 49.83 |
| SS | సింగపూర్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 51.27 | 53.05 |
| SAR | సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 18.10 | 19.70 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 18.82 | 19.83 |
| ¥ | చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 9.44 | 10.85 |

# ఇన్ఫీకి మరో తలనొప్పి

- అమెరికాలో క్లాస్‌ యాక్షన్‌ దావా
- ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించిందని ఆరోపణలు



**లాస్‌ ఏంజెలిస్‌:** సీఈవో, సీఎఫ్‌వోలపై ప్రజావేగుల ఫిర్యాదులతో సతమతమైన ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు తాజాగా మరో తలనొప్పి ఎదురైంది. షేర్‌హోల్డర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించి ఇన్ఫీపై క్లాస్‌ యాక్షన్‌ దావా వేయనున్నట్లు అమెరికాకు చెందిన న్యాయసేవల సంస్థ ది షాల్‌ లా ఫర్మ్‌ వెల్లడించింది. మార్కెట్‌ను తప్పుదోవ పట్టించేలా ఇన్ఫోసిస్‌ తప్పుడు ప్రకటనలు చేసిందని షాల్‌ ఆరోపించింది. స్వల్పకాలిక లాభాలను పెంచి చూపించడం కోసం ఆదాయాల లెక్కింపునకు తప్పుడు విధానాలు పాటించిందని ఫిర్యాదులో పేర్కొంది. పెద్ద డీల్స్‌పై ప్రామాణికంగా జరపాల్సిన సమీక్షలు జరగకుండా సీఈవో సలిల్‌ పరేఖ్‌ తప్పించారని షాల్‌ ఆరోపించింది. పైగా ఈ అకౌంటింగ్‌ లొసుగులు, వివాదాస్పద డీల్స్‌ వివరాలను ఆడిటర్లు, బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్లనివ్వకుండా ఫైనాన్స్‌ విభాగంపై యాజమాన్యం ఒత్తిడి తెచ్చిందని తెలిపింది. 'ఈ అంశాలకు సంబంధించి కంపెనీ అందర్నీ తప్పుదోవ పట్టించేలా అవాస్తవమైన, తప్పుడు ప్రకటనలు చేసింది. ఈ వ్యవహారం గురించి మార్కెట్లకు నిజాలు తెలిసిన తర్వాత.. ఇన్వెస్టర్లు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది' అని షాల్‌ ఒక ప్రకటనలో పేర్కొంది. 1,00,000 డాలర్ల పైగా నష్టపోయిన ఇన్వెస్టర్లు.. క్లాస్‌ యాక్షన్‌ దావాలో భాగం అయ్యేందుకు తమను కలవాలని సూచించింది. 2018 జూలై 7–2019 అక్టోబర్‌ 20 మధ్య కాలంలో ఇన్ఫీ షేర్లను కొనుగోలు చేసిన వారు.. డిసెంబర్‌ 23లోగా సంప్రదించాలని పేర్కొంది.

**వివరణ కోరిన బీఎస్‌ఈ ..**

అమెరికాలో క్లాస్‌ యాక్షన్‌ దావా వార్తలపై వివరణనివ్వాలంటూ ఇన్ఫీకి స్టాక్‌ ఎక్స్ఛేంజీ బీఎస్‌ఈ సూచించింది. అయితే, దీనిపై కంపెనీ స్పందించాల్సి ఉంది. ఇన్ఫీ సీఈవో సలిల్‌ పరేఖ్‌, సీఎఫ్‌వో నీలాంజన్‌ రాయ్‌లు వ్యాపారపరంగా అనైతిక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా స్టాక్‌ మార్కెట్‌ నియంత్రణ సంస్థ ఎస్‌ఈసీ విచారణ జరుపుతోంది.

తాజా వార్తల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఇన్ఫోసిస్‌ షేరు సుమారు 3 శాతం క్షీణించి, రూ. 702 వద్ద ముగిసింది.

# ఎయిరిండియాకు గుడ్‌బై!

- 100 శాతం ప్రభుత్వ వాటాలు విక్రయించేస్తాం..
- పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి హర్‌దీప్‌ సింగ్‌ పురి



**న్యూఢిల్లీ:** నష్టాలు, రుణాల భారంతో కుదేలవుతున్న ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియాలో 100 శాతం వాటాలు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి హర్‌దీప్‌ సింగ్‌ పురి స్పష్టం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎయిరిండియాలో డిజిన్వెస్ట్‌మెంట్‌ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని (ఏఐఎస్‌ఏఎం) పునరుద్ధరించినట్లు, వ్యూహాత్మకంగా వాటాల విక్రయ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసినట్లు గురువారం ఆయన లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ద్వారా తెలిపారు. దాదాపు రూ. 50,000 కోట్ల రుణభారం ఉన్న ఎయిరిండియా .. 2018–19లో రూ. 8,556 కోట్ల నష్టాలు నమోదు చేసింది. మరోవైపు, ఏవియేషన్‌ రంగంలో పరిస్థితులను మెరుగుపర్చే దిశగా.. జెట్‌ ఎయిర్‌వేస్‌ విమానాలను ఇతర ఎయిర్‌లైన్స్‌కు బదలాయించేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అలాగే, వచ్చే అయిదేళ్లలో వివిధ విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా (ఏఏఐ) రూ. 25,000 కోట్లు వెచ్చించనుందని వివరించారు. నిధుల సంక్షోభంతో జెట్‌ ఎయిర్‌వేస్‌ ఈ ఏడాది ఏప్రిల్‌లో మూతబడిన సంగతి తెలిసిందే.

**పారదర్శకంగా జరగాలి: ఐఏటీఏ**

దేశీ విమాయాన రంగంలో పోటీతత్వం మెరుగుపడే విధంగా.. ఎయిరిండియాలో డిజిన్వెస్ట్‌మెంట్‌ సక్రమంగా, పారదర్శక విధానంలో జరగాలని విమానయాన సంస్థల అంతర్జాతీయ సమాఖ్య ఐఏటీఏ డైరెక్టర్‌ జనరల్‌ అలెగ్జాండర్‌ డి జునియాక్‌ అభిప్రాయపడ్డారు. అలాగే ఎయిరిండియాకు ప్రస్తుతం ఇస్తున్న వనరులను .. మొత్తం ఏవియేషన్‌ రంగానికి అందించేందుకు ప్రభుత్వానికీ వెసులుబాటు లభించవచ్చని ఆయన పేర్కొన్నారు. భారత మార్కెట్లో గట్టి పోటీ, భారీ నిర్వహణ వ్యయాల కారణంగా విమానయాన సంస్థల నిర్వహణ ఆపరేటర్లకు చాలా కష్టంగా ఉంటోందని జునియాక్‌ అభిప్రాయపడ్డారు.

## 'ఉజ్జీవన్‌' మెరుపులు

### 57 శాతం లాభంతో లిస్టింగ్‌

**న్యూఢిల్లీ:** ఉజ్జీవన్‌ స్మాల్‌ ఫైనాన్స్‌బ్యాంక్‌ షేర్లు స్టాక్‌ మార్కెట్‌ లిస్టింగ్‌లో మెరుపులు మెరిపించాయి. బీఎస్‌ఈలో ఈ షేర్‌ ఇష్యూ ధర, రూ.37తో పోల్చితే 57 శాతం లాభంతో రూ. 58 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో రూ. 53 ధర వద్ద కనిష్ట స్థాయిని తాకినప్పటికీ, చివరకు రూ.56 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 1.61 కోట్లు, ఎన్‌ఎస్‌ఈలో 25.1 కోట్ల షేర్లు ట్రేడయ్యాయి. ఈ బ్యాంక్‌ మార్కెట్‌ క్యాప్‌ రూ.9,661 కోట్లకు చేరింది. ఈ స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంక్‌ ఐపీఓ(ఇనీషియల్‌ పబ్లిక్‌ ఆఫర్‌) 165 రెట్లు ఓవర్‌ సబ్‌స్క్రైబయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా సబ్‌స్క్రైబయిన ఐపీఓ ఇదే.

## ఐఓసీ చైర్మన్‌గా శ్రీకాంత్‌ మాధవ్‌ వైద్య..!



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ ఆయిల్‌ మార్కెటింగ్‌ సంస్థ ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ (ఐఓసీ)కు చైర్మన్‌గా శ్రీకాంత్‌ మాధవ్‌ వైద్య నియమితులైనట్లు సమాచారం. ప్రస్తుతం ఇదే కంపెనీలో డైరెక్టర్‌ (రిఫైనరీస్‌)గా ఉన్న ఆయన్ను ప్రభుత్వ రంగ సంస్థల సెలక్షన్‌ బోర్డు (పీఈఎస్‌బీ) చైర్మన్‌ పదవికి ఎంపిక చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత చైర్మన్‌ సంజీవ్‌ సింగ్‌ పదవీకాలం వచ్చే ఏడాది జూన్‌తో ముగియనుంది. దీంతో తదుపరి చైర్మన్‌ కోసం పీఈఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహించింది.

## అశోక్‌ లేలాండ్‌ సీఈఓగా విపిన్‌ సోంధి



**న్యూఢిల్లీ:** హిందుజా గ్రూప్‌నకు చెందిన ఫ్లాగ్‌షిప్‌ కంపెనీ అశోక్‌ లేలాండ్‌ నూతన చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌(సీఈఓ), మేనేజింగ్‌ డైరెక్టర్‌గా విపిన్‌ సోంధి నియమితులయ్యారు. ఈ పదవి నుంచి వినోద్‌ కే దాసరి వైదొలగిన విషయం తెలిసిందే కాగా, ఆయన స్థానంలో విపిన్‌ తాజాగా పదవీ బాధ్యతలు చేపట్టినట్లు కంపెనీ స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. ఈ ఏడాది డిసెంబర్‌ 12 (గురువారం) నుంచి 2024 డిసెంబర్‌ 11 వరకు నూతన సీఈఓ, ఎండీ పదవీకాలం కొనసాగుతుందని ప్రకటించింది. ఇంతకుముందు జేసీబీ ఇండియా, టాటా స్టీల్‌, శ్రీరామ్‌ హోండా సంస్థలకు విపిన్‌ సేవలందించారు.

# పరిశ్రమలు మళ్లీ మైనస్‌!

- తయారీ.. విద్యుత్‌.. మైనింగ్‌... అన్నీ తిరోగమనమే
- అక్టోబర్‌ పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాల నిరాశ
- మైనస్‌ 3.8 శాతం క్షీణత
- వరుసగా మూడు నెలల నుంచీ ఇదే ధోరణి




**న్యూఢిల్లీ:** పారిశ్రామిక ఉత్పత్తి అక్టోబర్‌లో తీవ్ర నిరాశను మిగిల్చింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో అసలు వృద్ధిలేకపోగా –3.8 శాతం క్షీణత నమోదయ్యింది. అంటే 2018 ఇదే నెల కన్నా తక్కువ పారిశ్రామిక ఉత్పత్తి నమోదయ్యిందన్నమాట. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో మెజారిటీ వాటా కలిగిన తయారీరంగంసహా విద్యుత్‌, మైనింగ్‌ వంటి కీలక రంగాలన్నింటిలో క్షీణరేటే నమోదయ్యింది. 2018 ఇదే నెల్లో పారిశ్రామిక ఉత్పత్తి 8.4 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది. గురువారం విడుదలైన గణాంకాల్లో కీలక విభాగాలను చూస్తే...

- **తయారీ రంగం:** సూచీలో దాదాపు 60 శాతం పైగా వెయిటేజ్‌ ఉన్న ఈ రంగంలో –2.1 శాతం క్షీణత నమోదయ్యింది. 2018 అక్టోబర్‌లో ఈ విభాగం 8.2 శాతం వృద్ధిరేటును నమోదుచేసుకుంది. ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్‌ నుంచి)లో అక్టోబర్‌ వరకూ చూస్తే, వృద్ధి రేటు 5.8% నుంచి 0.5%కి పడింది.
- **విద్యుత్‌:** ఈ విభాగం కూడా 10.8 శాతం వృద్ధి బాట నుంచి (2018 అక్టోబర్‌లో) –12.2 శాతం క్షీణతలోకి జారింది. ఆర్థిక సంవత్సరం ఏడు నెలల కాలంలో వృద్ధి 6.8 శాతం నుంచి 1.6 శాతానికి పడిపోయింది.
- **మైనింగ్‌:** ఈ విభాగంలో 7.3 శాతం వృద్ధి రేటు – 8 శాతం క్షీణత (2019 అక్టోబర్‌)లోకి పడింది. ఏప్రిల్‌ నుంచి అక్టోబర్‌ వరకూ తీసుకున్నా ఈ విభాగం 3.9 శాతం వృద్ధిబాట నుంచి –0.4 శాతం క్షీణతలోకి జారింది.
- **క్యాపిటల్‌ గూడ్స్‌:** ఇక భారీ యంత్రసామాగ్రి ఉత్పత్తికి, డిమాండ్‌కు ప్రతిబింబమైన ఈ రంగంలో భారీగా –21.9% క్షీణించింది. గత ఏడాది ఇదే నెల్లో ఈ రంగం భారీగా 16.9 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది.
- **రసాయనాలు:** 31.8% వృద్ధి నమోదయ్యింది.

**ఏడు నెలల్లో...**

ఏప్రిల్‌తో ప్రారంభం నుంచీ అక్టోబర్‌ వరకూ ఏడు నెలల కాలాన్ని చూస్తే, వృద్ధి రేటు 5.7 శాతం నుంచి (2018 ఇదే కాలంలో) 0.5 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది జూలైలో వృద్ధి రేటు 4.9 శాతంగా నమోదయ్యింది.

### అదుపు తప్పిన ధరలు

- నవంబర్‌లో రిటైల్‌ ద్రవ్యోల్బణం 5.54 శాతం
- మూడేళ్ల గరిష్ట స్థాయి ఇది...

**న్యూఢిల్లీ:** రిటైల్‌ ధరలు అదుపుతప్పాయి. ఈ సూచీ నవంబర్‌లో మూడేళ్ల గరిష్టం 5.54 శాతానికి చేరింది. అంటే 2018 నవంబర్‌తో పోల్చిచూస్తే, 2019 నవంబర్‌లో నిత్యావసరాల వినియోగ వస్తువుల బాస్కెట్‌ ధర మొత్తంగా 5.54 శాతం పెరిగిందన్నమాట. 2016 జూలై (6.07 శాతం) తరువాత ధరల పెరుగుదల తీవ్రత ఇంత స్థాయిలో నమోదు కావడం ఇదే తొలిసారి. 2018 నవంబర్‌లో ధరల పెరుగుదల రేటు 2.33 శాతం. అక్టోబర్‌లో కూడా రిటైల్‌ ద్రవ్యోల్బణం భారీగా 4.62 శాతం నమోదయ్యింది.



## సౌదీ ఆరామ్‌కో @ 2 ట్రిలియన్‌ డాలర్లు



**దుబాయ్‌:** సౌదీ చమురు దిగ్గజం, సౌదీ ఆరామ్‌కో కంపెనీ మార్కెట్‌ విలువ 2 ట్రిలియన్‌ డాలర్లు (2లక్షల కోట్ల డాలర్లు–రూ.142 లక్షల కోట్లు) దాటేసింది. ప్రపంచంలో అత్యధిక మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ ఉన్న కంపెనీ ఇదే. 1.19 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్‌ క్యాప్‌తో యాపిల్‌ కంపెనీ రెండో స్థానంలో ఉంది. స్టాక్‌ మార్కెట్లో లిస్టైన తొలి రోజు 1.8 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్‌ క్యాప్‌ సాధించిన సౌదీ ఆరామ్‌కో కంపెనీ రెండో రోజే 2 లక్షల కోట్ల మార్కెట్‌ క్యాప్‌ను దాటేయడం విశేషం. దీంతో ఈ కంపెనీ విలువ 2 లక్షల కోట్ల డాలర్లు ఉండాలన్న సౌదీ రాజు మహ్మద్‌ బిన్‌ సల్మాన్‌ స్వప్నం సాకారమైంది. ఈ కంపెనీ షేర్‌ గురువారం దుబాయ్‌ స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌లో ఆరంభంలోనే 38.60 రియాళ్ల(10.29 డాలర్లు)కు పెరిగింది. చివరకు 37.3 రియాళ్ల వద్ద ముగిసింది. ఇటీవలే ఐపీఓ(ఇనీషియల్‌ పబ్లిక్‌ ఆఫర్‌)లో భాగంగా 1.5 శాతం వాటా విక్రయించి 2,560 కోట్ల డాలర్లు సమీకరించింది. అతి పెద్ద ఐపీఓ రికార్డ్‌ను కూడా సాధించింది. కాగా ముడి చమురు ధరలు తక్కువగా ఉండటం, వాతావరణ కాలుష్యం పెరుగుతున్నందువల్ల పర్యావరణ హిత ఇంధనాలకు డిమాండ్‌ పెరుగుతుండటం, భౌగోళిక రాజకీయ రిస్కులు తదితర అంశాలను దృష్టిల్లో పెట్టుకుంటే, ఈ షేర్‌ ధర అధికంగా ఉందని నిపుణులంటున్నారు.

## నవంబర్‌లో పెరిగిన దేశీ విమానయానం



**న్యూఢిల్లీ:** గతనెల్లో దేశీ విమాన ప్రయాణాల రద్దీ పెరిగింది. నవంబర్‌ నెలలో విమాన ప్రయాణికుల సంఖ్య 11.2 శాతం వృద్ధి చెందిందని డీజీసీఏ (డైరెక్టరేట్‌ జనరల్‌ ఆఫ్‌ సివిల్‌ ఏవియేషన్‌) వెల్లడించింది. 129.5 లక్షల మంది విమాన ప్రయాణం చేయగా, అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే పేర్కొన్న మేరకు వృద్ధి నమోదైంది. ఏడాది ప్రాతిపదికన వృద్ధి పరంగా స్పైస్‌ జెట్‌ అగ్రస్థానంలో నిలిచింది. 20.8 లక్షల ప్రయాణికులతో 42 శాతం వృద్ధిరేటును సాధించింది. ఇండిగో 23 శాతం వృద్ధిని నమోదు చేయగా, ఈ సంస్థ ఎయిర్‌లైన్స్‌లో 61.5 లక్షల మంది ప్రయాణించారు.

## భారత్‌ బాండ్‌ ఈటీఎఫ్‌ ప్రారంభం

**న్యూఢిల్లీ:** దేశంలో తొలి కార్పొరేట్‌ బాండ్‌ ఈటీఎఫ్‌(ఎక్స్ఛేంజ్‌ ట్రేడెడ్‌ ఫండ్‌), భారత్‌ బాండ్‌ ఈటీఎఫ్‌కు సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించింది. సంస్థాగత ఇన్వెస్టర్లకు కేటాయించిన వాటా 1.7 రెట్లు (రూ.2,980కోట్ల మేర బిడ్‌లు వచ్చాయి)ఓవర్‌ సబ్‌స్క్రైబయింది. రిటైల్‌ ఇన్వెస్టర్లు నేటి(శుక్రవారం) నుంచి సబ్‌స్క్రైబ్‌ చేయవచ్చు. ఈ నెల 20న ముగిసే ఈ ఈటీఎఫ్‌ ద్వారా రూ.15,000 కోట్లు సమీకరించాలని కేంద్రం యోచిస్తోంది. ఈ ఈటీఎఫ్‌ను ఎడెల్‌వీజ్‌ అసెట్‌ మేనేజ్‌మెంట్‌ కంపెనీ నిర్వహిస్తోంది. ఇన్వెస్టర్ల కనీస ఇన్వెస్ట్‌మెంట్‌ రూ.1,000. ప్రభుత్వ రంగ సంస్థల ట్రిపుల్‌ ఏ–రేటింగ్‌ బాండ్లలో ఈ ఈటీఎఫ్‌ ఇన్వెస్ట్‌ చేస్తుంది.

# రెండో రోజూ లాభాలు

- సానుకూల అంతర్జాతీయ సంకేతాలు
- నెల గరిష్టానికి రూపాయి
- సెన్సెక్స్‌ 169 పాయింట్ల లాభం
- 62 పాయింట్లు పెరిగి 11,972కు నిఫ్టీ



**బ్యాంక్‌**, వాహన షేర్ల దన్నుతో గురువారం స్టాక్‌ మార్కెట్‌ లాభాల్లో ముగిసింది. అంచనాలకు అనుగుణంగానే అమెరికా ఫెడరల్‌ రిజర్వ్‌ రేట్లను పెంచలేదు. వచ్చే ఏడాది కూడా రేట్లను పెంచకపోవచ్చని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని ఫెడ్‌ పేర్కొంది. దీంతో అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా మారాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుసగా ఏడో రోజూ పుంజుకొని నెల గరిష్టానికి చేరడం కలసివచ్చింది. దివాలా చట్టం, ఎన్‌బీఎస్‌ఎఫ్‌లకు ఊరటనిచ్చేలా క్రెడిట్‌ గ్యారంటీ స్కీమ్‌లో సవరణకు సంబంధించి కేంద్ర కేబినెట్‌ నిర్ణయాలు తీసుకోవడం సానుకూల ప్రభావం చూపించింది. ఇంట్రాడేలో 300 పాయింట్ల మేర లాభపడ్డ సెన్సెక్స్‌ చివరకు 169 పాయింట్ల లాభంతో 40,582 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 62 పాయింట్లు పెరిగి 11,972 పాయింట్ల వద్దకు చేరింది. ఐటీ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి.

అమెరికా–చైనాల మధ్య తక్షణం వాణిజ్య ఒప్పందం ఏదీ కుదరకపోయినా, ఈ నెల 15 నుంచి మొదలు కావలసిన సుంకాల విధింపు జాప్యమయ్యే అవకాశాలున్నాయన్న వార్తల కారణంగా ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయి. షాంఘై సూచీ మినహా మిగిలిన ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్‌ మార్కెట్లూ లాభపడ్డాయి. టాటా మోటార్స్‌ 7 శాతం లాభంతో రూ.173వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా పెరిగిన రెండో షేర్‌ ఇదే. రూపాయి బలపడటంతో ఐటీ షేర్లు నష్టపోయాయి. వరుసగా 5 రోజుల్లో 30% నష్టపోయిన యస్‌ బ్యాంక్‌ కోలుకుంది. ఇంట్రాడేలో 13% ఎగసిన ఈ షేర్‌ చివరకు 6% లాభంతో రూ. 45.35 వద్ద ముగిసింది.

## పీఅండ్‌ఎస్‌ జ్యుయలర్స్‌ స్కామ్‌ కేసులో సీబీఐ సోదాలు

**న్యూఢిల్లీ:** పీఅండ్‌ఎస్‌ జ్యుయలర్స్‌ రూ.568.52 కోట్ల మేర బ్యాంకులను మోసగించిన కేసులో.. సీబీఐ గురువారం ముంబై, లోనవాలా తదితర 13 ప్రాంతాల్లో కంపెనీ డైరెక్టర్లకు చెందిన భవనాల్లో సోదాలు నిర్వహించింది. మోసం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర తదితర అభియోగాల కింద పీఅండ్‌ఎస్‌ జ్యుయలర్స్‌తోపాటు, కంపెనీ డైరెక్టర్లు పరేష్‌షా, సాహిల్‌ పరేష్‌ షా, విరాజ్‌ చేతన్‌ షా, కొందరు అధికారుల పేర్లను సీబీఐ ఎఫ్‌ఐఆర్‌లో చేర్చింది.

## బులియన్‌ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,540 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,700 | | 0 |
| వెండి (కిలో) | 46,900 | | 0 |
| **చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,820 | ▲ | 70 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,020 | ▲ | 50 |
| వెండి (కిలో) | 46,900 | ▲ | 255 |
| **హైదరాబాద్‌** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,820 | ▲ | 70 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,020 | ▲ | 50 |
| వెండి (కిలో) | 46,900 | ▲ | 255 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,800 | ▲ | 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | ▲ | 190 |
| వెండి (కిలో) | 44,900 | ▲ | 500 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,680 | ▲ | 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,980 | ▲ | 100 |
| వెండి (కిలో) | 44,500 | ▲ | 500 |
| **ఏపీ బులియన్‌ అసోసియేషన్‌** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,940 | ▲ | 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,020 | ▲ | 50 |
| వెండి (కిలో) | 46,900 | | – |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్‌ -నెక్‌/100కు రూ.లలో) 13-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470–00 |
| చిత్తూరు | 458–00 |
| వరంగల్‌ | 439–00 |
| విజయవాడ | 452–00 |
| గోదావరి | 452–00 |
| **12–12–2019 ఫామ్‌ ధర...** | |
| హైదరాబాద్‌ | 436–00 |

# ఎయిర్‌టెల్‌ డీటీహెచ్‌, 'డిష్‌' విలీనం!

- ప్రపంచంలో అతిపెద్ద డీటీహెచ్‌ కంపెనీగా ఆవిర్భావం
- 4 కోట్ల చందాదారులతో 62 శాతం మార్కెట్‌ వాటా



**ముంబై:** దేశ టీవీ ప్రసార పంపిణీ విభాగంలో అతిపెద్ద కంపెనీ ఆవిర్భావానికి అడుగులు పడుతున్నాయి. ఎయిర్‌టెల్‌ డిజిటల్‌ టీవీ, డిష్‌ టీవీ విలీనానికి ఇరు కంపెనీల మధ్య కొన్ని నెలలుగా జరుగుతున్న చర్చలు ముగింపు దశకు చేరాయి. ఇరు కంపెనీల ప్రమోటర్లతోపాటు, ప్రైవేటు ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్‌పింకస్‌ డీల్‌ విషయమై ఒక అంగీకారానికి వచ్చినట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. ముందుగా డిష్‌ టీవీ తన డీటీహెచ్‌ వ్యాపారాన్ని వేరు చేస్తుంది. ఆ తర్వాత భారతీ టెలీ మీడియాతో విలీనం చేస్తుంది. ఎయిర్‌టెల్‌ డిజిటల్‌ టీవీకి భారతీ టెలీమీడియా మాతృ సంస్థగా ఉంది. ఇరు కంపెనీలు కలిస్తే 4 కోట్ల మంది టీవీ సబ్‌స్క్రయిబర్లతో ప్రపంచంలో అతిపెద్ద టీవీ డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీగా అవతరిస్తుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. విలీన పథకానికి సంబంధించి తుది అంశాలపై కసరత్తు జరుగుతున్నట్టు వెల్లడించాయి.

**ఆధిపత్యం..**

ఎయిర్‌టెల్‌ డిజిటల్‌ టీవీ, డిష్‌ టీవీలు కలవడం వల్ల డైరెక్ట్‌ టు హోమ్‌ (డీటీహెచ్‌) టీవీ ప్రసారాల పంపిణీ మార్కెట్లో ఆధిపత్యానికి అవకాశం వచ్చినట్టు అవుతుంది. ఎందుకంటే అప్పుడు 87 శాతం మార్కెట్‌ కేవలం రెండు సంస్థల చేతుల్లోనే ఉంటుంది. ఎయిర్‌టెల్‌ డిజిటల్‌, డిష్‌ టీవీ విలీన కంపెనీకి 4 కోట్ల కస్టమర్లు ఉంటారు. తద్వారా 62 శాతం మార్కెట్‌ వాటా ఈ సంస్థ చేతుల్లోనే ఉంటుంది. సెప్టెంబర్‌ నాటికి డిష్‌ టీవీకి 23.94 మిలియన్‌ చందాదారులు, ఎయిర్‌టెల్‌ డిజిటల్‌కు 16.21 మిలియన్‌ చందాదారులు ఉన్నారు. టాటా స్కై 25 శాతం మార్కెట్‌ వాటా కలిగి ఉంది. మిగిలిన వాటా సన్‌ టీవీకి చెందిన సన్‌ డైరెక్ట్‌ సొంతం. టెలికం మార్కెట్‌ మాదిరే డీటీహెచ్‌ మార్కెట్లోనూ ఒకప్పుడు ఆరుగురు ప్లేయర్లు ఉండేవారు. ఎస్సెల్‌ గ్రూపునకు చెందిన డిష్‌ టీవీ, కొంత కాలం క్రితం వీడియోకాన్‌ డీటీహెచ్‌ను కొనుగోలు చేసింది. రిలయన్స్‌ డిజిటల్‌ టీవీని వేరొక సంస్థ కొనుగోలు చేసింది. కానీ, ఈ సంస్థ సేవలు చాలా నామమాత్రంగానే ఉన్నాయి. ''విలీనం వల్ల యూజర్‌ నుంచి వచ్చే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) పరంగా ఒత్తిడి తగ్గిపోతుంది. అప్పుడు రెండు దేశవ్యాప్త కంపెనీలు, ఒక ప్రాంతీయ కంపెనీయే ఉంటుంది'' అని ఐడీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ రీసెర్చ్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రోహిత్‌ డోకానియా తెలిపారు.

### విలీన కంపెనీ లిస్టింగ్‌

**భారతీ** టెలీమీడియాలో 20 శాతం వాటాను వార్‌బర్గ్‌ పింకస్‌ 2017 డిసెంబర్‌లో కొనుగోలు చేసింది. ఇందుకు 350 మిలియన్‌ డాలర్లు పెట్టుబడి పెట్టింది. తాజా విలీనం తర్వాత కూడా వార్‌బర్గ్‌పింకస్‌ తన పెట్టుబడులను కొనసాగించనుంది. డీల్‌ అనంతరం భారతీ టెలీమీడియాను స్టాక్‌ మార్కెట్లలో లిస్ట్‌ కూడా చేయనున్నారు. డిష్‌ టీవీ డీటీహెచ్‌ వ్యాపారాన్ని భారతీ టెలీమీడియాలో విలీనం తర్వాత.. నాన్‌ డీటీహెచ్‌ సేవలతో కొనసాగుతుంది. ఇందులో డిష్‌ ఇన్‌ఫ్రా సేవలు ఉంటాయి. అలాగే, సీఅండ్‌ఎస్‌ మీడియానెట్‌లో 51% వాటా కలిగి ఉంటుంది. ''సెప్టెంబర్‌ నాటికే ఒప్పంద దశకు వచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుతో అంతా ఆగిపోయింది. మళ్లీ చర్చలు మొదలయ్యాయి''అని ఈ వ్యవహారం గురించి తెలిసిన ఓ వ్యక్తి తెలిపారు. టెలికం కంపెనీలు ఏజీఆర్‌ బకాయిలను 3 నెలల్లోపు చెల్లించాలంటూ ఇటీవల సుప్రీం తీర్పు వచ్చిన విషయం తెలిసిందే.

# వాల్‌మార్ట్‌తో టీఐహెచ్‌సీ ఒప్పందం!

**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** తెలంగాణలో తయారీ రంగంలోని ఖాయిలా పరిశ్రమలను పునరుద్ధరించేందుకు ఏర్పాటు చేసిన తెలంగాణ ఇండస్ట్రియల్‌ హెల్త్‌ క్లినిక్‌ (టీఐహెచ్‌సీ) అమెరికాకు చెందిన రిటైల్‌ బహుళ జాతి కంపెనీ వాల్‌మార్ట్‌తో ఒప్పందం చేసుకోనుంది. టీఐహెచ్‌సీలోని ఎంఎస్‌ఈలకు ఆన్‌లైన్‌ వేదికను అందించడంతో పాటు మార్కెటింగ్‌ అవకాశాలను కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని టీఐహెచ్‌సీ అడ్వైజర్‌ డాక్టర్‌ బి. యెర్రం రాజు 'సాక్షి బిజినెస్‌ బ్యూరో'కు తెలిపారు. ''రూ.100 కోట్ల సోషల్‌ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ కోసం పలు విదేశీ ఇన్వెస్టర్లతో చర్చలు జరుగుతున్నాయి. రెండేళ్ల లాకిన్‌ పీరియడ్‌తో 7 శాతం డివిడెండ్‌ను కేటాయిస్తాం. వచ్చే 3 నెలల్లో డీల్‌ క్లోజ్‌ చేస్తామని'' ఆయన పేర్కొన్నారు. కాగా, ఇప్పటి వరకు రాష్ట్రంలో ఖాయిలా పడ్డ 43 ఎంఎస్‌ఎంఈలను పునరుద్ధరించామని... వీటి ద్వారా సుమారు 1,100 మందికి ఉద్యోగ అవకాశాలొచ్చాయని చెప్పారు. 'ప్రస్తుతం మరొక 12 ఎంటర్‌ప్రైజ్‌లు పునరుద్ధరణ జాబితాలో ఉన్నాయి. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా నారీ పథకాన్ని ఏర్పాటు చేశాం. వార్షిక వడ్డీ రేటు 9 శాతంగా ఉంటుంది. గరిష్ట రుణం రూ.25 లక్షలు' అని ఆయన వివరించారు.

# గ్రీన్‌ బిల్డింగ్స్‌కి ప్రోత్సాహం: ఐఐఎఫ్‌ఎల్‌


మోను రత్ర

**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** నాన్‌ బ్యాంకింగ్‌ ఫైనాన్షియల్‌ కంపెనీ ఐఐఎఫ్‌ఎల్‌ హోమ్‌ ఫైనాన్స్‌.. నగరాల్లో అందుబాటు ధరల విభాగంలో పర్యావరణ అనుకూల భవనాల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. కుటుంబ్‌ పేరుతో ప్రధాన నగరాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. భవనాల రూపకల్పన, ప్రణాళిక, నిర్మాణంపై ఆర్కిటెక్టులు, చిన్న బిల్డర్లకు అవగాహన కల్పిస్తున్నట్టు కంపెనీ సీఈవో మోను రత్ర గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. పర్యావరణ అనుకూల విధానంలో భవనం నిర్మించడం ద్వారా నీరు 40 శాతం, విద్యుత్‌ 30 శాతం ఆదా చేయొచ్చని చెప్పారు. ప్రాజెక్టులకు అవసరమైతే రుణ సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు.

epaper.sakshi.com

# అట్టుడుకుతున్న అస్సాం

**‘పౌరసత్వ’ బిల్లుపై గువాహటిలో పెల్లుబికిన ఆగ్రహజ్వాలలు • పోలీసు కాల్పుల్లో ముగ్గురు మృతి?**

**పలు చోట్ల లాఠీచార్జి • ఇంటర్నెట్‌పై నిషేధం • రైళ్లు, విమాన సర్వీసులు బంద్**





ఆందోళనకారులపైకి తుపాకీ గురిపెట్టిన పోలీసు

గురువారం గువాహటిలో కర్ఫ్యూను లెక్కచేయకుండా ఆందోళనలో పాల్గొన్న వేలాదిమంది నిరసనకారులు

**న్యూఢిల్లీ/గువాహటి:** పార్లమెంట్ తాజాగా ఆమోదించిన పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అస్సాంలో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. గువాహటిలో యుద్ధ వాతావరణం కనిపించింది. కర్ఫ్యూను సైతం లెక్కచేయకుండా రోడ్ల దిగ్బంధం, గృహ దహనాలు, దుకాణాల లూటీకి పాల్పడుతుండటంతో పోలీసులు లాఠీచార్జి, కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు చెబుతుండగా ముగ్గురు మరణించారని ఆందోళనకారులు అంటున్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గురువారం విద్యా, వాణిజ్య సంస్థలు పని చేయలేదు. రవాణా వ్యవస్థ స్తంభించింది. అధికారులు ముందు జాగ్రత్తగా త్రిపుర, అసోంలకు రైలు సర్వీసులను రద్దు చేశారు. విమాన సర్వీసులను సైతం పలు ప్రాంతాలకు రద్దు చేశారు. సైనికులు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఇంటర్నెట్ సేవలపై మరో 48 గంటలపాటు ఆంక్షలు కొనసాగనున్నాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో అస్సాం వాసులకు ప్రధాని మోదీ ట్విట్టర్ ద్వారా పలు హామీలిచ్చారు. ఇంటర్నెట్‌పై నిషేధం ఉండగా ట్విట్టర్‌లో హామీల విషయం ప్రజలకెలా తెలుస్తుందని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది.

**గువాహటి యుద్ధరంగం**

రాష్ట్ర రాజధాని గువాహటిలోనే ఆందోళనల ప్రభావం ఎక్కువగా ఉంది. నగరంలో ఆందోళనకారులు భవనాలు, దుకాణాలకు నిప్పు పెట్టడం, ధ్వంసం చేయడం, రోడ్లపై టైర్లు కాల్చడం, అడ్డంకులు కల్పించడం, పోలీసులతో ఘర్షణలకు దిగారు. దీంతో పలుచోట్ల పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు చనిపోయారని అధికారులు అంటున్నారు. అయితే, ముగ్గురు మృతి చెందారని ఆందోళన కారులు అంటున్నారు. గువాహటిలో పర్యటిస్తున్న అస్సాం పోలీస్ చీఫ్ భాస్కర్ జ్యోతి మహంత కాన్వాయ్‌పై కొందరు రాళ్లు విసిరారు. ఈ ఘటనలో ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ఎవరికీ ఎటువంటి అపాయం సంభవించలేదు. పోలీసు ఆంక్షలను బేఖాతరు చేస్తూ ఆసు(ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్) పిలుపు మేరకు గువాహటిలోని లతాశిల్ మైదానంలో సినీ, సంగీత పరిశ్రమకు చెందిన ప్రముఖులు సహా వందలాదిగా ప్రజలు, విద్యార్థులు హాజరయ్యారు. ఆందోళనకారులు దిగ్బంధించడంతో వేలాది మంది ప్రయాణికులు గువాహటి విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. రహదారుల దిగ్బంధం కారణంగా దిబ్రూగఢ్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పౌరవిమానయాన శాఖ తెలిపింది. డిబ్రూగఢ్‌లో ముఖ్యమంత్రి సోనోవాల్, ఎమ్మెల్యే బినోద్ హజారికా నివాసాలకు, వాహనాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. పోలీసు సర్కిల్ అధికారి కార్యాలయానికి కూడా నిప్పు పెట్టారు. కామ్‌రూప్ జిల్లాలో దుకాణాలు, విద్యా సంస్థలు, కార్యాలయాలు మూతపడ్డాయి. రవాణా వ్యవస్థ స్తంభించింది. 31వ నంబర్ జాతీయ రహదారిని దిగ్బంధించారు. జోర్హాత్ జిల్లాలో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ విధించారు. 39వ నంబర్ జాతీయరహదారిపై బైఠాయించిన వారిని చెదరగొట్టేందుకు గోలాఘాట్ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. రంగియాలో కూడా పోలీసు కాల్పులు జరిగాయి.

**విమాన సర్వీసుల రద్దు**

అస్సాంలో శాంతిభద్రతల నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసుకుంటున్నట్లు ఇండిగో, విస్తారా, ఎయిరిండియా, స్పైస్‌జెట్ ప్రకటించగా గో ఎయిర్, ఎయిర్ ఏషియా ఇండియా షెడ్యూల్‌ను మార్చుతున్నట్లు తెలిపాయి. ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించాయి. జాతీయతను, దేశ సమగ్రతను దెబ్బతీసేవి, హింసను ప్రేరేపించే అంశాలను ప్రసారం చేయవద్దని శాటిలైట్ టీవీ చానెళ్లను కేంద్రం కోరింది.

**ఇంటర్నెట్‌పై నిషేధం కొనసాగింపు**

సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వ్యాపించకుండా ప్రభుత్వం ఇంటర్నెట్ సర్వీసులపై మరో 48 గంటలపాటు నిషేధం పొడిగించింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చే చర్యల్లో భాగంగా ప్రభుత్వం గువాహటి పోలీస్ అదనపు కమిషనర్ దీపక్ కుమార్‌ను తొలగించి మున్నాప్రసాద్ గుప్తాను నియమించింది. అదేవిధంగా, అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) ముకేశ్ అగర్వాల్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో జీపీ సింగ్‌కు బాధ్యతలు అప్పగించింది.

**త్రిపుర,అస్సాంలకు రైళ్లు బంద్**

ఆందోళనల దృష్ట్యా అస్సాం, త్రిపుర వైపు వెళ్లే రైళ్లను రద్దు చేయడమో లేక కుదించడమో చేస్తున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ఆందోళనల కారణంగా ప్రయాణికులు పలు ప్రాంతాల్లో చిక్కుకు పోయారని తెలిపింది. 12 కంపెనీల రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌ను తరలిస్తున్నట్లు వెల్లడించింది.



## ఆందోళన వద్దు సోదరా..

- ‘ఈశాన్య’ ప్రజలనుద్దేశించి మోదీ
- జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం

**ధన్‌బాద్:** పౌరసత్వ సవరణ బిల్లు (క్యాబ్) పార్లమెంటు ఆమోదించడాన్ని నిరసిస్తూ అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనలు అంతకంతకూ ఉధృతంగా మారడంతో ప్రధాన మంత్రి మోదీ వారిని శాంతింప జేసే ప్రయత్నాలు చేశారు. కొత్త చట్టంపై ఎలాంటి ఆందోళన వద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ ధన్‌బాద్ ఎన్నికల ర్యాలీలో గురువారం ప్రసంగించారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఈశాన్య రాష్ట్ర ప్రజలకున్న ప్రత్యేక గుర్తింపుని, సంస్కృతిని, భాషని కాపాడతామని హామీ ఇచ్చారు. క్యాబ్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈశాన్య ప్రాంతంలో అస్సాం సహా ప్రతీ రాష్ట్రంలో ఆదివాసీ సమాజ సంస్కృతీ సంప్రదాయాల్ని, వారి జీవన విధానాన్ని పరిరక్షిస్తామన్నారు. అస్సాం, మేఘాలయ, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కిందకు వచ్చే ఆదివాసీ ప్రాంతాలను కొత్త చట్టం నుంచి మినహాయించినట్టు మోదీ చెప్పారు. అంతకు ముందు ప్రధాని ఇంగ్లీషు, అస్సామీ భాషల్లో వరస ట్వీట్లు చేస్తూ స్థానిక హక్కులు కాపాడే నిబంధన 6 స్ఫూర్తికి భంగం కలిగించబోమన్నారు.

**క్లుప్తంగా...**

## ‘ఆర్టికల్ 370’పై త్వరలో నిర్ణయం

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ కొనసాగింది. విచారణను ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసే విషయంపై తుది నిర్ణయం.. అన్ని పక్షాల వాదనలు విన్న తరువాత తీసుకుంటామని జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం వెల్లడించింది. సుప్రీం కోర్టు ఐదుగురు సభ్యుల వేర్వేరు ధర్మాసనాలు 1959లో ఒకలా, 1970లో మరోలా విభిన్న తీర్పులిచ్చాయని పిటిషన్‌దారుల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## ..అందుకే పాస్‌పోర్ట్‌లో కమలం

**న్యూఢిల్లీ:** కొత్తగా జారీ చేస్తున్న పాస్‌పోర్ట్‌ల్లో కమలం గుర్తును ముద్రించడంపై గురువారం విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. కమలం గుర్తును ముద్రించడం నకిలీ పాస్‌పోర్ట్‌లను గుర్తించేందుకు ఉద్దేశించిన భద్రతాచర్యల్లో భాగమని తెలిపింది. ‘కమలం జాతీయ పుష్పం. భద్రతా చర్యల్లో భాగంగా దీన్ని ముద్రించాం’ అని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. మిగతా జాతీయ చిహ్నాలను కూడా రొటేషన్ పద్ధతిలో ముద్రిస్తామని వివరించారు. ఈ అంశాన్ని బుధవారం లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు ఎంకే రాఘవన్ ఈ అంశాన్ని లేవనెత్తి.. కేరళలోని కోజికోడ్‌లో కమలం గుర్తు ముద్రించిన పాస్‌పోర్ట్‌లు జారీ అయ్యాయని, ఇది ప్రభుత్వ కాషాయీకరణలో భాగమని విమర్శించారు.

## ఢాకా ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో పేలుడు: 13 మంది మృతి

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో అక్రమ నిర్వహణలో ఉన్న ఓ ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడు వల్ల 13 మంది మృత్యువాత పడ్డారు. 21 మంది తీవ్రగాయాల పాలయ్యారు. ఢాకా శివారు కెరాణీగంజ్‌లోని ప్లాస్టిక్ కంపెనీలో బుధవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో పనిచేస్తోన్న 13 మంది మరణించారు. ఈ ప్రమాదం ఎందుకు సంభవించిందనేది నిర్దిష్టంగా తెలియరాలేదు. నజ్రుల్ ఇస్లాం అనే వ్యక్తికి చెందిన ఈ కంపెనీలో ఈ యేడాది ఫిబ్రవరిలో సైతం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులను తయారుచేసే ఈ ఫ్యాక్టరీలో మొత్తం 300 మంది రెండు షిఫ్టుల్లో పనిచేస్తారనీ, బుధవారం ఫ్యాక్టరీలో ప్రమాద సమయంలో 150 మంది పనిచేస్తున్నట్టు కార్మికులు తెలిపారు.

## జార్ఖండ్ మూడో దశలో 62 శాతం పోలింగ్

**రాంచీ:** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మూడో దశ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎనిమిది జిల్లాల్లో 17 సీట్లకు జరుగుతోన్న ఈ ఎన్నికల్లో 56 లక్షల మంది (62.6 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జార్ఖండ్ ప్రధాన ఎన్నికల అధికారి వినయ్ కుమార్ చౌబే వెల్లడించారు. వీరిలో 26 లక్షల మంది మహిళలు, 86 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాంచి, హటియా, కాంకే, బర్ఖాతా, రామ్‌గర్‌లలో సాయంత్రం 5 గంటల వరకు.. మిగతా ప్రాంతాల్లో సాయంత్రం 3 గంటల వరకు పోలింగ్ జరిగింది.

## రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంటు ఆమోదం

**న్యూఢిల్లీ:** లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను పొడిగించే బిల్లు పార్లమెంటు ఆమోదం పొందింది. ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్లను మరో పదేళ్లు పొడిగించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ 126వ సవరణ బిల్లు గురువారం రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఎస్సీ, ఎస్టీలు ఇంకా వెనకబడే ఉన్నందున, వారిలో క్రీమీలేయర్‌ను వర్తింపజేయాల్సిన అవసరం లేదని తాము భావిస్తున్నామన్నారు. ఈ సవరణ ద్వారా 2030, జనవరి 25 వరకు రిజర్వేషన్లను పొడిగిస్తారు. ఈ బిల్లును 10వ తేదీన లోక్‌సభ ఆమోదించింది. చర్చ సందర్భంగా రవిశంకర్ ప్రసాద్‌కు, విపక్ష నేత గులాంనబీ ఆజాద్‌కు మధ్య వాగ్యుద్ధం చోటు చేసుకుంది. అనంతరం కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం, చైర్మన్ వెంకయ్యానాయుడు విజ్ఞప్తి మేరకు వారు సభకు తిరిగివచ్చారు.

# సుప్రీంకోర్టుకు పౌరసత్వ బిల్లు

- పిటిషన్ వేసిన ముస్లింలీగ్
- బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ:** వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లును సవాలు చేస్తూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. పౌరసత్వ బిల్లు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో ఒకటైన సమానత్వ హక్కును ఉల్లంఘిస్తోందని ఆ పిటిషన్‌లో ఐయూఎంఎల్ ఆరోపించింది. మత ప్రాతిపదికన ఒక వర్గానికి చెందిన అక్రమ వలసదారులకు పౌరసత్వం కల్పించే ఆ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. పౌరసత్వ సవరణ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. తాజాగా, గురువారం రాత్రి ఈ బిల్లుకు రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. దాంతో ఈ బిల్లు పౌరసత్వ (సవరణ) చట్టంగా మారింది. ఆ బిల్లును వ్యతిరేకిస్తూ ఐయూఎంఎల్ తరఫున న్యాయవాది పల్లవి ప్రతాప్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తక్షణమే బిల్లుకు సంబంధించిన కార్యాచరణపై స్టే విధించాలని కోర్టును కోరారు. ఏ చట్టమైనా అక్రమ వలసదారులను ఉద్దేశించి రూపొందించాలంటే.. మతం, కులం, జాతీయత ఆధారంగా కాకుండా.. మొత్తం అక్రమ వలసదారులను ఒక ప్రత్యేక వర్గంగా గుర్తించి చట్టాన్ని రూపొందించాలని పేర్కొన్నారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైనదే కాదు, అమానవీయమైనది కూడా అని అన్నారు. కాగా, ఈ బిల్లు సుప్రీంకోర్టు కొట్టివేయడం తథ్యమని కాంగ్రెస్ నాయకుడు మనీశ్ తివారీ వ్యాఖ్యానించారు.

**పార్లమెంట్లో రభస**

పౌరసత్వ సవరణ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందడంతో ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ హింసను రాజేస్తోందని అధికార పక్షం వ్యాఖ్యానించడంతో గురువారం లోక్‌సభలో గందరగోళం నెలకొంది. పౌరసత్వ సవరణ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజ్వరిల్లుతున్న హింస అంశాన్ని జీరో అవర్‌లో కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌధురి లేవనెత్తారు. ఈ బిల్లు వల్ల మొత్తం ఈశాన్య ప్రాంతమంతా అట్టుడుకుతోందన్నారు. ‘ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. ఈశాన్యం మరో కశ్మీర్‌లా మారింది’ అన్నారు. వ్యూహాత్మకంగా ఎంతో ముఖ్యమైన ఈ రెండు ప్రాంతాల్లో సాధారణ స్థితి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి స్పందిస్తూ.. ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీనే హింసను రాజేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జోషి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ నుంచి వాకౌట్ చేశారు. వారితో పాటు డీఎంకే సభ్యులు కూడా సభ నుంచి వెళ్లిపోయారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న అధిర్ రంజన్

# ‘అయోధ్య’ రివ్యూ పిటిషన్ల కొట్టివేత

**వీటికి ఎలాంటి అర్హత లేదన్న సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** అయోధ్యలోని వివాదాస్పద ప్రాంతంలో రామాలయ నిర్మాణానికి అడ్డంకి తొలగిపోయింది. నవంబర్ 9వ తేదీన వెలువరించిన చారిత్రక తీర్పును సమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్లన్నిటినీ సుప్రీంకోర్టు కొట్టివేసింది. తీర్పు సమీక్ష కోరుతూ దాఖలైన మొత్తం 19 పిటిషన్లకు ఎలాంటి విచారణార్హత లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ‘రివ్యూకోసం దాఖలైన పిటిషన్లను, జత చేసిన పత్రాలను క్షుణ్నంగా పరిశీలించాం. వీటికి ఎలాంటి ప్రాతిపదిక లేదని భావిస్తున్నాం. అందుకే ఈ పిటిషన్లన్నిటినీ తిరస్కరిస్తున్నాం’ అంటూ వాస్తవ కక్షిదారులు వేసిన 10 పిటిషన్లను కొట్టివేస్తూ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ఈ ధర్మాసనం పేర్కొంది. తీర్పుపై సమీక్ష కోరేందుకు అనుమతించాలంటూ మూడోపక్షం(థర్డ్ పార్టీ) దాఖలు చేసిన 9 పిటిషన్లను కూడా ధర్మాసనం తోసిపుచ్చింది. ఇందులోని 10 పిటిషన్లు వాస్తవ కక్షిదారులవి కాగా, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, దాని మద్దతుతో వేసినవి 8, హక్కుల కార్యకర్తలు 40 మంది కలిసి వేసిన మరో పిటిషన్ ఉన్నాయి. వీటితోపాటు అఖిల భారత హిందూ మహాసభ వేసిన పిటిషన్, నిర్మోహి అఖాడా వేసిన రివ్యూ పిటిషన్ కూడా తిరస్కరణకు గురయ్యాయి.

**ఆఖరి చాన్స్ ‘క్యూరేటివ్’**

అన్ని రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టు తిరస్కరణకు గురికావడంతో కక్షిదారులకు ఇక ఒకే ఒక్క అవకాశం మిగిలి ఉంది. అదే క్యూరేటివ్ పిటిషన్. తీర్పులో ఏవైనా లోపాలున్నాయని అత్యున్నత న్యాయస్థానం భావించిన పక్షంలో వాటిని సవరించేందుకు క్యూరేటివ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్వీకరిస్తుంది. పునస్సమీక్షకు తగిన ఆధారాలున్నాయని న్యాయస్థానం భావించినా, విచారణ చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

**ఆగ్రహం..**



దేశంలో మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో నిర్వహిస్తున్న ర్యాలీని పోలీసులు బారికేడ్లతో అడ్డుకోవడంతో పైకెక్కి నినదిస్తున్న ఓ మహిళ

# ముగిసిన బ్రిటన్ ఎన్నికలు

- నేడు ఫలితాలు
- గెలుపుపై కన్సర్వేటివ్, లేబర్ పార్టీల ధీమా



ఓటు వేసేందుకు వస్తున్న జాన్సన్, కార్బిన్

**లండన్:** బ్రిటన్ ప్రతినిధుల సభకు గురువారం ఎన్నికలు జరిగాయి. ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్‌ల్లోని మొత్తం 650 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 3,322 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కాగా, అప్పటి నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరారు. బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్, ప్రతిపక్ష నేత జెరెమి కార్బిన్ ఉదయమే ఓటేశారు. బ్రిటన్‌లో డిసెంబర్ నెలలో సార్వత్రిక ఎన్నికలు జరగడం దాదాపు ఒక శతాబ్దం అనంతరం ఇదే తొలిసారి. ఏ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చే అవకాశం లేదని, హంగ్ పార్లమెంట్ ఏర్పడనుందని ప్రీ పోల్ సర్వేలు వెల్లడించాయి. పోలింగ్ ముగియగానే కౌంటింగ్ ప్రారంభమైంది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయానికి ఫలితాలపై ఒక స్పష్టత వచ్చే అవకాశముంది. 2017లో జరిగిన ఎన్నికల్లో భారతీయ సంతతికి చెందిన 12 మంది విజయం సాధించారు. ఈ సారి ఆ సంఖ్య మరింత పెరగొచ్చని భావిస్తున్నారు.

## ట్రంప్- గ్రెటా ట్వీట్ వార్!



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోరుజేసుకున్నారు. పర్యావరణ యువ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్‌ను ప్రఖ్యాత పత్రిక ‘టైమ్’ పర్సన్ ఆఫ్ ది ఈయర్‌గా ప్రకటించడంపై మండిపడ్డారు. అది తెలివితక్కువ నిర్ణయమని టైమ్ పత్రికను విమర్శించారు. ‘గ్రెటా ముందు తన కోపాన్ని అదుపులో ఉంచుకోవడంపై దృష్టిపెట్టాలి. ఆ తరువాత ఓ ఫ్రెండ్‌తో కలిసి మంచి సినిమాకు వెళ్లాలి. చిల్.. గ్రెటా చిల్!’ అని గురువారం ట్రంప్ ట్వీట్ చేశారు. దీనికి స్పందనగా గ్రెటా థన్‌బర్గ్ తన ట్విట్లర్ బయోడేటాను మార్చారు. ‘నేను కోపాన్ని అదుపులో పెట్టుకోవడంపై దృష్టి పెట్టిన ఒక టీనేజర్‌ను. ప్రస్తుతం ఒక ఫ్రెండ్ తో కలిసి సినిమా చూస్తూ ఎంజాయ్ చేస్తున్నాను’ అని ట్రంప్‌నకు రిటార్ట్ ఇచ్చారు.

# సేనకు హోం, ఎన్సీపీకి ఆర్థికం

**మహారాష్ట్రలో మంత్రుల శాఖలు ఖరారు**

**ముంబై:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేతో పాటు ప్రమాణ స్వీకారం చేసిన మంత్రుల శాఖలు ఖరారయ్యాయి. కీలక హోం మంత్రిత్వ శాఖను శివసేన తన వద్ద అంటిపెట్టుకుంది. శివసేనకు చెందిన మంత్రి ఏక్‌నాథ్ షిండేకు హోంతో పాటు పట్టణాభివృద్ధి, పర్యావరణం, పర్యాటక, పార్లమెంటరీ వ్యవహారాలు శాఖలు, మరో శివసేన మంత్రి సుభాష్ దేశాయ్‌కి పరిశ్రమలు, ఉన్నత, సాంకేతిక విద్య, యువజన వ్యవహారాల శాఖలు అప్పగించారు. ఎన్సీపీ మంత్రి జయంత్ పాటిల్‌కు ఆర్థిక శాఖను, గృహనిర్మాణం, మరికొన్ని శాఖల బాధ్యతలు అప్పగించారు. మరో ఎన్సీపీ మంత్రి ఛగన్ భుజ్‌భల్‌కు నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి శాఖలు కేటాయించారు. కాంగ్రెస్ మంత్రి బాలా సాహెబ్ తోరట్‌కు రెవెన్యూ, విద్యుత్, తదితర శాఖలు ఇచ్చారు. మరో కాంగ్రెస్ మంత్రి నితిన్ రౌత్‌కు పీడబ్ల్యూడీ, గిరిజనాభివృద్ధి శాఖలు అప్పగించారు. కాగా. గురువారం ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ 79వ పుట్టిన రోజును పురస్కరించుకుని సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఆయన నివాసంలో పూలగుచ్ఛం అందజేశారు.



పవార్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న సీఎం ఉద్ధవ్

# త్వరలో నిర్భయ దోషులకు ఉరి అమలు ?



- ఇద్దరు తలారుల్ని పంపండి
- యూపీని కోరిన తీహార్ జైలు అధికారులు

**లక్నో:** నిర్భయ కేసులో దోషులకు ఉరి శిక్ష అమలు త్వరలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలో నిర్భయ దోషుల్ని ఉంచిన తీహార్ జైలు అధికారులు ఇద్దరు తలారుల్ని పంపవలసిందిగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. దీనికి స్పందించిన యూపీ అదనపు డైరెక్టర్ జనరల్ (జైళ్లు) ఆనంద్ కుమార్ తాము తలారుల్ని పంపడానికి సిద్ధంగా ఉన్నామని గురువారం విలేకరులకు వెల్లడించారు. తీహార్ జైల్లో ఉరిశిక్ష అమలు చేయడానికి తలారులు లేరు. అందుకే అవసరమైతే అతి తక్కువ కాల వ్యవధిలో చెప్పినా తలారుల్ని పంపాలంటూ ఢిల్లీ జైళ్ల శాఖ నుంచి తమకు డిసెంబర్ 9న ఫ్యాక్స్ ద్వారా ఒక లేఖ అందిందని ఆనంద్ కుమార్ వెల్లడించారు. అయితే ఆ లేఖలో నిర్భయ దోషుల ఉరి ప్రస్తావన లేదు. తలారుల అవసరం ఉందని మాత్రమే ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, లక్నో జైళ్లలో మాత్రమే తలారులు ఉన్నారు.

**17న అక్షయ్ రివ్యూ పిటిషన్‌పై విచారణ**

నిర్భయ దోషుల్లో ఒకరైన అక్షయ్ కుమార్ సింగ్ మరణ శిక్షను సమీక్షించాల్సిందిగా సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు 17న విచారణ జరపనుంది. ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోతూ ఉండడంతో అందరి ఆయుష్షు తగ్గిపోతోందని, ఇక ఉరి తియ్యడమెందుకని అక్షయ్ ఆ పిటిషన్‌లో ప్రశ్నించారు. దీనిపై ఈ నెల 17, మధ్యాహ్నం ఓపెన్ కోర్టులో విచారణ జరగనుంది. ఇప్పటికే మిగిలిన దోషులు వినయ్ శర్మ, పవన్ గుప్తా, ముఖేష్ సింగ్‌లను ఉరి తియ్యడానికి న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయాయి. 2012 డిసెంబర్ 16 రాత్రి ఢిల్లీ బస్సులో నిర్భయను పాశవికంగా హత్యాచారం చేసిన విషయం తెలిసిందే.

**‘ఉన్నావ్’ కన్నా ఘోరంగా చంపుతా!**

**బాగ్‌పత్:** ‘నాకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెబితే.. ఉన్నావ్ అత్యాచార బాధితురాలి కన్నా దారుణంగా చంపేస్తా’అని ఓ అత్యాచారం కేసులో నిందితుడు ఏకంగా బాధితురాలి ఇంటి గోడపై పోస్టర్ అతికించాడు. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో భయానికి గురైన బాధితురాలు ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే నిందితుడిని అరెస్ట్ చేసి, లేఖపై దర్యాప్తు చేస్తున్నారు. గతేడాది ఢిల్లీలోని ముఖర్జీనగర్‌లో బాధితురాలు అత్యాచారానికి గురైనట్లు ఎస్పీ ప్రతాప్ గోపేంద్ర తెలిపారు. తన గ్రామానికే చెందిన నిందితుడు సోహ్రాన్ సింగ్ తన ఇంటి గోడపై బెదిరింపు లేఖ అతికించినట్లు బాధితురాలు పేర్కొన్నట్లు వివరించారు. గతేడాది ముఖర్జీనగర్‌లో బాధితురాలిని సోహ్రాన్ ఓ స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి అత్యాచారం చేశాడని, పైగా వీడియో తీసి బెదిరిస్తున్నాడని తెలిపారు. ఈ కేసు ఢిల్లీ కోర్టులో శుక్రవారం విచారణకు రానుంది. ఈ కేసులో సోహ్రాన్ బుధవారమే బెయిల్‌పై బయటకు వచ్చాడు.

# పైపుల్లో 14 కేజీల పసిడి

**రూ.5.46 కోట్ల విలువ చేసే బంగారం పట్టివేత ● ఇద్దరు విదేశీయుల అరెస్టు**

**శంషాబాద్:** పైపుల్లో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని డీఆర్ఐ అధికారులు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. దుబాయ్ నుంచి వస్తున్న ఎయిరిండియా విమానం ఏఐ–952 గురువారం తెల్లవారుజామున 5.30కి శంషాబాద్ విమానాశ్రయంలో దిగింది. బంగారం అక్రమ రవాణా గురించి విశ్వసనీయ సమాచారం రావడంతో అప్రమత్తమైన డీఆర్ఐ అధికారులు.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు తాము కూర్చున్న 31ఏ, 32ఏ సీట్ల కింద బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చినట్లు గుర్తించారు. నల్లని టేపుతో చుట్టిన బంగారాన్ని మొత్తం 14 హోలో పైపుల్లో దాచినట్లు అధికారులు తెలిపారు. పైపుల నుంచి 112 బంగారు బిస్కెట్ ముక్కలను బయటకు తీశారు. మొత్తం 14 కేజీల బరువు కలిగిన ఈ బంగారం విలువ రూ.5.46 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. బంగారాన్ని అక్రమ రవాణా చేస్తున్న వారిలో ఒకరు దక్షిణ కొరియాకు చెందిన వ్యక్తి కాగా మరొకరు చైనాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇంత భారీ మొత్తంలో వీరితో బంగారాన్ని అక్రమంగా రవాణా చేయించింది ఎవరనే విషయంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేశారు.














SAATCHI & SAATCHI


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.